1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 7
పుటలు :52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

అక్టోబరు 2018

'తాపీ ధర్మారావు జీవన సాఫల్య పురస్కారానికి సరైన ఎంపిక ఏటుకూరి ప్రసాద్'




తెలుగు సాహిత్యానికి,
సమాజానికి వైతాళికుడుగా
తాపీ ధర్మారావును ఎందుకు చేర్చుకోలేదు?





అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల వాగ్దానపత్రాల్లో
పాలన, విద్యారంగాల్లో తమ భాషావిధానాన్ని ప్రకటించాలి

# మండలి బుద్ధప్రసాద్‌గారికి
# ‘బొల్లిముంత శివరామకృష్ణ జీవిత సాఫల్య పురస్కారం’



అభ్యుదయ సాహిత్యరంగంలో ప్రఖ్యాతుడూ, సినిమా రచయితగా ప్రత్యేకంగా కీర్తి గడించిన కీ.శే. బొల్లిముంత శివరామకృష్ణ పేర - సాహితీ సాంస్కృతిక ఉత్సవాలను నిరంతరంగా నిర్వహిస్తున్న ఖ్యాతి తెనాలికి దక్కింది. ఆ సంస్థ నుంచి ఇచ్చే ‘బొల్లిముంత శివరామకృష్ణ జీవితకాల పురస్కారాన్ని ఈ ఏడాది శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారికి ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆం.ప్ర. శాసనసభ స్పీకర్ డా॥ కోడెల శివప్రసాద్. రాష్ట్ర సృజనాత్మకత-సంస్కృతి సమితి, ఆం.ప్ర నాటక అకాడమీవారి సౌజన్యంతో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సెప్టెంబరు 8 నుండి 12 వరకు 5 రోజులపాటు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ 2018 సాంస్కృతిక ఉత్సవాల్లో తొలి రోజున ఈ పురస్కార సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమమంతా స్థానిక శాసనసభ్యులు, మాజీమంత్రి శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. బొల్లిముంత కృష్ణ, చందు సుబ్బారావు, ఒ. మార్కండేయులు, యెర్రంశెట్టి హనుమంతరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# తెలుగుతోనే తెలుగుసమాజ వికాసం - గుంటూరులో సభ






మాతృభాష మాధ్యమం (మీడియం)లోనే తొలినుండీ ఉన్నత విద్యల దాకా చదువుకోవడం వల్ల సమయాన్నీ ఖర్చునూ తగ్గించుకోవచ్చునని, ఆ విధంగా ఆ వనరులను పూర్తిగా మన సమాజ వికాసం కోసం వినియోగించుకోవచ్చుననీ - తెలుగు భాషా శాస్త్రజ్ఞుడు, హైదరాబాదు యూనివర్సిటీఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు పై సభలో ప్రసంగిస్తూ అన్నారు. బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారు గుంటూరులో నిర్వహించిన ‘తెలుగుతోనే తెలుగు సమాజ వికాసం’ అనే సభకు తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, ‘అమ్మనుడి’ పత్రిక సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సభలో డా॥ గారపాటి తన ప్రసంగంలో - మన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్పష్టమైన భాషా విధానాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మాతృభాషలో విజ్ఞాన సాధన చేయడం పూర్తిగా శాస్త్రీయ విధానం అనీ, ఇది భావోద్రేకాల విషయం కాదనీ ఆయన వివరించారు. ప్రపంచంలో పురోగమిస్తున్న అనేకదేశాలు తమ మాతృభాషలతోనే ముందడుగు వేశాయని, అన్ని విధాలా అన్నిరంగాలలో వారు అభివృద్ధి చెందుతున్నదని ఆయన అన్నారు. తొలుత డా॥ వెన్నిసెట్టి సింగారావు స్వాగతం పలుకుతూ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారు నిరంతరంగాభాషా సంస్కృతుల కోసం అంకితమై చేస్తున్న కృషిని తెలిపి, అందులో భాగంగానే ఇప్పుడు ఈ సభను ఏర్పాటు చేశామన్నారు.

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




అక్టోబర్ 2018

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| రాజకీయ పార్టీలకు విన్నపం : | మీ భాషా విధానాన్ని స్పష్టంగా ప్రకటించండి | | 5 |
| అమెరికా వార్త : | డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితివారి లఘుచిత్ర పోటీ | | 6 |
| సంపాదకహృదయం : | ప్రాధికార సంస్థ, ప్రభుత్వం వెంటనే స్పందించాలి | | 7 |
| ముందడుగు : | జపాన్ అట్లా... మనం ఇట్లా...! | ఎన్. ముక్తేశ్వరరావు | 8 |
| ప్రాధికార సంస్థ : | ప్రాధికార సంస్థకు సాధికారత ఎంత – | రమేష్ పట్నాయక్ | 9 |
| తెలుగు బోధన : | 'ం' ని విడిగా పలకగలమా | రంగనాయకమ్మ | 11 |
| కంప్యూటర్లు – తెలుగు : | తెలుగు భాషకు ఆధునిక హోదా – 9 | వీవెన్ | 13 |
| పురస్కార సభ : | డా॥ఏటుకూరికి 'తాపీ ధర్మారావు జీవన సాఫల్య పురస్కారం' | | 15 |
| ముఖాముఖి : | డా॥ ఏటుకూరితో ముఖాముఖి | సన్నిధానం నరసింహశర్మ | 19 |
| వేమన : | శబ్ద గాండీవి వేమన....3 | కీ.శే.దుర్గానంద్ | 23 |
| సాహిత్యరంగం : | మనవాడే...గొప్పవాడు... | మధురాంతకం నరేంద్ర | 29 |
| పిట్ట చూపు : | నిరంకుశ పాలకులకు హెచ్చరిక.... | చలసాని నరేంద్ర | 39 |
| పుస్తక సమీక్ష : | | రామడుగు వెంకటేశ్వరశర్మ | 47 |
| గ్రంథాలయం : | | | 50 |

**ధారావాహికలు :**

| | | |
|---|---|---|
| 1. మౌనంలోని మాటలు 12 : సంచారి రాపోళ్ళ నాగప్ప ఆత్మకథ | – ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు | 31 |
| 2. బౌద్ధం-వైజ్ఞానిక మార్గం –18 ..... | బొర్రా గోవర్ధన్ | 41 |

**భాషోద్యమ కథానిక:**

| | | |
|---|---|---|
| 1. తెగిపోతున్న బంధాలు | యనమండల ఆనంద నాయుడు | 25 |
| 2.చదువు (చిన్నకథ) | వడలి వెంకట నాగవరలక్ష్మి | 28 |
| 3.ఎదుగనిబిడ్డ ..... | కీ.శే.అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు | 36 |

**కవితలు :**

| | | |
|---|---|---|
| 1. చనిపోయి బ్రతకడం | తోట పద్మశ్రీ | 14 |
| 2. ఎవరోవారు | 'కృష్ణుడు' | 27 |
| 3. భావాలతో కలిపేది భాష | మహమ్మద్ ఖాజా మైనుద్దీన్ | 48 |



రేఖా చిత్రాలు : **పావులూరి చిదంబరేశ్వరరావు** కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (Watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

– సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ–520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|
| శాశ్వత చందా : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం. 58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (*క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్*) లో ప్రచురితమవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.

సంపాదకుడు, **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com



## రాజకీయ పార్టీలకు విన్నపం

# పరిపాలన, న్యాయస్థానాలు, విద్యాబోధన రంగాల్లో మీ భాషా విధానాన్ని స్పష్టంగా ప్రకటించండి

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు రెండూ తెలుగు రాష్ట్రాలు. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారభాష తెలుగు అని ఎన్నడో ప్రకటించడం అధికారికంగా జరిగింది. కాని ఈ విషయమై ప్రభుత్వాలు పట్టనితనంతో వ్యవహరించడంతో తెలుగు ప్రజలు అన్ని స్థాయిల్లో తమ గుర్తింపును కోల్పోతున్నారు. ఇంగ్లీషులోనే పాలన అంతా జరుగుతున్నందున ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం దిగజారిపోతున్నది. న్యాయస్థానాల రాతకోతలన్నీ పరభాషలోనే. విద్యారంగంలో తెలుగు వినియోగాన్ని సమూలంగా తుదముట్టించడానికి కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపిన ప్రభుత్వాలు – తెలుగురాని, తెలుగు పై పట్టు కోల్పోయే భావి తరాల పౌరులను తయారు చేయడంలో 'బిజీగా' ఉన్నాయి. మాతృభాష వినియోగం నానాటికీ తగ్గిపోతుండడంతో, మౌలికమైన భావ స్వాతంత్ర్యాన్ని సృజనాత్మక శక్తిని కోల్పోతున్న తెలుగు ప్రజలు – రెండు రాష్ట్రాల్లోనూ తమ భాషా జాతీయతను కోల్పోతున్నారు. ఇందువల్ల పేరుకే ఇవి తెలుగు రాష్ట్రాలుగా ఉండి, తమ ప్రత్యేక ఉనికినే కోల్పోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

తెలుగు భాషోద్యమ సమాఖ్య ఇతర భాషోద్యమకారుల, సంఘాల, సానుభూతి పరుల సహకారంతో – 2003 నుండీ కొన్ని విజయాలను సాధించింది. తెలుగేతర మాధ్యమ పాఠశాలల్లో తెలుగును ఒక సబ్జెక్టుగా కొనసాగించి తీరవలసిందేనని నిర్దేశించిన జి.ఒ.86(2003) నీ, తెలుగుకొక మంత్రిత్వ శాఖ ఏర్పాటు జి.ఒ.నెం:909(31-12-2013), తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు జి.ఒ.నెం.40/10-7-2018) వంటి కీలకమైన ఉత్తర్వుల్ని సాధించడంలో సమాఖ్య విజయం సాధించింది. ఇంకా – ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా – సివిల్ సర్వీసు పోటీ పరీక్షల్లో తెలుగును రక్షించుకోవడం, రేషన్ కార్డుల్లో తెలుగు తప్పనిసరి వంటి అనేక అంశాల్లో కూడా ముందడుగు వేసింది. తెలుగుకు ప్రాచీన భాషగా గుర్తింపు విషయంలో తొలినుండి చివరి వరకూ అవిరళ కృషి చేసింది సమాఖ్య.

2014 ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీల ప్రతినిధులను తమ నిరసన సభలకు, కార్యక్రమాలకు ఆహ్వానించి, వారి నుండి బహిరంగంగా వాగ్దానాలను రాబట్టి, ఆ పార్టీలు తెలుగుకోసం ఏం చేసేదీ వారి ఎన్నికల మానిఫెస్టోల్లో కొంతైనా రాబట్టగలిగింది. ఆ విధంగా ప్రజలభాష 'తెలుగు' ను కూడా ఒక ప్రధానాంశంగా రాజకీయ పార్టీల దృష్టికి వచ్చేట్లు చేయ గలిగింది.

### ఇప్పుడు 2018 – 2019 ఎన్నికల్లో కూడా...

ఇప్పుడు తెలంగాణలో ఈ ఏడాది చివరిలోపుగాను, ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఏడాది మొదట్లోనూ మన శాసన సభలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు – అవి రాష్ట్రస్థాయి (ప్రాంతీయ) పార్టీలు కానివ్వండి, జాతీయ స్థాయి పార్టీలు కానివ్వండి – తాము విడుదల చేయనున్న ఎన్నికల ప్రణాళికల్లో ఈ రాష్ట్రాల్లో ప్రజల భాషలో పాలన విషయంలోనూ – విద్యాబోధనా రంగంలో తెలుగు వినియోగం అంశంలోనూ – స్పష్టంగా, వివరంగా తమ విధానాన్ని ప్రకటించాలని కోరుతున్నాము.

ఇందుకోసం త్వరలోనే సమాఖ్య ప్రతినిధులు ఈ డిమాండుతో అన్ని పార్టీల నేతలను కలువనున్నారు. ఈ అంశంపై రాష్ట్రస్థాయి సమావేశాన్ని కూడా నిర్వహించనున్నాము. అందులో పాల్గొనుటకు అన్ని పార్టీల ప్రతినిధులను ఆహ్వానిస్తాము.

రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలనూ సహకరించగోరుతూ విజ్ఞప్తి చేస్తున్నాం.


## తెలుగు భాషోద్యమ సమాఖ్య

డా॥ సామల రమేష్‌బాబు, అధ్యక్షుడు, 9848016136

డా॥ వెన్నిసెట్టి సింగారావు ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి, 9393015584

తిరువరంగం ప్రభాకర్ (తెలంగాణ కార్యదర్శి), 9848336848

*e-mail*: editorammanudi@gmail.com

# డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి ఇరవై ఏళ్ల పండుగ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు యువజనులకు ఒక లఘు చిత్ర పోటీ - ఆహ్వానం

## ఈ పోటీ పేరు - "నా జీవితంలో తెలుగు"

ఉద్దేశం: తెలుగు యువతలో తెలుగు భాషానురక్తిని, తెలుగు సాహిత్యం పట్ల అభిరుచిని పెంపొందింపచేయడం. తమజీవితాలలో తెలుగు భాష ఎప్పుడు పరిచయం అయ్యింది, తెలుగు భాష మీద ప్రేమ ఎప్పుడు కలిగింది, ఎందుకు కలిగింది,తెలుగు భాష మీద అభిప్రాయాలు, ప్రస్తుత సమాజంలో తెలుగు భాషాపరంగా ఆశించే మార్పులు,తెలుగు గొప్పతనం ఎప్పుడు ఎలా తెలిసింది మొదలైన అంశాలపై భావ వ్యక్తీకరణను ప్రోత్సహించడం. పోటీ ఈ అంశాలకు మాత్రమే పరిమితం కాదు. తెలుగు భాషకు సంబంధించిన ఏ అంశాన్నైనా ఎన్నుకోవచ్చు.

**ముఖ్య నిబంధనలు**

1. నాలుగు నుంచి ఆరు నిమిషముల నిడివి గల యూట్యూబ్ వీడియో లింక్‌ని డిటియల్సి (క్రింద జతపరిచిన ) ఈమెయిలుకు పంపాలి. ఆ వీడియో లో మొదటి నిమిషములో - ఈ వాక్యాలను తెలుగులో చెప్పాలి (ఖాళీలలో తగిన వివరాలు పూర్తిగా వాడండి).

నా పేరు..., నా చిరునామా..., నా ఫోన్ నంబర్ ...,

నా ఈమెయిలు...నా వయను పోటీ నిబంధనలను అతిక్రమించదు.నేను ఈ వీడియోను డిటియల్సి 20 సంవత్సరాల వేడుక సందర్భంగా నిర్వహిస్తున్న యువజన పోటీ 'నా జీవితంలో తెలుగు' కు పంపుతున్నాను. ఈ వీడియోను ఇంతకు ముందు ఎప్పుడూ, ఎక్కడా, ఏభాషలోనూ ప్రసారం చెయ్యలేదు. ఇది వేరే ఏ వీడియోకు నకలు కాదు. ఈ వీడియోను డిటియల్సీ వారు బహుమతికి గాని, లేక వేరే ఏ ప్రయోజనాలకు గాని ఎన్నుకుంటే, దీనిపై సర్వహక్కులు డిటియల్సికే చెందుతాయి. ఇది నేను స్వచ్ఛందంగా ఇస్తున్న హామీ.

2. మిగిలిన రెండు నుంచి ఆరు నిమిషముల వీడియో వారు చెప్పగలిగినది - నృత్య, గాన, పద్య, గద్య, అభినయ రూపంలోనే ఉండాలి. తెలుగులోనే ఉండాలి.

3. ఎన్నుకున్న వీడియోలు మాత్రమే డిటియల్సి వెబ్సైటు లో పెట్టడం, వాటిలో నుండే బహుమతులు ప్రకటించడం జరుగుతుంది.

4 . మొదటి బహుమతి: రు. 30,000, రెండవ బహుమతి: రు. 20,000, మూడవ బహుమతి: రు. 10,000

5. పోటీలో పాల్గొనే ముఖ్య పోటీదారుల వయస్సు - 13 నుండి 33 సంవత్సరములు మధ్య వారే ఉండవలెను.

6. వీడియో లింకులు మాకు చేరవలసిన ఆఖరి తేదీ: 21 అక్టోబరు 2018

7.పంపే ఈమెయిల్: contact@dtlcgroup.org, info@myramedia.net

8. ఫలితములు : 07 నవంబర్ 2018

**గమనించవలసిన అంశాలు**

ఈ పోటీ మన తోటి తెలుగువారు తెలుగు భాష అభివృద్ధికి ఏమిచెయ్యాలి, తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వాలు ఏమి చెయ్యాలి అని చెప్పే పోటీ కాదు.

రెండు నుంచి ఆరు నిమిషాల వీడియోలో చెప్పదలుచుకున్న విషయాలకు రెండు ఉదాహరణలు:

**నా జీవితంలో తెలుగు:**

నెమలికన్ను! చిన్నప్పుడు అది ఎంత అపురూపమైనదో! తళుకులీనుతూ ఉన్న ఆ కన్నుని నుతారంగా బుగ్గ మీద నిమురుతున్నప్పుడు ఎంత ఆనందమో! పుస్తకంలో ఎంత అపురూపంగా దాచుకోనేవాళ్ళమో. జీవితం కూడా ఒక పుస్తకమే. అమ్మ భాష "తెలుగు బాస" గూర్చి నా జీవిత పుస్తకంలో దాచుకున్న అలాంటి అపురూప జ్ఞాపకాల నెమలికన్నులు ఎన్నో! ఎన్నెన్నో!

అమ్మ జోలపాటయే, ఏబిడ్డ అయినా మొట్టమొదట తెలుగులో వినే ఆత్మీయ సాహిత్యం, అన్న విషయాన్ని ఎవరు కాదనగలరు?

అమ్మ, అత్త, తాత - అని పసిపాప నోట పలికే తొలి పదాలే అనుబంధాల మాలికలై జీవితాంతం సుగంధాలను విరజిమ్ముతాయన్న విషయాన్ని ఎవరు మరిచిపోగలరు?

"తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా యుల్లంబందున నిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దంబు శోభిల్లన్ బల్కుము నాదు వాక్కునన్" - అనే పద్యాన్ని పిల్లల చేత చెప్పిస్తూ సరస్వతీ దేవిని ప్రార్థింపచేసి అక్షరాభ్యాసం చేయించేవారు.

"భారత దేశము నా మాతృభూమి , భారతీయులందరూ నా సహోదరులు" అంటూ తెలుగులో చేసే ప్రతిజ్ఞ, మన మనస్సులో ఓ నిబద్ధతను ఏర్పరిచేది.

తెలుగు వాచకం తెరవగానే "చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ తో చిన్నికృష్ణుడు ముద్దుముద్దుగా దర్శనం ఇచ్చేవాడు.

"శ్రీరాముని దయచేతను, నారూఢిగ సకల జనుల నౌరాయనగా, ధారాళమైన నీతులు, నోరూరగ జవులుబుట్ట నుడివెద సుమతీ...!" అంటూ లోకములో నీతి మార్గమును ఆచరించి బోధించిన శ్రీరాముని అనుగ్రహమూ, ఆశీస్సులనూ అందించే పద్యాన్ని మరచిపోలేం కదూ!

ఇది కేవలం ఉదాహరణలు మాత్రమేనని గుర్తించండి. మీ సృజనాత్మకత కొద్దీ వస్తువును ఎన్నుకోవడంలోను, ప్రదర్శించడంలోను వైవిధ్యాన్ని చూపించడానికి ప్రయత్నించండి.

- శివ అడుసుమిల్లి

వాడని భాష వాడిపోతుంది...భాష నశిస్తే జాతి నశిస్తుంది.

సంపుటి : 4 సంచిక : 8
**అమ్మనుడి**
అక్టోబర్ 2018

సంపాదక హృదయం

# ప్రాధికార సంస్థ, ప్రభుత్వం వెంటనే స్పందించాలి

1. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ 2018 జులై 18 నుండి అమలులోకి వచ్చినట్లు గెజిట్‌లో ప్రచురణ అయింది. పాలకమండలిని నియమించేందుకు - అర్హుల నుండి దరఖాస్తుల్ని ఆహ్వానించారు. ఇంకా నియామకం జరగలేదు. అయినా, అధికారుల నిర్వహణలో ప్రాధికార సంస్థ అమలులోకి వచ్చినట్లే. అయితే, సంస్థ పనిచేస్తున్నట్లు దాఖలా ఏమీ లేదు.

సంస్థకు సంబంధించిన నిబంధనలు - భాగం -7లో నేరాలు మరియు జరిమానాల్లో 6 విధాలైన జరిమానాల ప్రకటన ఉంది. దాని ప్రకారం : 1 సంస్థలు తమ పేరు తెలిపే నామ ఫలకాన్ని తెలుగులో పెట్టకపోతే ఆ యజమానికి యాభై వేల రూపాయలు జరిమానా 2. శంకుస్థాపన, ప్రారంభోత్సవ సమయాల్లో శిలా ఫలకాన్ని తెలుగులో పెట్టకపోతే ఆ ప్రభుత్వ శాఖ / సంస్థ అధిపతికి పదివేల రూపాయల జరిమానా 3. ప్రభుత్వ శాఖలు తమ మధ్యగాని, ప్రజలతోగాని తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపకపోతే సంబంధిత శాఖ / సంస్థ అధిపతికి రు. 5000/- జరిమానా. 5. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ప్రజలతో జరిపే కార్యకలాపాల్లో తెలుగును ఉపయోగించకపోతే అతనికి రు. 10,000/- జరిమానా. 6. పాఠ్యాంశంగా గాని, బోధనా మాధ్యమంగా గాని అమలు చేయని విద్యా సంస్థాధిపతికి రు. 50,000/- జరిమానా లేదా 6 నెలలు జైలు శిక్ష విధించాలని ఉంది. వీటిలో ఇంతవరకు అమలులోకి వచ్చిన అంశాలు ఏమైనా ఉన్నాయా? సంస్థ ఏర్పడి 70 రోజులు దాటింది. కనీసం ఈ సమయంలో ఈ నిబంధనల్ని అమలులో పెట్టినట్లయితే - ప్రభుత్వ అధికారులకు, సంస్థల అధిపతులకు ఇప్పటికే చాలా మందికి జరిమానాలు విధించి ఉండాల్సింది. ఆ విధంగా ఎంతో డబ్బు కూడా సమకూరి ఉండేది. కాని - ఇంతవరకు అమలులోకి రాకపోవడానికి బాధ్యుల్ని గుర్తించి, శిక్షించవలసిన బాధ్యత సంబంధిత మంత్రిగారిపైనా, ప్రభుత్వ కార్యదర్శుల పైనా ఉంది.

2. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి తమిళ మాధ్యమంలో చదువుకొన్న అభ్యర్థులకు 20 శాతం రిజర్వేషన్‌ను పొరుగున ఉన్న తమిళనాడు ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నది. ఈ అంశంపై స్పందిస్తూ మన ప్రభుత్వంలో భాషా సాంస్కృతిక శాఖ మంత్రిగా శ్రీ పల్లె రఘునాథరెడ్డిగారున్నప్పుడు తెలుగు మాధ్యమంలో చదువుకొన్న వారికి ఆంధ్రప్రదేశ్‌లో 10 శాతం రిజర్వేషన్ ఇస్తామని, అందుకోసం త్వరలో ఉత్తర్వులిస్తామని ప్రకటించారు. ఏళ్లు గడిచాయి. ఆ మంత్రిగారి స్థానంలో శ్రీమతి భూమా అఖిల ప్రియగారు వచ్చిన తర్వాత కూడా ఆ ఊసే లేదు. తెలుగంటే ప్రభుత్వ పట్టనితనానికి ఇదొక మచ్చు తునక మాత్రమే. ప్రభుత్వం ఇందుకోసం పటిష్టమైన ఉత్తర్వుల్ని రూపొందిస్తే ఎవ్వరూ నిరోధించలేరు. తమిళనాడు హైకోర్టు అక్కడి ప్రభుత్వ నిర్ణయాన్ని బలపరచిందని మనం తెలుసుకోవాలి.

3. తాజా వార్తల ప్రకారం - ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాల్లో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయబోతున్నారని తెలిసింది. తెలుగులో ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించగల సామర్థ్య పరీక్షని కూడా తప్పని సరి చెయ్యాలి. దానితో పాటే తెలుగులో కంప్యూటర్‌ను సమర్థవంతంగా వినియోగించగల శక్తిని కూడా తప్పని సరి చెయ్యాలి. తెలుగులో పరిపాలించకపోతే అధికారులకు శిక్షల్ని విధించాలని ప్రాధికార సంస్థకు పని అప్పజెప్పిన ప్రభుత్వం ఈ చర్యల్ని వెంటనే చేపట్టాలి.

4. ప్రభుత్వం, దానికి సంబంధించిన వివిధ శాఖలు, సంస్థలు అన్నీతెలుగులో తమ పనులు చెయ్యాలంటే అన్ని స్థాయిల్లోని అధికారులకూ కంప్యూటర్లలో తెలుగును వినియోగించగల సామర్థ్యాన్ని కలిగించడం కోసం వెంటనే ప్రత్యేక శిక్షణ నివ్వాలి. శిక్షణ ఇవ్వగల నిపుణులు ఇప్పుడు అందుబాటులో ఉన్నారు. కావలసిందల్లా ప్రభుత్వ సంకల్పమే. దీనిపై మంత్రిగారు, ముఖ్య అధికారులు వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలి. ఈ అంశాన్ని విస్మరిస్తే - కంప్యూటర్ పరిజ్ఞానం పేరిట - డిజిటలైజేషన్ పేరిట - ఇంగ్లీషును నెత్తిన పెట్టుకొని మోస్తున్నారని, తెలుగును తుంగలో తొక్కుతున్నారన్న ప్రజల అనుమానం మరింత బలపడుతుంది. ముఖ్యమంత్రిగారు ఈ దిశగా తగు చర్యల్ని వెంటనే గైకొనాలని కోరుతున్నాం.

తేదీ : 30-9-2018

సామల రమేష్ బాబు

ఎన్ ముక్తేశ్వరరావు
94914 28078

# జపాన్ అట్లా...మనం ఇట్లా!

ఈ మధ్య జపాన్ తీసుకున్న ఒక ప్రాథమిక చర్యను గురించి ప్రస్తావిస్తాను. కొత్త విషయాలని కనుక్కోవడం, వాటిని లోకంలోకి తీసుకురావడం వంటి విషయాలలో కృషి చేస్తున్న జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలా ఆలోచిస్తాయో, మనం అయితే ఎలా ఆలోచిస్తున్నామో – ఈ వ్యాసం, ఈ చర్చ మనకు తెలియజేస్తుంది.

**వాళ్లు అట్లా...**

జపాన్‌లో ఫ్యూజిట్స్ అని ఒక కంపెనీ వుంది. ఆ కంపెనీకి ప్రపంచ వ్యాప్తంగా భూగోళం అంతా కూడా విస్తరించి కార్యాలయాలు వున్నాయి. మన దగ్గర వున్న పూణే కార్యాలయంలో ఈ మధ్యకాలంలో ఒక అద్భుతమైనటువంటి చర్యని ఆ సంస్థ తీసుకున్నది. జాపనీస్ భాషను మన భారతదేశంలో వున్నటువంటి భారతీయులకు నేర్పడమన్నది ప్రధానమైనటువంటి భూమికగా తీసుకుని సుమారు రెండు వందల మందికి ఇప్పటికి శిక్షణ ఇచ్చారు. జపనీస్ భాషను మనమెందుకు నేర్చుకోవాలి అని మనకు సాధారణంగా ఆశ్చర్యం కలుగుతుంది, దానికి కారణం ఇదీ : ఈ ఫ్యూజిట్స్ కంపెనీ వద్ద తను స్వయంగా అభివృద్ధి చెందించిన, లేదా తాను స్వయంగా రూప కల్పన చేసి కనుగొన్న అంశాలు ముఖ్యంగా పేటెంట్ హక్కులు కలిగినటువంటి విషయాలు అంటే ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్ క్రింద వచ్చే 78 వేల అంశాలు వున్నాయి. వాటిని ఇపుడు లోకంతో పంచుకోవడానికి వాటిని ఇంగ్లీషులోకి తీసుకుని వచ్చి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి సందర్భాలకు అనుగుణంగా వాటిని మార్చుకోవడం కోసం–ఇంగ్లీషు తెలిసిన భారతీయుల్ని ఒక్కచోట చేర్చి శిక్షణ ఇస్తోంది. ముఖ్యంగా భారతీయులకు సహజంగానే అన్ని భాషలు లేదా అనేక భాషలు నేర్చుకోవడమనేది ఉంది కాబట్టి, ఇంగ్లీషు తెలిసిన భారతీయులకి జాపనీస్ భాషను నేర్పిస్తున్నారు. దీని వలన వీళ్లు జాపనీస్ భాషలో ఒరిజినల్‌గా ఉన్నటువంటి ఆ పేటెంటులన్నింటినీ అనువాదం చేసి లోకం ముందుకు తీసుకురావడం జరుగుతుంది. ఇది జాపనీస్ ముఖ్యంగా ఫ్యూజిట్స్ కంపెనీ చేపట్టిన ప్రధానమైనటువంటి పని.

**మనమిట్లా....**

ఇదే మనం అయితే ఎలా చేస్తామో చూద్దాం! మనం భారతదేశంలో ముఖ్యంగా ఇంగ్లీషు మాధ్యమంలో మాత్రమే చదువుకుంటామని చెప్పి ఇంగ్లీషు మాధ్యమాన్ని బాగా ప్రోత్సహించటం వల్ల ఇంగ్లీషు మాట్లాడే వాళ్ల సంఖ్య, ఇంగ్లీషులో తమని తాము పరిచయం చేసుకోగలిగిన వాళ్ల సంఖ్య పెరిగిన మాట నిజమైనప్పటికి కూడా–ఇన్ని గొప్ప ఇన్నోవేషన్స్ మనం చేయలేకపోతున్నాం. ఇన్నోవేషన్ రంగంలో కొత్త విషయాలను రూపకల్పన చేయడం, వాటికి మేధాపరమైన హక్కులను పొందటం విషయంలో మనం పూర్తిగా వెనకబడి ఉన్నాం. అంటే మనం ప్రపంచానికి అందించేటటువంటి మేధాసంపద (ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్) కన్నా కూడా జపాన్ దేశం ప్రపంచానికి ఇస్తున్నటువంటి మేధా సంపద చాలా ఎక్కువ. ఉదాహరణకి 130 కోట్ల మంది భారతీయులు ఉన్న దేశంలో ఇంజనీరింగ్‌ని, గణిత శాస్త్రాన్ని, భౌతిక శాస్త్రాన్ని దేశ వ్యాప్తంగా విస్తృతంగా బోధిస్తున్న మనదేశం నుంచి ఇంకా ఎక్కువ డిజిటల్ రంగంలో, ఇతర రంగంలో కూడా రావలసి ఉన్నది. కానీ మనవి అంటూ గుర్తించబడినటువంటి పేటెంట్లు చాలా తక్కువ ఉన్నాయి. నిజంగా ఉంటే – మన వాళ్ళందరికీ ఇంగ్లీషు వచ్చు కాబట్టి మనం ప్రపంచానికి ఇవ్వగలం. ఎందుకని మనం ఎక్కువ ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీస్‌ని ప్రపంచం ముందుకు తేలేకపోతున్నాం అన్నది ఆలోచించాల్సిన విషయం. దానికి కారణం – మనం నేర్చుకునే దశలోనే మనది కాని భాషలో – పరాయిభాషలో నేర్చుకోవడం. సహజంగా నేర్చుకోకపోవడం, దానిని సహజంగా ఆలోచించకపోవడం, దానిని స్వంతం చేసుకోలేకపోవడం. నేర్చుకుంటున్న విజ్ఞానానికి, మనకు మధ్యలో ఒక అంతరం ఉండడం అనేది జరుగుతున్నది. అట్లాంటి చోట్ల సృజనాత్మకంగా, కొత్తగా ఆలోచించడం మన స్వయం ప్రతిభని వాడటం జరగదు. ఇది ప్రధానమైన సమస్య.

ఆ కారణంగానే మనం మన దేశం యొక్క పరిణామాన్ని అంటే జనాభా పరంగా, సంస్థల పరంగా చూసినప్పుడు మనం ఈ రంగంలో ముఖ్యంగా డిజిటల్ మొదలైనటువంటి టెక్నాలజీకి సంబంధించినటువంటి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించిన రంగంలో జపాన్ చేసినంత నూతన రూపకల్పనను (ఇన్నోవేషన్స్) మనం చేయలేదని చెప్పవచ్చు. ఇప్పుడు ఈ రెండు సందర్భాలని ఒకసారి పరిశీలించినట్లయితే మనకి మనం ప్రపంచానికి ఎక్కువ మంది ట్రాన్స్‌లేటర్లని లేదా మనకి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పనిచేసేటటువంటి కూలీలను మనం అధికస్థాయిలో తయారు చేస్తున్నామన్నమాట. కాని. సృజనాత్మకత కలిగిన వాళ్లని, ప్రతిభావంతులని, క్రొత్తగా రూపకల్పన చేయగలిగిన వాళ్లని, సృష్టికర్తలని, ఇన్నోవేటర్స్‌ని మనం తయారుచేయడం లేదు అన్నది సత్యం. అంటే మనది ఎక్కువ ఇంగ్లీషు – తక్కువ ఇన్నోవేషన్. జపాన్‌లో ఆల్‌మోస్ట్ ఇంగ్లీషు లేనేలేదు కాని, ప్రపంచంతో పోటీ పడుతూ ప్రపంచానికి అద్భుతమైనటువంటి రూపకల్పన చేయగలిగిన సృష్టికర్తలు జపాన్‌లో ఉన్నారు. ఇప్పటికైనా జపాన్‌లాంటి దేశాలనుండి నేర్చుకోవడమనేది విజ్ఞత, వివేకం. ఈ అంశాన్ని నిజంగా మనం పరిశీలిస్తే నిజాన్ని నిరాకరించకుండా ఓపెన్ మైండ్‌తో గనుక పరిశీలించినట్లయితే వాస్తవాలు ఖచ్చితంగా మనకి తెలుస్తాయి.

రచయిత విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా పనిచేశారు.

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి


రమేష్ పట్నాయక్
9440980396

# ప్రాధికార సంస్థకు సాధికారత ఎంత?

'తెలుగదేల యన్న దేశంబు తెలుగు' అన్నాడు ఆనాడు శ్రీకృష్ణ దేవరాయలు. ఇప్పటి విషయానికి వస్తే, ఈ ప్రదేశం తెలుగువారి ప్రదేశంగా ఎన్నాళ్ళుంటుందో చెప్పడం కష్టంగానే ఉంది. అంతరించి పోతున్న భాషలలో యునెస్కోవారు ఇప్పటికే తెలుగును చేర్చేశారు. మన ఎలక్ట్రానిక్ మీడియా తెలుగు పదాలను కూడా ఆంగ్ల పదాలు వలే పలికి ఈ ప్రక్రియను వేగవంతం చేస్తూంది. సినిమాలలో పాటలు తెలుగు పలుకుబడిలో లేవు. విద్యారంగంలో కూడా తెలుగు ఇప్పుడు అంత రించిపోతూంది. ఈ పరిస్థితులలో ప్రభుత్వం తెలుగు ప్రాధికార సంస్థ స్థాపనకు తీసుకువచ్చిన నిబంధనలు (ప్రభుత్వ ఆదేశం 40) కొద్దిమంది తెలుగు భాషాభిమానులలో ఆశలు కల్పిస్తూంది. ఆగష్టు 29 గిడుగు పుట్టిన రోజు. తెలుగువారికి పండగ రోజు. ఈ నేపథ్యంలో కొత్తగా స్థాపించబడనున్న ఆంధ్రప్రదేశ్ తెలుగు ప్రాధికార సంస్థకు సంబంధించిన బలాలు మరియు బలహీనతలు గమనించడం, సమాలోచనలు జరుపుకోవడం ఎంతైనా అవసరం.

కాస్త పూర్వాపరాలలోనికి వెళితే, నిలువెత్తు తెలుగు పంచె కట్టిన రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలలో తెలుగు మాధ్యమాన్ని అమలుచేయడానికి బదులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో ఆంగ్లమాధ్యమాన్ని సమాంతరంగా ప్రవేశ పెట్టింది. తెలుగు ఆత్మాభిమానం పేరుతో పుట్టిన తెలుగుదేశం పార్టీ నేడు అధికారంలో ఉండి తెలుగుకు నామరూపాలు లేకుండా చేస్తూంది. విద్యాశాఖ ఉన్నత పాఠశాలలలో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగిస్తూ 2015 లో ప్రభుత్వ ఉత్తర్వు తీసుకువచ్చింది. విద్యార్థి, ఉపాధ్యాయ మరియు విద్యారంగ ఉద్యమాలు దానిని అడ్డుకోవడంతో పాఠశాల విద్యాశాఖ కాస్తా వెనక్కి తగ్గి నెమ్మదిగా అడుగులు వేస్తూంది. కాగా మున్సిపల్ మంత్రిత్వ శాఖ రంగంలో దిగి, తన అధికార పరిధిని దాటి, మున్సిపల్ పాఠశాలలన్నింటిలో అన్ని స్థాయిలలో ఆంగ్లమాధ్యమాన్ని అమలుచేస్తూంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బి.జె.పి దేశవ్యాప్తంగా ఆరవ తరగతినుంచి ఆంగ్లభాషామాధ్యమాన్ని తప్పనిసరిచేస్తూ, ఐదవ తరగతి వరకు మాధ్యమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఒక విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నించింది. అప్పటికి బి.జె.పి నాయకుడిగా ఉన్న మరొక తెలుగుతేజం వెంకయ్యనాయుడు మాతృభాషా మాధ్యమం గురించి ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడూ ఏమీ మాట్లాడడం లేదు. ఇక రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షానిది ఒకటే చింత, వారు తింటున్నారు మేము తినలేక పోతున్నామని. మొత్తం పైన ప్రజల భాషలను పాతరవేయడం పాలకుల సామాన్య లక్షణంగా కనిపిస్తూంది.

మాధ్యమం విషయం అలా ఉంచితే తెలుగును ఒక పాఠ్యాంశంగా డిగ్రీ రెండవ సంవత్సరం వరకూ బోధించే విధానం కూడా క్రమంగా నీరుగార్చబడుతూంది. కార్పొరేటు పరమైన ఇంటర్ మీడియట్లో తెలుగు స్థానంలో సంస్కృతం పెట్టారు. ఆ సంస్కృతం అనేది చెప్పినవాడికీ రాదు, చదివిన వాడికీ రాదు, దిద్దినవాడికి అసలు రాదు. అందుకేనేమో మార్కులు 97 శాతం వరకూ ఇస్తాడు. విద్యా ప్రమాణాలు పూర్తిగా విధ్వంసం అవుతున్నాయి. ప్రభుత్వం, మార్కెట్ మరియు దాని మాయలో పడిన ప్రజలు, ఒక్కమాటలో చెప్పాలంటే, జాతిజాతి మొత్తంగా ఆత్మవంచన చేసుకుంటూంది. ప్రొఫెషనల్ కోర్సులలో తెలుగు భాషాసాహిత్యాల అధ్యయనం తొలగించబడింది. పాఠశాల విద్యలో కూడా ప్రైవేటు రంగంలో కాంపోజిట్ తెలుగు పేరుతో తెలుగు బోధనను కుదించివేశారు. ఇప్పుడు తెలుగు ఒక బోధనా భాషగానే కాదు, ఒక భాషగా కూడా పాఠశాలలు మరియు కళాశాలలనుండి తరిమి వేయబడుతూంది. నిరంతరం ప్రజలకు తెలుగు ప్రాధాన్యతను గురించి ఉద్బోధించే సాంస్కృతిక రంగానికి చెందిన అనేకమంది పెద్దలు కూడా ప్రభుత్వ విధానం గురించి ఎప్పుడైనా మాట్లాడితే తెలుగును ఒక భాషగా బోధించడం గురించే మాట్లాడుతున్నారు గాని తెలుగు మాధ్యమం గురించి మాట్లాడడంలేదు. మాధ్యమాన్ని రక్షించకుండా భాషను రక్షించగలమని వీరు నమ్ముతున్నారా లేక ఇతర కారణాలు ఉన్నాయా అనేది తేల్చి చెప్పడం కష్టం. ఇక ఉర్దూ విషయానికి వస్తే ఉర్దూ మాధ్యమమే కాదు, ఉర్దూ భాషను పాఠ్యాంశంగా ఉంచాలనే వారు కూడా లేరు. విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలలో చాలా కొద్ది సంఘాలు మాత్రమే మాతృభాషా మాధ్యమం గురించి మాట్లాడుతున్నాయి.




ఉద్యోగాలు కావాలంటే ఆంగ్లం నేర్చుకోవాలిగదా

అంటున్నారు. ఆంగ్లంతో ఎన్ని ఉద్యోగాలు వస్తున్నాయి అన్న మాట ప్రక్కన పెడితే, ఆంగ్లం నేర్చుకోవడానికి ఆంగ్ల మాధ్యమానికి ఎటువంటి సంబంధంలేదు. మాతృభాషా మాధ్యమం ద్వారానే ఆంగ్లం మరింత మెరుగ్గా నేర్చుకోవచ్చని బోధనాశాస్త్రం చెప్తుంది. సజీవ ఉదాహరణలు కూడా కోకొల్లలు. అంతేకాదు, పూర్వ ప్రాథమిక స్థాయినుండి ఇంజనీరింగు వంటి వృత్తివిద్యల వరకు ఆంగ్లమాధ్యమంలో చదివిన వారికి ఆంగ్లం వస్తుందా అంటే అవునని ఎవరూ గట్టిగా చెప్పలేరు. వారికి మహా అయితే నాలుగు బొట్లేరు ముక్కలు వస్తాయి. నాలుగు వాక్యాలు ఆంగ్లంలో వ్రాయమంటే మాత్రం వ్రాయలేరు. అమెరికా వెళ్ళాలంటే వీరు ఆంగ్లంలో మరల ఆరు మాసాలు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. పాఠశాల విద్య తెలుగు మాధ్యమంలో అభ్యసించిన వారు కూడా ఆరు మాసాలు ప్రత్యేక శిక్షణ పొందితే జి.ఆర్.ఇ పరీక్షలలో ఉత్తీర్ణులు కావచ్చు. ఇక, ఈ రాష్ట్రంలో బాలలబాలికలకు ఆంగ్లం నేర్పాలని ప్రభుత్వానికి నిజంగా ఉంటే - ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఆంగ్లభాషా బోధనకు ప్రత్యేక శిక్షణ పొందిన ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. ఆ పని మాత్రం ప్రభుత్వం చేయదు. నిజానికి ఆంగ్లమాధ్యమంలో చదివిన లక్షలాదిమంది విద్యార్థులకు ఇటు తెలుగూ రాదు, అటు ఇంగ్లీషూ రాదనేది ఒక కఠిన వాస్తవం.

తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటు విషయానికి వస్తే, దశాబ్దాలుగా భాషోద్యమ సంస్థలు చేస్తూన్న డిమాండు ఇది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండును పట్టించుకోలేదు. ఇక ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్ర బాబునాయుడుగారు ఆమోదించిన డిమాండు ఇది. గత నాలుగు సంవత్సరాలు రేపు మాపు అని గడిపి వేశారు. ఇప్పుడు కూడా ఒక చట్టాన్ని తీసుకురావడానికి బదులు ఒక ప్రభుత్వ ఆదేశం (జి.ఒ) ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ సంస్థ ప్రయోజకత్వం మీదనే ఇప్పుడు చర్చలు జరుగుతున్నాయి. నిజానికి ఆనాడుగాని ఈ నాడుగాని భాషోద్యమ సంస్థలు డిమాండు చేస్తూన్నది ఏమంటే ఒకతెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటుచేస్తూ ఒక చట్టాన్ని తీసుకురావాలని. కాని ప్రభుత్వం ఒక జి.ఒ తీసుకువచ్చింది. విధాన సభ మరియు విధాన మండలి ఆమోదించిన బిల్లుపై గవర్నర్ సంతకంచేస్తే చట్టం అవుతుందన్న విషయం తెలిసిందే. జి.ఒ అంటే మంత్రిత్వ శాఖా కార్యదర్శి సంతకం చేస్తారు. జి.ఒ. ను సులభంగా రద్దు చేయవచ్చు. చట్టానికి జి.ఒ.కు హస్తిమశకాంతరం తేడా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఏర్పాటుచేయబడనున్న ప్రాధికార సంస్థకు చట్టబద్ధమైన రక్షణ ఉండదు. రెండవ విషయం ఏమంటే ఈ జి.ఒ. ఇచ్చింది 'యువజనాభ్యుదయం, పర్యాటక మరియు భాషా సాంస్కృతిక శాఖ'. పర్యాటక రంగాన్ని మరియు భాషా సంస్కృతుల రంగాన్ని ఒకే మంత్రిత్వ శాఖలో పెట్టడం అంటే భాషా సంస్కృతులను ఒక ప్రదర్శనీయ వస్తువుగా పరిగణించడం మాత్రమే. పర్యాటక స్థలాలలో కూచిపూడి నృత్యాన్ని ఏర్పాటుచేసి పర్యాటకులను ఆకర్షించడం వంటిదే ఇది. అలాగే పర్యాటక స్థలాలలో తెలుగు నాటకాలను, బుర్రకథలను, అవధానాలను ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించడంగా ఇది పర్యవసిస్తుంది. పర్యాటకాన్ని భాషా సంస్కృతులను ముడి పెట్టడం అంటే భాషా సంస్కృతులను కార్పోరేటు దృష్టితో చూడడం మాత్రమే. భాషా సంస్కృతులను కార్పోరేటు దృష్టితో చూసే మంత్రిత్వశాఖ వాటిని ఎలా పరిరక్షిస్తుంది, ఎలా అభివృద్ధిచేస్తూంది. తెలుగు భాషా సంస్కృతులను తెలుగు జాతి జీవనాడిగా చూడాలి. దానికి పూర్తిగా ఒక స్వతంత్ర మంత్రిత్వ శాఖ కావాలి. అలాగే తానే సర్వస్వం అయిన ఒక ప్రాధికార సంస్థను ఒక చట్టంద్వారా ఏర్పాటుచేయాలి. ఇప్పుడు జి.వొ.ద్వారా ఏర్పాటుచేసిన సంస్థ ప్రకటిత ప్రయోజనాలను నెరవేర్చగలుగుతుందా అనేది ప్రశ్నార్థకమే.

ఈ ప్రాధికార సంస్థకు ఐదు కర్తవ్యాలు నిర్దేశించబడ్డాయి. అవి వరుసగా 1) అధికార భాషగా తెలుగు అమలు, 2) విద్యారంగంలో తెలుగు భాషాభివృద్ధి, 3) ఇ - తెలుగు అభివృద్ధి, 4) అనువాదాలు మరియు ప్రచురణలు, 5) అంతర్జాతీయ తెలుగు అభివృద్ధి. ఈ కర్తవ్యాల సాధనకు ఐదు ఉప కమిటీలు ఏర్పాటుకు సదరు ప్రాధికార సంస్థకు అధికారం ఉంటుంది. ముఖ విలువను బట్టి చూస్తే ఇందులో లోటు ఏమీ కనిపించదు. సంస్థ పరిధి అన్ని అవసరమైన రంగాలకు విస్తరించినట్లు కనిపిస్తూంది. కాస్త వివరంగా చూస్తే అనుకూలంగా ఉన్న విషయాలు పకడ్బందీగా లేవు. పకడ్బందీగా ఉన్న విషయాలు ప్రజాస్వామికంగా లేవు. ప్రధానంగా విద్యారంగానికి చెందిన నిబంధనలు అప్రజాస్వామికంగా ఉన్నాయని చెప్పకతప్పదు. ఇంటర్ మీడియట్ వరకు అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యా సంస్థలలో తెలుగును (మాతృభాషను కాదు) మొదటి భాషగా అమలు చేయాలని ప్రాధికార సంస్థ నిబంధనావళి నిర్దేశిస్తూంది. అంటే రాష్ట్రంలో ఉర్దూ మాతృభాషగా గలవారు, ఒరియా, తమిళం మరియు కన్నడం వంటి ఇతర భాషలు మాతృభాషలుగా గలవారు కూడా వారివారి భాషలను వదలివేసి తెలుగు, ఇంగ్లీషు మరియు హిందీ నేర్చుకోవాలన్న మాట. ఇది చాలా అప్రజాస్వామికమైన విధానం. భాషా మైనారిటీలకు వారి భాషను నేర్చుకునే హక్కును తొలగించడం, తెలుగును భాషా మైనారిటీలపై రుద్దితే ఇక మనకూ మరియు తమిళ దురభిమానులకు ఉన్న తేడా ఏమిటి? తమిళనాడులో 40శాతంగా ఉన్న తెలుగువారిపై బలవంతంగా తమిళం రుద్దుతున్నారని మనం విమర్శించడంలో అర్థం ఏముంటుంది? మనది భాషా ప్రయుక్త రాష్ట్రం కాబట్టి రాష్ట్రంలో అధికార భాషలైన తెలుగు మరియు ఉర్దూలలో ఏదో ఒకటి నేర్చుకోని వారికి ప్రభుత్వ ఉద్యోగం నిరాకరించడం సరియైనది కాగలదు. అంతేకాని రాష్ట్రంలో ఉండాలంటే తెలుగు నేర్చుకొని తీరవలసిందే అనడం ఎంతవరకు సరియైనది? మైనారిటీలపై మెజారిటీ మతాన్ని, భాషను మరియు సంస్కృతిని రుద్దడం ఫాసిస్టు విధానం. మైనారిటీల హక్కులే ప్రజా స్వామ్యానికి గీటురాయి. మరొక విషయం. సదరు నిబంధనావళిలో మాతృభాషామాధ్యమాన్ని పదవ తరగతి వరకు కాకుండా-ప్రాథమిక స్థాయికి పరిమితం చేసారు. అంతేగాక, దానిని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపచేసారు. ప్రైవేటు పాఠశాలలు ఆంగ్లమాధ్యమంలో కొనసాగుతాయి. మాతృభాషా మాధ్యమం శాస్త్రీయమైనది మరియు సామాజికమైనదని ప్రభుత్వం అంగీకరిస్తే ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటిలో మాతృభాషా మాధ్యమాన్ని నిర్దేశించాలి. అప్పుడు మాత్రమే అది అమలు జరుగుతుంది. అలాగే విద్యార్థి తన మాతృభాషను మరియు సాహిత్యాన్ని డిగ్రీ రెండవ సంవత్సరం వరకు ఒక పాఠ్యాంశంగా అధ్యయనం చేసే అవకాశం ఉండాలి. వివరాలు ప్రక్కన పెడితే, ప్రభుత్వం తన భాషా సాంస్కృతుల విధానాన్ని రాజ్యాంగవిలువల దృక్పథంలో బాధ్యతాయుతంగా రూపొందించుకోవాలి. అలాగే, ప్రాధికార సంస్థ యొక్క చట్టపరమైన స్థాయిని పెంచే దిశలో అలాగే అధికారాలను పటిష్ట పరిచే దిశలో ప్రభుత్వం తన కార్యాచరణను పున:పరిశీలించుకోవడం ఎంతైనా మంచిది. రాష్ట్రంలో జరుగుతున్న చర్చ అందుకు దోహదం చేయగలదని ఆశిద్దాం.

---

ఈ వ్యాస రచయిత ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి కన్వీనర్

రంగనాయకమ్మ
04023117302

# 'ం'ని విడిగా పలకగలమా?

'ం' కి సంబంధించిన సంగతులన్నీ పెద్దవాళ్ళకు తెలిసే ఉంటాయి; చిన్న పిల్లలకి తెలియవు.

ఒకటో తరగతి పిల్లలకి, మొదట 'అక్షర మాల' ని చూపిస్తాం. అందులో ఉన్న అక్షరాల్లో, మొదటి వాటిని కొన్నిటిని చదువుతూ, "ఇవి, 'అచ్చు అక్షరాలు' అంటాం. అలాగే, తర్వాత ఉన్న అక్షరాలన్నిటినీ చదువుతూ, "ఇవి, 'హల్లు అక్షరాలు' అంటాం." ఇలా 'అక్షర మాల' ని మళ్ళీ మళ్ళీ చదువుతూ, ఆ అక్షరాల్ని పిల్లలతో కూడా పలికిస్తాం.

అక్షరాల్ని చూపించగానే, 'గుణింతాలు' అంటూ మొదలు పెట్టెయ్యడం కాదు. 'మాటలు' మొదలు పెట్టడమే గుణింతం చెప్పడం!

'గుణింతం' అనే మాట లేకుండానే, ఆ మాటని వాడకుండానే, మాటలు ఎలా తయారవుతాయో, వాటిని రాసి చూపిస్తూ పిల్లలతో చదివించడమే మొదట జరగాలి.

'త', 'ల' – అనే అక్షరాల్ని చూపించి, "చూడండ్రా పిల్లలూ! ఈ రెండు అక్షరాల్నీ ఒక దాని పక్కన ఒకటి పెడితే, 'తల' అయిపోతుంది! అలాగే, 'ప-ల-క' అనే అక్షరాల్ని ఇలా వరసగా పెడితే, 'పలక' అయిపోతుంది" అని చెప్పుకుంటూ వెళతాం. అలాగే, తర్వాత, 'ఆ-శబ్దం' అక్షరాలతో, "చా-ప"; "కా-య"-వంటి వాటిని. తర్వాత, 'ఇ - శబ్దం' అక్షరాలతో, "గది, నది" – ఈ విధంగా, మాటల్ని రాసి చూపిస్తూనే, అక్షరాల్లో మార్పుల్ని చూపించాలి...అంతేగానీ, మాట అనేది, ఎలా వస్తుందో చూపించకుండానే, "క కా, కి కీ, కుకూ, కెకే, ....." అంటూ గుణింతాలు మొదలు పెట్టడం పిల్లలకి నరకమే.

వీటిని ఆపివేసి, 'ం' సంగతులే చూద్దాం.! లెక్కల్లో ఉండే 'ం సంగతి కాదు; మాటల్లో ఉండే 'ం' సంగతినే.

టీచరమ్మ నల్లబల్ల మీద 'ం' ని గీసింది. గీసి, "పిల్లలూ, దీన్ని చదవండ్రా !" అంది. పిల్లలందరూ మొదట తెల్లబోయారు. ఆలా చూస్తూనే కొందరు పిల్లలు చప్పున "సున్నా, సున్నా" అని అరిచారు. అప్పుడు మిగతా పిల్లలందరూ అలాగే అరిచారు నవ్వుతూ . అప్పుడు టీచరమ్మ గారే తెల్లబోయింది. అయినా, వెంటనే తేరుకుని నవ్వింది. "సరేనర్రా! ఇప్పుడు ఇంకోటి రాస్తున్నాను. దీన్ని చదవండి!" అంటూ 'త' అని రాసింది.

పిల్లలందరూ, "త, త, త" అని గోలగా అరిచారు.


టీచరమ్మ మళ్లీ 'ల' ని రాసింది. పిల్లలు నవ్వులతో దాన్ని ఆరుస్తూ 'ల, ల, ల' అంటూ అరిచారు.

టీచరమ్మ నవ్వుతూ, "ఈ అక్షరాల్ని 'త' అనీ, 'ల' అనీ, చదివారు గానీ, 'అక్షరాలు' అన్నారా? అలాగే, 'సున్న' ని కూడా ఏదో ఒక శబ్దంతో చదవగలిగితే చదవండి! అంతేగానీ, దాన్ని 'సున్న' అనడం కాదు. సరే, ఇప్పుడు ఇంకోటి రాస్తాను. దీన్ని చదవండి!" అంటూ "అం" అని రాసింది. దాన్ని రాస్తూ ఉండగానే పిల్లలు 'అమ్, 'అమ్, 'అమ్" అంటూ అరిచారు.

టీచరమ్మ మళ్ళీ, "ఇంకోటి రాస్తున్నాను. ఇది చదవండి!" అంటూ బోర్డు మీద "క్ ం" అని రాసింది.

నలుగురైదుగురు, దాన్ని "కిమ్, కిమ్" అని అరిచారు.

టీచరమ్మ ప్రశ్నలు వేసింది. "నేను, 'కి' అని రాశానా ? 'కి' పక్కన 'ం' ని పెడితే మీరు దాన్ని 'కిమ్' అనొచ్చు. చూడండి, ఈ రాసినది, 'కి' కాదు; 'క్' కదా? 'క్' పక్కన 'ం' ఉండొచ్చా అసలు?" అని అడిగింది.




పిల్లలు మౌనంగా అయిపోయారు. టీచరమ్మ మళ్ళీ చెప్పడమూ, బోర్డు మీద ఇంకా రాసి చూపించడమూ, చేసింది.

" "అం" అని ఉంటే, దాన్ని 'అమ్' అని చదవగలిగారు. 'అ' పక్కన 'ం' ఉంటే, అది, 'అచ్చు అక్షరం' పక్కన ఉందని అనుకోవాలి. 'ఇం, ఉం, ఎం' -ఇలా సున్న అనేది, ఏ అచ్చు అక్షరం పక్కన ఉన్నా, దాన్ని, 'మ్' శబ్దంతో, "ఇమ్, ఉమ్, ఎమ్" అంటూ చదవగలం. కానీ, 'క్ ' ని చదవలేం. ఎందుకు? 'క్' అనేది 'హల్లు' కదా? అదే కాదు; 'గ్, చ్, ట్' అని, ఏ హల్లు పక్కన అయినా 'ం' పెట్టి, 'గ్ం, చ్ం, ట్ం' లను అయినా చదవలేం. పిల్లలూ! వింటున్నారా? ఇప్పటి వరకూ చూసింది ఏమిటి? 'ం' అనేది, 'అచ్చు అక్షరాల' పక్కన ఉంటేనే పలకడానికి వీలవుతుంది. 'హల్లుల' పక్కన ఉంటే, దాన్ని పలక లేం".

పిల్లలు ఆసక్తి గానే వింటున్నారు. అయినా

వాళ్ళకి అర్థమైంది తక్కువే. టీచరమ్మ ప్రేమగానే చెపుతోంది. టీచరమ్మ బోర్డు మీద 'కం' అని రాసి, "దీన్ని చదువుతారా?" అంది.

పిల్లలు ఉత్సాహంగా, "కమ్, కమ్, కమ్" అని అరిచారు.

" 'క' అనే అక్షరం, అచ్చా, హల్లా? అది చెప్పండి!" అంది టీచరమ్మ.

పిల్లలు తెల్లబోతూ చూస్తూ, ఇద్దరు ముగ్గురైతే, "టీచర్! అది హల్లే!" అని అరిచారు.

" 'క' లో ఏయే శబ్దాలు ఉన్నాయో చెప్పండి!" అంది.

ఆ పాఠాలన్నీ అంతకు ముందు అయినవే. అయినా, ఒకటో తరగతి చిట్టి పిల్లలు కదా? వాళ్ళు అంతే మరి! చెప్పడానికి వాళ్ళు తంటాలు పడ్డారు గానీ, చెప్పలేక పోయారు.

టీచరమ్మ, బోర్డు వేపు తిరిగి రాస్తూ చెప్పింది. " 'క' లో 'క్ + అ' అనే శబ్దాలు ఉంటాయని చెప్పుకోలేదూ  మనం? అంటే, 'క్' అనే 'హల్లు' పక్కన  'అ' అనే 'అచ్చు' శబ్దం ఉంది. అందుకే, 'క్' హల్లు , 'క' అయింది. 'క' పక్కన 'ం' ఉంటే, ఆ ం, దేని పక్కన ఉన్నట్టు? ఇప్పుడు ఆలోచించండి! 'క్ ం' అని ఉంటే, అప్పుడు సున్నా హల్లుపక్కనే ఉంది. ఇలా ఉంటే, 'కిమ్' అవుతుంది కదా ? దాన్ని పలకలేం. 'క్ + అ + ం' అని ఉంటే, సున్నా ఎక్కడ ఉంది? 'అచ్చు' పక్కనే కదా?

ఈ  పాఠంలో ప్రశ్నలన్నీ పిల్లల కోసమే.

మొదటి ప్రశ్న: 'ం', ఎప్పుడూ 'అచ్చు'  పక్కనే వస్తుందా?

జవాబు: అవును. ఎప్పుడూ 'అచ్చు'  పక్కనే వస్తుంది. 'హల్లు' పక్కన ఎప్పుడూ రాదు.

తర్వాత కూడా కొన్ని ప్రశ్నలు!

రెండో ప్రశ్న: "అచ్చు అక్షరం పక్కన, 'ం' ఉంటే, దానికి ఏ శబ్దం వస్తుంది?" అని అడిగి,  దానికి జవాబు తనే చెప్పింది.

జవాబు: 'ం' కి శబ్దం, ఆ మాటని బట్టి వస్తుంది.

ఉదాహరణలు చూడండి!

'గంప' లో 'ం' ఉంది. ఆ మాటని 'గమ్ ప' అంటాం. అంటే, అక్కడ 'ం' కి 'మ్' శబ్దం వచ్చినట్టు అర్థం. 'కంద' ని ఎలా పలుకుతాం? 'కన్  ద' అంటాం. అంటే, ఈ మాటలో 'ం' కి 'న్' శబ్దం వచ్చింది. ఆంటే, 'ం' కి, 'మ్' గానీ, 'న్' గా గానీ, శబ్దాలు రావొచ్చు.

ఈ ఉదాహరణలు చూడండి!

(1) 'దుంప' ని, 'దుమ్ ప' అంటాం.

(2) 'పంది' ని, 'పన్  ది', 'పన్  ది' అంటాం.

ఈ రెండు చోట్లా, 'ం' అనేది, అచ్చు అక్షరాలా పక్కనే వచ్చింది. అంటే, 'అ' అనే అచ్చు పక్కన! అయినా, 'ం' కి, ఒక మాటలో 'మ్' అనీ; ఇంకో మాటలో 'న్' అనీ, శబ్దాలు వచ్చాయి. అంటే, మాటల్ని బట్టి, 'ం' కి శబ్దాలు వేరు వేరుగా వస్తాయి.

రెండో ప్రశ్న: 'ం' అనేది, ఒక అక్షరమా, కాదా?

జవాబు: విడిగా ఉంటె, అది అక్షరం కాదు; ఏదైనా అచ్చు పక్కన ఉన్నప్పుడే అది అక్షరం! అందుకే 'ం' అని విడిగా ఉంటే, చదవలేము.


మూడో ప్రశ్న: అక్షరాల్ని కాదు; అంకెల్ని చూద్దాం. 1 నించీ , 9వ అంకె వరకూ 'ం' ఉండదు కదా? 9 తర్వాతే '10' తో, 'ం' మొదలవుతుంది. ఆ తర్వాత, ఏ అంకె తర్వాత అయినా 'ం' రావచ్చు.  కానీ, ఏ అంకెలోనూ, 'ం', మొట్టమొదటే  రాదు. '10' అని వస్తుంది గానీ, 'ం 1' అని వస్తుందా? ఇలా రాస్తే ఇది తప్పే!

'ం' అనేది అక్షరాల్లోనూ, అంకెల్లోనూ కూడా వస్తుంది గానీ, ఎక్కడ ఎలా వస్తుందో, ఆ సంగతులు కొంచెం నేర్చుకుంటే, అవే 'సున్నా సంగతులు!'

పిల్లల్లో, వాళ్ళలోనూ చిన్న పిల్లలకి, శ్రద్ధగా నేర్పే బాధ్యతా, శ్రద్ధా అంతా, టీచర్లకు ఉండవలసిందే! సాధారణంగా ఉంటుంది. !


తెలుగువారంతా చదువవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన




**ఎల్లలు లేని తెలుగు**
వెల : రు.200/-లు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**
వెల :రు. 100/-



**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**
వెల : రు.350/-

విద్యార్థులు,
ఉపాధ్యాయులు,
పరిశోధకులు,
సామాజిక కార్యకర్తలు
రచయితలు,
భాషోద్యమకారులు,
ఆసక్తిగల వారంతా
ఈ రచనలను చదివి
ప్రయోజనం
పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ. చేస్తే వాటిని కొరియర్ / రిజిస్టర్డ్ బుక్ పోస్ట్‌లో పంపిస్తాము.
**తెలుగుజాతి (ట్రస్టు)** - జీవక భవనం, 8-346, **అంగలకుదురు** పోస్టు **తెనాలి** - 522211ఫోన్ : 9440448244


పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

వీవెన్
9963029061

# తెలుగు భాషకు ఆధునిక హోదా-9

## అంగట్లో ఏమున్నాయి!?

ఈ భూమిమీది సకల జీవరాశుల్లో మనిషి తనకన్నా బలమైన, చురుకైన జంతువుల, పరిస్థితుల మధ్య బతికి బట్టకట్టడానికి, మనిషిగా ఎదగడానికి దోహదపడ్డ వాటిలో ముఖ్యమైనది పనిముట్లు తయారుచేసుకోగలగడం, వాటిని వాడుకోగలగడం. అదే సాంకేతిక పరిజ్ఞానం. చేయలేని పనిని చేయగలగడానికి, చేయగలిగిన పనిని మరింత సమర్థవంతంగా చేయడానికి పనిముట్లను, మెలకువలను ఎప్పటికప్పుడు తయారుచేసుకుంటూ ఉండటమే సాంకేతిక అభివృద్ధి / పురోగతి.


ప్రతీ మనిషి తన జీవితం, జీవనం తాననుకున్నంత (కనీసం తనకున్నంతలో) సుఖంగా, సౌకర్యంగా సాగిపోవాలనుకుంటాడు.

మనుషుల ఆలోచనలు, వారి పరిజ్ఞానం స్థల కాల పరిమితులు దాటి ప్రవహించడం మొదలయ్యాకా (అంటే మునులు, ఋషులు ఉపనిషత్తులు, వారు దేశాటన చేయడం, కథలు, గేయాలు, చాటింపులు వంటి మౌఖిక పద్ధతులు, పుస్తకాల ముద్రణ నుండి నేటి అంతర్జాలం వరకూ) మనుషులు స్వయంసమృద్ధిగా ఉండాల్సిన అవసరం తగ్గి పోతూ వస్తూంది. అంగట్లో అన్నీ అందుబాటులో ఉన్నాయి! ఒకవిధంగా పరస్పరాధీనత నుండి మనిషి పూర్తిగా పరాధీనత వైపు పయనిస్తున్నాడు. తనవద్ద లేనివి మాత్రమే అంగట్లో కొనుక్కునే స్థితి నుండి అంగట్లో ఉండేవి మాత్రమే తనవద్ద ఉండగలవు అని అనుకునే పరిస్థితి వచ్చింది. ఈ పురోగతి మంచిచెడులు అటుంచితే, జనబాహుళ్యానికి అంగట్లో ఉన్నదే అందుబాటులో ఉన్నట్టు లెక్క.

నేటి అంగడి స్వరూప స్వభావాలు అంతుపట్టకుండా ఉంటాయి. అమ్మడం, కొనడం ఉంటుంది. రెండు పక్షాల మధ్య విలువ మార్పిడి ఉంటుంది. ఆ విలువ కేవలం ఊహాజనితం కూడా కావచ్చు. నిష్పక్షపాతంగా ఉన్నట్టు అనిపించినా ఎటువైపు అయినా మొగ్గగలదు. పోటీ ఉన్నా అంతకుమించి అడ్డదారులూ ఉంటాయి. ఆకట్టుకోవడం ఉంటుంది. అణగదొక్కడమూ ఉంటుంది. నమ్మకంతోనే నడుస్తుంది, వంచనా ఉంటుంది.

తెలుగు భాష వరకూ చూస్తే జనాలు భాషను వాడుకోవాలంటే, జనాలకు భాష అందుబాటులో ఉండాలంటే, భాష కూడా అంగట్లో దొరకాలి. అంగట్లో దొరకడం ఒక వంతు. జనాలను ఆకట్టుకొని గెలవడం రెండో వంతు! తెలుగు సినిమాలకు మార్కెట్టు ఉందంటే, అవి అందుబాటులో ఉన్నాయి, ఆకట్టుకుంటున్నాయి కాబట్టే. ప్రయివేటు బడుల్లో తెలుగు చెప్పకపోతే, ఆకట్టుకోవడం మాట అటుంచి, చాలామందికి తెలుగు అందుబాటులో లేకపోయినట్టే. సామాజిక మాధ్యమాల్లో తెలుగు అందుబాటు లోకి వచ్చి, కొందరు ఆకట్టుకునేలా రాయబట్టే ఈ మధ్య ఆదరణ కనిపిస్తుంది.

అందుబాటులో ఉండటం మాత్రం సరిపోదు, ఆకట్టుకునేలా ఉండాలి. ఆకట్టుకోడానికి హంగులూ, హంగామా కావాలి.



### అందుబాటు

సంప్రదాయ మాధ్యమాలలో అంటే ముద్రణ, ప్రసార మాధ్యమాలలో (అవే కదా భాషకు అంగళ్ళు) యజమానుల లేదా నిర్వాహకుల నియంత్రణ ఎక్కువ. ఏ పుస్తకాలు ప్రచురించాలి అన్నది దాదాపు ప్రచురణకర్తల చేతిలో ఉంటుంది. ఏ కార్యక్రమాలు రూపొందించాలి అన్నది ఆయా టీవీ ఛానెళ్ళ యజమానుల లేదా వారనుమతించిన వారి చేతిలో ఉంటుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మాధ్యమాలను ప్రజాస్వామ్యీకరించి సామాన్యులు కేవలం అందుకునే స్థాయి నుండి అందించే స్థాయికి చేరుకునేలా చేసింది. భౌగోళిక పరిమితులను చెరిపివేసి అంగళ్ళను ఏకీకృతం చేసింది. కేవలం అంతర్జాల అనుసంధానం ఉంటే చాలు రెండు వందల కోట్ల మంది ప్రజలను, దాదాపు కోటిమంది తెలుగువారిని, చేరుకునే అవకాశం ఉంది.

ప్రతీ సంప్రదాయ/నియంత్రిత మాధ్యమానికీ నేడు స్వేచ్ఛా, ప్రజాస్వామ్యీకరించిన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి:

పత్రికలు : బ్లాగులు, జాల పత్రికలు
టీవీ ఛానెళ్ళు : యూట్యూబ్, విమియో ఛానెళ్ళు
పుస్తకాలు : అమెజాన్, కినిగె వంటి చోట్ల స్వయం ప్రచురణ
రేడియో ఛానెళ్ళు : పాడ్‌కాస్టులు, సౌండ్‌క్లౌడ్
సినిమాలు : చిన్న సినిమాలు యూట్యూబ్‌లో విడుదల
ఎన్‌సైక్లోపీడియా : వికీపీడియా, వికియా

సంప్రదాయ మాధ్యమాలకు ఉన్న విషయపరమైన, భౌగోళిక, భౌతిక పరిమితులు వీటికి ఉండవు. ఒక నిర్ణీత పద్ధతికీ, మూసకీ కట్టుబడాల్సిన పనిలేదు. ప్రయోగాలు చెయ్యవచ్చు. అవసరమైతే కొత్త పరిమితులూ విధించుకోవచ్చు. (ఆధునిక మాధ్యమాల్లో కొన్ని సంప్రదాయ పద్ధతుల్లోనే నడుస్తున్నా, అది కేవలం వాటిని నడిపేవారి వల్లే. వారు కొత్త మాధ్యమాలను, అవి అందించే సౌలభ్యాన్నీ ఫలవంతంగా, సమర్థవంతంగా ఉపయోగించుకోలేకపోవడం వల్లే. ఉదాహరణకు, తెలుగు దినపత్రికల వెబ్ సైట్లు, కేవలం ముద్రణ కోసం తయారుచేసిన సమాచారాన్ని జాలంలో కూడా అందిస్తున్నాయి తప్ప, ఆ సమాచారాన్ని జాలంలో వీలైనంత ప్రభావవంతంగా అందించడానికి ప్రయత్నిస్తున్నట్టు కనబడదు.)

తెలుగు భాష విషయంలో చూస్తే అందుబాటు ఇంకా చాలా పెరగాలి. అమెజాన్‌లో ఉన్న తెలుగు పుస్తకాలు ఎన్ని? గాసిప్పు, పోసుకోలు కబుర్లు లేని తెలుగు యూట్యూబ్ ఛానెళ్ళు ఎన్ని? సమకాలీన అంశాలపై విస్తృత చర్చలు జరిపే తెలుగు పాడ్‌కాస్టులు ఏవి? ప్రత్యేక విషయాలపై, ఆసక్తులపై లోతుగా చర్చించే బ్లాగులూ, చర్చావేదికలూ రావాలి. పైన చెప్పిన ప్రత్యామ్నాయ మాధ్యమాలన్నింటిలోనూ తెలుగు విషయం, సమాచారం పెరగాలి. "చూసి రమ్మంటే కాల్చి వచ్చాడు" అనే రీతిలో తెలుగు రచయితలూ, తెలుగువారూ తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని (ఉన్న పనిముట్లు వాడుకోగలగడం) పెంచుకుంటే తప్ప ఇది సాధ్యం కాదు.

## ఆకట్టుకోవడం

అందుబాటులో ఉన్నంత మాత్రాన జనాలు ఆదరిస్తారన్న భరోసా లేదు. జనాలను అలరించే, ఆకట్టుకునే విషయాలనే జనాలు కొంటారు, వింటారు. అలా అని అంగళ్ళలో అమ్మేవారు ఊరికే ఎందుకుంటారు. కళ్ళుచెదిరే విన్యాసాలు చేసైనా జనాల దృష్టిని ఆకర్షించి తమ సరుకులను అమ్ముకుంటారు. మనం నిద్ర లేచిన దగ్గరి నుండి మళ్ళీ నిద్రపోయేవరకూ ఈ అలరింపుల బారిన పడకుండా ఉండలేము. టీవీలు రేడియోల్లో వ్యాపార ప్రకటనల నుండి గోడల మీద పోస్టర్ల వరకూ ఇదే గోల కదా. ఒక వస్తువును తయారు చేయడానికి అయ్యే ఖర్చుకంటే, దాన్ని మార్కెట్ చెయ్యడానికి ఎక్కువ ఖర్చుపెడుతున్నాయి వ్యాపారసంస్థలు. ఈ నిరంతర అలరింపుల రొదలో జనాలు తమకు ఏది మంచి, ఏది కావాలి అని వివేచన కూడా చేయలేకపోతున్నారు. మంద మనస్తత్వం పెరిగిపోయింది. ఎరను గమనించకుండా, బాగా మార్కెట్ చేయబడుతున్న వాటిని వేలంవెర్రిగా అందరూ పొలోమని అనుసరించేస్తున్నారు. దురదృష్టవశాత్తూ, ఈ రోజుల్లో ఆకట్టుకోవడం లేదా మార్కెటింగ్ అనేది లాభాపేక్ష లేని వ్యవహారాలకూ, సేవా/స్వచ్ఛంద సంస్థలకూ అవసరమవుతోంది.

ఇలాంటి పరిస్థితులలో, తెలుగు వెలుగొందాలంటే, తెలుగునీ –అంటే తెలుగు వారినీ, తెలుగు సంగీతాన్నీ, సాహిత్యాన్నీ, సంస్కృతినీ, వంటలనూ, కళలనూ, మనదైన ప్రతీ దాన్నీ–మార్కెట్ చేయక తప్పదు. తెలుగుకీ ఆధునిక హంగులు అద్దక తప్పదు.

సహజంగా తెలుగువారికి తమ గురించి చెప్పుకోవాలంటే మొహమాటం. మన గొప్పను ఎదుటివాడు వాడంతవాడే గుర్తించాలన్న ఆరాటం. మన బిడియాలు, భేషజాలు వదిలి 'మేమిదీ' అని చెప్పుకుంటే తప్ప, అలా మన తోటి తెలుగువారిని ఆకట్టుకుంటే తప్ప, మనదైన దేన్నీ నిలబెట్టుకోలేము.

అలరించండి, ఆకట్టుకోండి!

కవిత

## చనిపోయి బ్రతకడం

**నవభారతం!**

గర్వంగా చెప్పుకునే దేశం  
కులం మతం వివక్షలేని పవిత్రమైన దేశం  
పెరుమళ్ల ప్రణయ్ హత్యతో  
భారతమాత పేరు చెదిరింది! కుమిలింది కులాంతర హత్యలతో

**కులం**

కులం లేదు మంచి బుద్ధికన్నా  
మతం లేదు మంచి సంస్కారం కన్నా  
విలువైనది లేదు ప్రేమకన్నా  
ప్రేమిస్తాడు భగవంతుడు సైతం భక్తులను!

**పరువు**

కులం అహంకారానికి పరువు పేరుపెట్టి  
హత్యలు చేసే నీచులకు తక్కువే ఏ శిక్ష అయినా  
భరించు ఇష్టం లేకపోతే ... ప్రేమించు ఇష్టమైతే  
చంపొద్దు ప్రేమను... చావదు చంపినా!

**ప్రేమ**

శాశ్వతమైంది ప్రేమ  
చంపగలరేమో మనిషిని...చంపలేరు మనసులోని ప్రేమను  
ప్రేమతో మనసు గెలవగలరు కానీ! ద్వేషంతో సాధించలేరు ఏమి  
కులానికి సంస్కారానికీ తక్కువవాడు కాదు ప్రణయ్  
అతని ప్రేమ బ్రతికింది చనిపోయినా  
ద్వేషంతో చేసినవాడు బ్రతికినా చనిపోయాడు

**గొప్ప**

చనిపోయి బ్రతికినవాడు గొప్ప!... కాదు బ్రతికి చనిపోయినవాడు!  
వాడు నిజంగా కులం తక్కువ వాడు  
అదే నేటి వ్యాకులం!

– తోట పద్మశ్రీ
9542641139

## మీరు 'అమ్మనుడి' చందాదారులకు...

'అమ్మనుడి' పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక–

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.
2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్/మెయిల్ గాని పంపించి సహకరించగోరుతున్నాము.
3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు.5000/లు) గాని, 5 సం॥ల చందా (రు.1000/లు) గాని, 3 సం॥ల చందా (రు.700/లు) గాని పంపి పత్రికకు ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥చందా రు.240/లు పంపించి ఏటా పునరుద్ధరించుకొనవచ్చు.

–**ప్రచురణకర్త**, అమ్మనుడి



Unfiled Notes Page 14

పురస్కార సభ

# డా॥ ఏటుకూరి ప్రసాద్‌కు 'తాపీ ధర్మారావు జీవన సాఫల్య పురస్కారం'


## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీమతి తేలప్రోలు రజని చేతులతో అందజేత




'తాపీ ధర్మారావు వేదిక' నడుస్తున్న చరిత్ర / అమ్మనుడి చదువరులకు ఆత్మీయ అనుబంధం కలిగి వున్నదే. 2009 నుండి 2017 వరకు ప్రముఖ రచయితలు, సంపాదకులు అయిన ఏడుగురు ప్రముఖులకు వరుసగా శ్రీయుతులు డా॥ నాగసూరి వేణుగోపాల్, డా॥ కె.శ్రీనివాస్, టంకశాల అశోక్, జి.శ్రీరామమూర్తి, ఎ.కృష్ణారావు, ఆర్. ఉమామహేశ్వరరావు, సతీష్ చందర్ గారలకు 'తాపీ ధర్మారావు పురస్కారాన్ని' అందజేశారు. 2018 లో ప్రత్యేకించి 'తాపీ ధర్మారావు జీవన సాఫల్య పురస్కారాన్ని' డా॥ ఏటుకూరి ప్రసాద్‌గారికి ప్రకటించారు. ఈ కార్యక్రమం 2018 సెప్టెంబరు 2018 ఉదయం హైదరాబాదు - ఖైరతాబాదులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్సు కాలేజీలో విజయవంతంగా జరిగింది. ఇందుకు సంబంధించి ఈ సంచిక ముఖ పత్రంపైనా, లోపలా - కొన్ని ఛాయాచిత్రాల్ని చూడవచ్చు. 15 నుండి 22 పుటల్లో సభ వార్తా విశేషాలతోపాటు, ప్రసంగాల సారాంశాన్ని, ప్రత్యేకించి, ఏటుకూరి ప్రసాద్‌గారితో 'ముఖాముఖీ' ని చూడవచ్చు.

సభలో తాపీవారి సన్నిహిత బంధువులు, మిత్రులు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు, అభిమానులు, ఉత్సాహంగా పాల్గొన్నారు. సభకు కవి, రచయిత, పరిశోధకుడు డా॥ జయధీర్ తిరుమలరావు అధ్యక్షత వహించారు. ఆయన తమ ప్రసంగంలో - తాపీ ధర్మారావు గొప్పదనాన్ని, ప్రత్యేకతను వివరించి, పురస్కార గ్రహీత డా॥ ఏటుకూరితో తనకున్న చిరకాల పరిచయాన్ని వివరించారు. సరైన పురస్కారం సరైన వ్యక్తికి అందుతున్నదని అన్నారు. ఏటుకూరి ఇల్లు ఒక పెద్ద గ్రంథాలయం అన్నారు. సాహిత్యరంగంలో ఏటుకూరి సేవల్ని ప్రశంసించారు.

ముఖ్య అతిథిగా జస్టిస్ శ్రీమతి టి. రజని విచ్చేసి తమ చేతులతో డా॥ ఏటుకూరి ప్రసాద్‌గారికి పురస్కారాన్ని అందజేసి, సత్కరించారు. ఆమె ప్రసంగంలో లాంఛనంగా కాకుండా, తమ గుండెలోతుల్లోంచి మాట్లాడడం సభికుల్ని కదిలించింది. తన అనుభూతుల్ని ఆలోచనల్ని అందరితో పంచుకొంటూ జస్టిస్ రజని మాట్లాడి తీరు, మరచిపోలేనంతగా వారిపై ముద్రవేసింది. ఆమె వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నిలబెట్టింది. 'చలం, తాపీ ధర్మారావుల సాహిత్యం తన్నెంతగా ప్రభావితం చేసిందీ జస్టిస్ రజని చెప్పారు. 'పెళ్లి పుట్టు పూర్వోత్తరాలు' చదివిన తర్వాత తన ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చిందనీ, మత ధోరణులకు త్రోసిరాజని, హేతుబద్ధంగా ఆలోచించడం, జీవితాన్ని తీర్చి దిద్దుకోవడం సాగించానని చెప్పారు. తన వివాహాన్ని కూడ ఆ ఆలోచనతోనే తీర్చిదిద్దుకున్నానని చెప్పారు. సాహిత్యం ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో తాపీ వివరించిన తీరును అందరం తెలుసుకోవాలన్నారు. 'వాట్స్ అప్' సందేశాలతోను, సోషల్ మీడియాను వాడడంతోను సమాజాన్ని 'మోటివేట్' చేయడం తాత్కాలికమేనని, సరియైన సాహిత్యం వల్ల మాత్రమే యువతను, సమాజాన్ని ముందడుగు వేయించగలమని జస్టిస్ రజని చెప్పారు. ఏటుకూరి ప్రసాద్‌గారినే ఈ పురస్కారానికి ఎంచుకోవడం సరైన నిర్ణయమని ప్రశంసించారు. ఏటుకూరి బలరామమూర్తి, కృష్ణమూర్తి,





ప్రసాద్ గార్లతో తనకున్న పరిచయాన్ని ప్రస్తావించారు.

విశిష్ట అతిథి ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకుడు డా॥ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ – 'అభ్యుదయ సాహిత్య క్రమంలో తాపీ ధర్మారావు, ఏటుకూరి ప్రసాద్ గణనీయమైన పాత్ర వహించారన్నారు. గురజాడ గురించి కె.వి.ఆర్. ఎంత పరిశోధన, రచన చేశారో తాపీ ధర్మారావు గురించి ఏటుకూరి ప్రసాద్ అంతగా శోధించి, విశ్లేషించారని ఆయన అన్నారు. తెలుగు వైతాళికుల జాబితాలో తాపీ ధర్మారావును ఎందుకు చేర్చుకోలేదో తెలియడం లేదన్నారు. తెలుగు సాహిత్యానికీ, తెలుగు సమాజానికీ ఆయన్ని వైతాళికుడుగా గుర్తించాలని డా॥ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాపీ సాహిత్యం యువతలో పఠనాసక్తిని పెంచిందని, హేతువాద ధోరణికి దారి చూపిందన్న ఏటుకూరి తాపీ ధర్మారావుగారి జీవన సాఫల్య పురస్కారం' ఇవ్వడం కొంత ఆలస్యమైనట్లు తాను భావిస్తున్నానన్నారు.

సీనియర్ పత్రికా సంపాదకులు శ్రీ సి.రాఘవాచారి ప్రత్యేకంగా పాల్గొని ప్రసంగిస్తూ – తాపీ రచనల్లో 'విజయవిలాస వ్యాఖ్య' తనకు బాగా నచ్చిన రచన అని అన్నారు. ఏటుకూరితో తొలి నుండీ తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని తెలుపుతూ – ఏటుకూరి ప్రసాద్ ఒక జ్ఞాన సర్వస్వం అన్నారు. భాష, సాహిత్యం, సంస్కృతి రంగాల్లో మనం ఎంతో కృషి సాగించవలసి వుందని, ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు చేయలేని పనిని సామల రమేష్‌బాబు చేస్తున్నారని ఈ పురస్కారానికి ఏటుకూరి ప్రసాద్‌ను ఎంచుకోవడం సరైన నిర్ణయమని అభినందించారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఐ.ఐ.ఎం.సి. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్, వయోజన విద్య ప్రోత్సాహక సంస్థ కార్యదర్శి శ్రీ పి. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ – ఏటుకూరి ప్రసాద్‌గారికి ఈ ప్రత్యేక పురస్కారాన్ని ఇచ్చి మనల్ని మనం గౌరవించుకొంటున్నామన్నారు. తాపీ ధర్మారావుగారి మనుమరాళ్లు (తాపీ మోహనరావు– రాజమ్మల కుమార్తెలు) విమలా సోహన్, సుజాతాషా ఆత్మీయ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వారి ప్రసంగాలను ఈ పక్క పుటల్లో ఇచ్చాము. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న రచయిత సన్నిధానం నరసింహశర్మ ప్రసంగిస్తూ 'అర్హుల వద్దకే పురస్కారాలు వస్తాయి' అంటూ అందుకు నేటి సందర్భమే సరైన నిరూపణ అని అన్నారు. తాపీ ధర్మారావు వేదిక తరఫున డా॥ ఏటుకూరి ప్రసాద్‌కు మన్నన పత్రాన్ని నరసింహశర్మ సభకు చదివి వినిపించారు. తొలుత శ్రీమతి సుజాతాషా అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. 'అమ్మనుడి' ప్రచురణ కర్త సామల లక్ష్మణబాబు వారందరినీ శాలువా, పండ్లు, జ్ఞాపికలతో సత్కరించారు.

పురస్కార గ్రహీత తన ప్రసంగంలో తాపీ ధర్మారావుగారు ప్రజల్ని మేల్కొలపడానికి ప్రజాసాహిత్యం అవసరాన్ని నొక్కి చెప్పేవారన్నారు. స్త్రీలు విజ్ఞానవంతులైతేనే సమాజం అభివృద్ధి చెందుతుందని తాపీ చెప్పేవారని, అందుకోసం కృషి చేశారని అన్నారు. యువతని తాపీ ఎప్పుడూ ప్రోత్సహించేవారన్నారు. (ఈ తర్వాతి పుటల్లో డా॥ ఏటుకూరితో 'ముఖాముఖి' చూడండి) ఈ పురస్కారాన్ని తాను అందుకోగలగడం సంతోషాన్ని కలిగిస్తున్నదని అన్నారు. వేదికకు ధన్యవాదాలు తెలిపారు.

వేదిక సమావేశకర్త డా॥ సామల రమేష్‌బాబు అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ – వేదిక తరఫున ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న 'తాపీ ధర్మారావు పురస్కారాన్ని అర్హులైన వారికి ఇవ్వడాన్ని కొనసాగిస్తామని అంటూ, ఇందుకు పెద్దలు సలహా యివ్వాలని కోరారు. జీవన సాఫల్య పురస్కారాన్ని మాత్రం కేవలం డా॥ ఏటుకూరి ప్రసాద్‌గారికే ప్రత్యేకించామని, ఇది ఇక్కడికే పరిమితం అనీ సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

## తాపీ ధర్మారావుగారి మనుమరాలు శ్రీమతి సుజాతా షా



ఏటుకూరి ప్రసాద్‌గారు చిక్కడపల్లిలో తాపీ ధర్మారావుగారున్న ఇంటికి ప్రక్క వీధిలోనే ఉండేవారు. ఒక్క ఇంటి వారిలా కలిసిపోయిన వారు. సాహితీ బంధువు కూడా. వీరు తాతయ్య జీవితము, సాహిత్యం పై పరిశోధన చేయాలనుకున్న నాటికి, అది ఎంత ప్రయాసతో కూడిన అద్భుత యాత్రో వారికే తెలిసుండక పోవచ్చునేమో. ఎంత మమేకమై రాశారా అనిపిస్తుంది. తాతయ్యలోని సరళత. సూటిదనం, నిత్యనూతన చైతన్యం, ఎంతో ఉత్సాహంగా, శక్తిమంతంగా వివరించారు – శ్రమకోర్చి, సమతూకంతో.

అలా రాసిన ఆ పరిశోధనా గ్రంథం 'ఒహో! తాపీ ధర్మారావుగారు ఇది కూడా చేశారా? ఇలా కూడా జరిగిందా?' అని ఆశ్చర్యపోయే ఈ తరంతో కూడా మాట కలుపుతూంది.

ఏటుకూరి వారితో ఎక్కువ సమయం గడిపిన దానను కాను నేను. 2003 నుండి మాత్రమే ఇక్కడ స్థిరంగా ఉన్నాము. అంతకు ముందు శెలవుల్లో తాతయ్య దగ్గరకో, వారు దాటిపోయాక, విమల సోహన్ ఇంటికీ, పెళ్లయాక అత్తగారింటికీ అతిథిని మాత్రమే.

కొలతకేమొచ్చింది ఎంత కాలం ఏమిటని. కలిసి గడిపిన చిన్నచిన్న సందర్భాలు, దగ్గరితనం, సొంత వారే అన్న వాతావరణంతో నిండినై.

నాన్నపోయిన సందర్భంలో 'అసలేమైందమ్మా' అని పక్కన కూచుని పలకరించిన తీరూ. అమ్మను కలవడానికి, సతీ సమేతంగా మా ఇంటికొచ్చిన నాటి చక్కని జ్ఞాపకం....ఆ తర్వాత వారి మిత్రుని మరణంపై (పేరు గుర్తు రాలేదు) రాసిన వీడ్కోలు కవిత లోని ఆర్ద్రత కదిలించింది. అయినవారు లేకుండా పోతే వచ్చే ఏడుపు....అందరిదీ ఒకటే.

'క్రొవ్వురాళ్ళు' అని తాతయ్య రాసిన (స్వభావ పరిశీలన విషయంపై) నవల నాతో కూడా ప్రూఫ్ రీడింగ్ చేయించారు. అది నాకొక మంచి అనుభవమే.

ఎందుకో తాతయ్య పుట్టిన రోజు నాడు ఏటుకూరి ప్రసాద్‌గారికి వందనాలు చెప్పే అలవాటయింది. ప్రతి నైటూ. కుసుమగారితో కూడా కాసేపు ముచ్చట్లు అదే సందర్భంగా ఏ గజిబిజి లేకుండా సమంగా సాగే సంభాషణలు : ఈ రోజూ తాతయ్య పుట్టిన రోజు వందనాలు ఈ వేదికపై నుండి ఏటుకూరి వారికి అందిస్తున్నాను. చిక్కని ఆరోగ్యంతో ఆగని పరిశోధనలు మరిన్ని సాగించాలని కోరుతూ.

సామల రమేష్‌బాబుగారి పూనికతో జరిగిన ఈ చక్కని సభలో చెప్పడానికి ఇన్నే కబుర్లున్నాయి.

## తాపీ ధర్మారావుగారి మనుమరాలు   శ్రీమతి విమలా సోహన్



తాపీ ధర్మారావు అనే ఒక మహా వటవృక్షం ఛాయలో పెరిగిన బాల్యం మాది. ఆ వృక్షం గొప్పతనం నెమ్మది నెమ్మదిగా ఆకళింపు చేసుకునే వయసు మాకు వస్తూండగానే ఆ మహావృక్షం కనుమరుగై పోయింది.

తాతగారి పుట్టుక దగ్గర నుండి, వారి వివరాలు, విలువలు, గొప్పతనం, వారు వ్రాసిన పుస్తకాల ద్వారా, ఏటుకూరి ప్రసాద్‌గారి పుస్తకం ద్వారా తెలుసుకోగలిగాము. ఈనాటికీ ఏమైనా సమాచారం కావాలన్నా, సందేహం కలిగినా ప్రసాద్‌గారి పుస్తకమే మాకు ఒక గైడ్‌గా నిలబడింది.

బయటి ప్రపంచంతో ఎంత పని వత్తిడిలో వున్నా- ఇంట్లో పెద్దలతో, పిల్లలతో ఎంతో ప్రేమగా, చిరునవ్వుతో మంచీ, చెడూ విచారిస్తూ సరదాగా గడిపేవారు తాతాజీ. 'మా ఇల్లు ఒక హౌరా స్టేషను' అని తాతయ్యగారు అంటుండేవారట. అలానే 20, 30 మందికి తక్కువ కాకుండా ఇల్లంతా పిల్లలతో, పెద్దలతో నిండిపోయి వుండేది – మద్రాసు ట్రిప్లికేన్ బీచ్ దగ్గరి మండువా లోగిలి ఇంట్లో. అప్పుడు నాకు 6,7 సం॥ వయసు గుంపు పిల్లలం. ఆట పాటలతో, డ్యాన్సులతో ఎంత గొడవ చేస్తున్నా నవ్వుతూ తనూ మాతో పాలుపంచుకునేవారుగానీ, ఎన్నడూ ఆయన విసుగు చెందడం చూడలేదు. ఆయనకు మరీ ఇబ్బందిగా వుంటే 'అమ్మా విమలా' అనేవారు. అలా అన్నారు అంటే తాతయ్యకు కోపం వచ్చింది అని అనుకుని అందరం ఒక మూల దాక్కొనే వాళ్ళం.

తాతయ్య మంచి లెక్కల మాస్టారు. మాకు పరీక్షల సమయంలో, లెక్కలు చాలా సులభ పద్ధతిలో విడమర్చి, తేలికగా అర్థమయేటట్లు చెప్పడంతో, లెక్కలంటే ఉన్న భయాన్ని పారద్రోలడంలో తాతయ్య దిట్ట.

అవతలివారు ఎంత నొప్పించినా కూడా అతి సున్నితంగా, నవ్వుతూ మందలించడం వారి నైజం. దానికి ఉదాహరణ చిన్ననాటి నా ఒక జ్ఞాపకం.

నాకు 9,10 సం॥ వయసప్పుడు విజయవాడ మారుతీ సినిమా హాలులో, బాబాయి చాణక్య డైరెక్ట్ చేసిన 'రోజులు మారాయి' శతదినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. నాన్న, బాబాయి వారివారి పనులతో బిజీగా వున్నారు. నేను, బాబాయిగారమ్మాయి జోయా తాతయ్యతోనే తిరుగుతున్నాము. తాతయ్యతో వుంటే, సినిమా ఆర్టిస్టులను దగ్గరగా చూడవచ్చనే ఆశ మాది. అమ్మా, పిన్ని చిన్న పాపలతో ఒక దగ్గర కూర్చుని వున్నారు. మా చెల్లెలు సుజాతకు, మా తమ్ముడు ధర్మారావుకి అప్పుడు 2 సం॥ల వయసు అటూ, ఇటూగా.

ఆ ఫంక్షనుకు మా స్కూలు ప్రిన్సిపాలుగారు కూడా వచ్చారు. వారికి మా కుటుంబంతో వున్న చనువు కొద్దీ తాతయ్యతో "పండిత పుత్ర శుంఠ అని – మీ మనవరాలికి తెలుగులో సున్నా అండీ" అని అన్నారు, చాలమంది వుండగా, నాకు చాలా సిగ్గనిపించి తాతయ్య వెనకకు పోయాను. ఆయన ఒక చిన్న నవ్వు నవ్వి, నా తల మీద చేయి వేసి పక్కకు తీసుకున్నారు నన్ను. ఎవరో రాగా, వారితో ముచ్చట్లలో మునిగారు. ఆ తరువాత వేడుక ముగింపు సమయంలో నన్ను కూడా తీసుకుని, ఒక్కరే వున్న ప్రిన్సిపాల్‌గారి దగ్గరకు వెళ్ళి "పిల్లల మంచి చెడూ చెప్పడం మీ బాధ్యత, చెప్పాలి కూడానమ్మా, కానీ పదిమందిలో చెప్పడం వల్ల పిల్లలు చిన్నబుచ్చుకుంటారు కదమ్మా" అని ఆమెతో చెప్పి నా వైపు తిరిగి 'ఇంక చూడండి, మా విమల ఇప్పటి నుండి మంచి మార్కులు తెచ్చుకుంటుంది. కదమ్మా' – అంటూ నా తల నిమురుతూ దగ్గరకు తీసుకున్నారు. అదీ ఆయన సున్నితమైన మందలింపు ప్రిన్సిపాల్‌గారికీ, ప్రేమతో ఆప్యాయమైన మందలింపు నాకు కూడా.

ధర్మారావుగారు పట్టుదలకు మారుపేరని ఒక నానుడి. ఏదైనా పట్టుపట్టారంటే అది సాధించే వరకు నిద్రపోయేవారు కాదట. అందుకు మేము చూసిన చిన్న సంఘటన. 67లో తాతయ్యగారి కాలు ఫ్రాక్చరు అయినప్పుడు సికింద్రాబాదు గాంధీ హాస్పిటలులో చేరారు. ఆ సమయంలో ఆయన విజయవిలాస వ్యాఖ్యానం రచనలో వుండగా అనుకోకుండా ఈ ప్రమాదం సంభవించింది. గాంధీ హాస్పిటలు డాక్టర్ల సాయంతో వారి బెడ్ దగ్గరే ఒక లైటు పెట్టించుకుని, పగలైతే అందరికీ ఇబ్బందిగా వుంటుందని, రాత్రిళ్ళు నిద్రపోకుండా, రాంభట్ల, రామరాజు మా నాన్నగారి సహకారంతో–ఆ వ్యాఖ్యానం ఆగిపోతుందేమో, పూర్తి చేయలేనేమో అన్న బెంగతో, తపనతో, పట్టుదలతో తన ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా చివరకు విజయవిలాస వ్యాఖ్యానం పూర్తి చేశారు.

నలుగుడు పడని దారిలో కాకుండా, కొత్త దారుల కోసం వెతుకుతూ, ఆధునిక దృక్పథంతో, అపూర్వ రచనా సంవిధానంతో, విశిష్ట వ్యక్తిత్వం కలిగిన సహృదయులు తాతాజీ. ఛలోక్తులకు పెన్నిధి తాతాజీ. ఎదుటివారి మీద తాను జోకు వేసినా, ఎదుటివారు తన మీద జోకు వేసినా నిండుగా నవ్వుకోగల సున్నిత హృదయులు తాతాజీ అని ఒక సందర్భంలో విద్వాన్ విశ్వంగారు అన్న మాటలు.

అటు పత్రికా రంగంలోనూ, ఇటు సినిమా రంగంలోనూ వాడుక భాషను ప్రవేశపెట్టిన సాహసి తాతాజీ. ఈనాడు సినిమా రంగంలో స్క్రీన్‌ప్లే వ్రాసుకునే పద్ధతి, ఆనాడు ధర్మారావుగారు పెట్టిన భిక్షే అని ఆరుద్రగారు గర్వంగా చెప్పిన మాటలు.

అటువంటి మహామనీషి ధర్మారావుగారి కుటుంబంలో పుట్టడం మా తాపీవారి పిల్లలందరి అదృష్టం.

అందరికన్నా ప్రత్యేకమైన గొప్ప అదృష్టం నాది. తాతయ్య పుట్టిన రోజునాడే, వారి చేతుల మీదుగా మా వివాహం జరగడం, వారి ఆశీర్వాద బలంతో మా జీవితం సుఖ, సంతోషాలతో సాగుతుండడం మా దంపతుల అదృష్టం.

తాపీవారి కుటుంబం తరఫున, పితృసమానులైన ఏటుకూరి ప్రసాద్‌గారికి మా అందరి అభినందనలు, అభివందనాలు తెలియచేసు కుంటున్నాము.

సన్నిధానం నరసింహ శర్మ
9292055531

# మాటలు, పాటలు, రచనల బాటలూ, సంస్కరణలూ అన్నీ జనాలకు చేరువ కావాలనేదే తాపీధర్మారావులక్ష్యం – ముఖాముఖీలో డా॥ ఏటుకూరి

సమాజం నిత్యం స్మరించుకోదగ్గ బహుముఖ ప్రజ్ఞావంతుడు తాపీ ధర్మారావుగారు. ఆయన స్ఫూర్తి కొనసాగింపుని కోరుతూ తాపీధర్మారావు వేదిక ఇప్పటివరకు పత్రికారంగ ప్రముఖ రచయితలు సంపాదకులు ఏడుగురికి తాపీ ధర్మారావు పురస్కారం అందజేసింది. అయితే తాపీ ధర్మారావు జీవన సాఫల్య పురస్కారాన్ని మాత్రం ప్రత్యేకంగా 2018 సెప్టెంబరులో శ్రీ ఏటుకూరి ప్రసాద్‌గారికే అందజేసింది. తాపీవారిపై ఎవరెన్ని వ్యాసాలు, రచనలు చేసినా ఆయనతో సాన్నిహిత్య సంపదకలిగి 'తాపీ ధర్మారావు జీవితం – రచనలు' అనే ప్రామాణిక గ్రంథం రాయడం, దీనికి ప్రధాన కారణం. అట్టి విశిష్ట రచయిత శ్రీ ఏటుకూరి ప్రసాద్‌తో తాపీ ధర్మారావు వేదిక సభ్యుడు, రచయిత శ్రీ సన్నిధానం నరసింహశర్మ చేసిన ఇంటర్వ్యూ యిది – సంపాదకుడు

**సన్నిధానం :** *భాషా పరంగా తాపీవారి జీవన ప్రస్థానంలో తొలినాళ్ళ విశేషాలు చెబుతారా?*

**ఏటుకూరి :** 1936 సంవత్సరం దాకా ఆయన పాండిత్యానికి ప్రాధాన్యమిచ్చే వీరగ్రాంథిక వాది. ఆయన 'విలాసార్జునం' నాటకం రాశారు. వాడుక భాషా నిరసనం, గ్రాంధిక భాషా ప్రాధాన్యం అందులో ప్రధానాంశాలు. ఆ నాటకంలో ముగ్గురు సేవకుల పాత్రలుంటాయి ఆ మూడు పాత్రలూ కలిపితే గురజాడ అప్పారావు అన్నమాట. వాడుక భాషకై అప్పారావుగారు చేసే దాన్ని నిరసించడం ఉద్దేశమన్నమాట.

స : *మరి మార్పు ఎప్పటి నుంచి వచ్చిందండీ?*

ఏ : 1936 తరువాత పెనుమార్పు వచ్చింది. పాండిత్య ప్రకర్షల్ని గ్రాంధికాన్ని నిరసిస్తూ భాష, భావాలు ప్రజల దగ్గరకు పోయే మార్గాల గురించే తపించసాగారు. తనలో వచ్చిన భాషా విషయకమైన మార్పుల్ని గురించి గిడుగు రామమూర్తి గారికి ఒక లేఖ రాసి అందులో తన హృదయాన్ని తేట తెల్లం చేశారు.

విజయ విలాసంపై ఆయనకు తొలినాళ్ళ నుండీ మక్కువ వుండేది. ఆ మక్కువ విలాసార్జునంలో అంకురించి సహృదయోల్లాస వ్యాఖ్యతో విస్తరించింది.

స : *'విలాసార్జునం' దొరుకుతోందాండీ?*

ఏ : అది దొరికింది. విశాలాంధ్ర ప్రచురణాలయంవారు వేశారు.

స : *తాపీ ధర్మారావుగారి పేరుపై జీవన సాఫల్య పురస్కారం మీకు ప్రకటింపబడినప్పుడు ఎటువంటి స్పందన కలిగింది?*



ఏ : ఉద్వేగంతో కూడుకున్న ఆనందం కలిగింది.

తాతాజీకి నాకూ మధ్యగల ఆత్మీయత మరపురానిది. 1961 నుండి 1969 వరకు ఎనిమిదేళ్ళు తరువాత 1970 నుండి 1972 వరకూ – సుమారు దశాబ్ది కాల అనుబంధం.

అరసం సభలకు ఆయన అధ్యక్షత వహించడం ఓ చరిత్రాత్మక ఘట్టం. అరసం లో నేను చాలా కాలం సభ్యుణ్ణి. ఆయన పత్రికారంగంలో ప్రయోగాలు చేసిన వ్యక్తి. నేను పత్రికా రంగంలో సంపాదకుడిగా ఉన్న అంశాలున్నాయి. ఇలా రంగాలు కూడా మావి ఒకటి కావడం ఆ రంగాలలో ఆయన స్ఫూర్తిని నేను పొందడం వల్ల ఈ పురస్కారం నాకు ఆనందాన్ని, తృప్తినీ యిచ్చింది.


స : *తాతాజీ రచనా శైలి...*

ఏ : ఆయన ఉపన్యాస శైలి, రచనా శైలి చాలా సహజంగా ఉండేవి. నీవు చెప్పే భావాలు  అయిపోయినప్పుడే డబడబలు మొదలవుతాయి అనేవారు.

రాజకీయాలు ఆయనకు అనుషంగికం.

రచనలో స్వేచ్ఛ, ప్రజల భాష, ప్రజల సంస్కృతి వంటివే ఆయనకు ముఖ్యం.

స : *లోగడ కమ్యూనిష్టు పార్టీ సభల్లో గురజాడ, కందుకూరి, గిడుగు వంటి వారి ఛాయా చిత్రాలు పెట్టేవారు. వాడుక భాష, సమ సమాజ భావజాలం వంటి వాటిని ప్రచారం చేయడంలో చరిత్రాత్మక పాత్ర వహించేవారు. అయితే తాపీ ధర్మారావు కమ్యూనిష్టు పార్టీ సభ్యుడుగా*



***తాపీ ధర్మారావుగారి పేరుపై నాకు జీవన సాఫల్య పురస్కారం ప్రకటింపబడినప్పుడు*** **ఉద్వేగంతో కూడుకున్న ఆనందం కలిగింది. తాతాజీకి నాకూ మధ్యగల ఆత్మీయత మరపురానిది. 1961 నుండి 1969 వరకు ఎనిమిదేళ్ళు తరువాత 1970 నుండి 1972 వరకూ – సుమారు దశాబ్ది కాల అనుబంధం.**

**అరసం సభలకు ఆయన అధ్యక్షత వహించడం ఓ చరిత్రాత్మక ఘట్టం. అరసంలో నేను చాలా కాలం సభ్యుణ్ణి. ఆయన పత్రికారంగంలో ప్రయోగాలు చేసిన వ్యక్తి. నేను పత్రికా రంగంలో సంపాదకుడిగా ఉన్న అంశాలున్నాయి. ఇలా రంగాలు కూడా మావి ఒకటి కావడం ఆ రంగాలలో ఆయన స్ఫూర్తిని నేను పొందడం వల్ల ఈ పురస్కారం నాకు ఆనందాన్ని, తృప్తినీ యిచ్చింది.**

*ఉన్నట్లు లేదు. అయితే తమిళ రాష్ట్రం నుండి రాజకీయాల స్ఫూర్తి ఆయనపై పని చేసింది మరి....*

ఏ : ధర్మారావుగారు క్రియాశీలక పక్ష సభ్యుడు కాకపోయినా ఆ భావజాలాల ప్రచారానికే అంకితమయ్యారు. చైనా, రష్యాలు అనేవి మనిషికిగల రెండు కళ్ళవంటివి. ఏ కన్నునూ పొడుచుకోలేం కదా అనేవారు.

స : *మహాకవి శ్రీశ్రీపై తాతాజీ ప్రభావం...*

ఏ : చాలా వుంది. అవకాశం ఉన్నప్పుడు శ్రీశ్రీ తన కవితల్ని తాతాజీ వారికి వినిపించి భేషనిపించుకోవాలనే అభిప్రాయం వుండేది. తాతాజీ అభిప్రాయాన్ని గీటురాయిగా శ్రీశ్రీ భావించేవారు.

1960 లో శ్రీశ్రీ హైదరాబాదుకు ఓ సమావేశ సందర్భంగా వచ్చి చిక్కడపల్లిలో మా యింటిని వెతుక్కుంటూ వచ్చారు. దారిలో బెల్లంకొండ రామదాసు – ప్రసాద్ ఇంటికి వెళ్ళే దారిలో తాతాజీ ఇల్లు వుందని, ఆయన మేడపై వుంటారని చెప్పారు. నేను, శ్రీశ్రీ, బెల్లంకొండ తాతాజీ దగ్గరకు వెళ్లాం. తాతాజీకి కవిత వినిపిస్తున్నారు. నేను మా యింటికి వెళ్ళి పోయాను. తర్వాత శ్రీశ్రీని తీసుకుని తాతాజీ మా ఇంటికి వచ్చారు.

స : *ఆధిపత్య భావజాలం విషయంలో...*

ఏ : ఆ విషయంలో తాతాజీ ఎప్పుడూ వ్యతిరేకంగా ఉండేవారు. తెలుగుపై సంస్కృతం అత్తింటి పెత్తనాన్ని సహించేవారు కాదు.

స : *ధర్మారావుగారి పుస్తకాలన్నీ సమగ్ర సాహిత్య సంపుటాలుగా వేస్తే?*

ఏ : అలా వేయడం సాహిత్య భద్రత రీత్యా మంచిదే కాని ప్రజలు ఆదరిస్తారా అనేది ప్రశ్నే. 100, 150 పుటలు వుండే పుస్తకాలే కొనుగోలు సాహిత్యంలోకి ఎక్కువ వెడుతోంది. హృదయోల్లాస వ్యాఖ్యమినహా మిగిలినవి చిన్నచిన్న పుస్తకాలే అయితే పుస్తకాల్లోకి రాని వ్యాసాలు ఇంకా వున్నాయి. వాటిని ప్రచురించుకోవాలి.

"ఉషఃకాలం" అనే పుస్తకం 200 పుటలు కలది. తెలుగు తల్లి ఆత్మకథగా ఆయన రాశారు. అదీ సాహిత్య భద్రత రీత్యా మళ్లీ వేయాలి. పత్రికా రచనల్లో, వ్యాస రచనల్లో, సినిమా పాటల రచనల్లో ప్రజల భాషనే వాడి, అలా వాడాలని పోరాడారు.

స : *విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకునిగా మీ అనుభవాలు, ఆలోచనలు?*

ఏ : వర్తమాన కాలంలో కొనుగోలు శక్తి తక్కువేం లేదు. కాని పఠనాసక్తి కొంత తగ్గుతోంది. పఠనాసక్తి ఉన్నా నెట్ వంటి సాంకేతిక నూతన సాధనాల వల్ల పుస్తకాలు కొనుక్కోకుండానే జ్ఞానార్జన చేస్తున్నారు. ఉపయోగపడే గ్రంథాల్నే ఎక్కువగా కొంటున్నారు. ఇనప కచ్చడాలు, దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు వంటి గ్రంథాలు ఎప్పుడూకొంటూనే వుంటారు. తక్కిన వాటికి చూపే మొగ్గు వేరు.

పత్రికల్ని, సాహిత్యాన్ని, సినిమాలని ఆయన ప్రజా ప్రచార సాధనాలుగా వాడుకొన్నారు. బోయి భీమన్న, విద్వాన్ విశ్వం, పండితరాధ్యుల నాగేశ్వరరావు, తాపీ మోహనరావు, బిత్రగుంట రామచంద్ర రావు వంటివారి మీద ఎంతగానో వారి ప్రభావం వుంది.

స : *ఆయన రచనా ప్రయోగాలు గురించి –*

ఏ : భాషాశాస్త్ర వేత్తగాను, వ్యాకరణ వేత్తగానుకాక ప్రజలకు ఏమిటి, ఎలా చెప్పాలనే అంశాల్లో ఆయన ప్రయోగాలు విజయ వంతమయ్యాయి. సంస్కృతాన్ని దాచేయడం రచనగా సాగ గూడదని, పొల్లు, నెల్లు గ్రహించి రాయాలనీ అనేవారు. మాట, పాట, బాట – అన్నీ ప్రజా సన్నిహితాలు కావాలనేదే ఆయన లక్ష్యం. ప్రతి సంస్కరణ ప్రజలకు చేరువ అవ్వాలనే ఆయన ఆశయం. తాపీ వారంటే సముద్రాన్ని చిలికినవారు; సముద్రం లాంటివారు.

స : పత్రికా భాషపై రెండు జిల్లాల ప్రభావం ఆధిపత్యంగా ఉందనే అంశం గురించి మీరేమంటారు?

ఏ : ప్రభావం వున్న మాట నిజమే. కృష్ణా గుంటూరు జిల్లా పంట భూములు, జల సంపదలు కారణంగా ఆర్థికంగా పరిపుష్టినందిన పెట్టుబడి దారులు వారుపెట్టిన పత్రికలు తమ భాషా పద్ధతులకనుగుణంగా నడపడం జరిగింది. అక్కడి కొందరు తెలంగాణా ప్రాంత భాష వంటివాటిని ఆ రోజుల్లో తక్కువ చేసి చూడడం జరిగింది. కానీ పరిస్థితులు మారుతున్నాయి. తెలంగాణా మాండలిక భాషను తెలంగాణా భాష అనే అనాలని వాదనలు వచ్చాయి. నేనూ ఆ వాదనని బలపరుస్తున్నాను. తెలంగాణా భాష ఉద్యమకాలంలోనూ, తరువాత అధిక ప్రభావాన్ని చూపుతున్నాయి. కవిత్వంలో బాగా వచ్చింది. పత్రికల్లో ఈ మధ్యన వాడకంలో ఎక్కువగా ఉంటోంది. కొన్ని తెలంగాణా పత్రికల పాత్ర గణనీయంగా ఉంటోంది.



Unfiled Notes Page 20



*అధిపత్య భావజాలం విషయంలో* తాతాజీ ఎప్పుడూ వ్యతిరేకంగా ఉండేవారు. తెలుగుపై సంస్కృతం అత్తింటి పెత్తనాన్ని సహించేవారు కాదు.పత్రికా రచనల్లో, వ్యాస రచనల్లో, సినిమా పాటల రచనల్లో ప్రజల భాషనే వాడి, అలా వాడాలని పోరాడారు. సాహిత్యం, రాజకీయం, పత్రికా రచన, సినిమాలు అన్నిటినీ జనాలకు చేరువ చేశారు.

*ధర్మారావుగారు బహుముఖ ప్రజ్ఞావంతుడు.*

అది అసాధారణ ప్రజ్ఞ.

ఏదో ఒక రంగంపై ఆయన తన దృష్టిని సారించి వుంటే ఆ రంగంలో ఆయనతో పోల్చడానికి మరొకరు వుండేవారు కాదు.

స : *వర్తమాన కవిత్వం గురించి వర్తమాన కవుల గురించి మీ అంచనాలు ?*

ఏ : కవులు చాలా మంది వస్తున్నారు. కవిత్వాల పుస్తకాలూ చాలానే వస్తున్నాయి. శ్రీశ్రీ, ఆరుద్ర, సి.నా.రె., సోమసుందర్ తరం ఆధునిక కవులు అధ్యయనంలో ముందుండేవారు. వారితో పోలిస్తే వర్తమాన ఆధునిక కవుల అధ్యయనం బాగా పెరగవలసివుంది. అధ్యయన అవకాశాలైతే చాలా వున్నాయి.

స : *పెట్టుబడిదారులలో ఏమైనా మార్పులు వచ్చాయంటారా?*


ఏ : శ్రీశ్రీ తరంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్లిష్టంగా వుండేది. ఎవరు ఏం చేస్తున్నారో తెలియకుండా దోపిడీ చేసే లక్షణాలు ఆ వ్యవస్థలో ఉండేవి.

ఇప్పుడు పెట్టుబడి సమాజం ఎవరో ఏమిటో అనేవి, దోపిడీ పద్ధతులు బాహాటంగానే తెలుస్తున్నాయి.

స్వాతంత్ర్య సాధనకు పూర్వం కేవలం విదేశీయులే దోపిడీ దార్లుగా ఉండేవారు. మా కొద్దీ తెల్లదొరతనం' వంటి పాటలు వచ్చాయి. తరువాత మనవారిలోనే దోపిడీ దార్లు ఉండడం వల్ల కుసుమ ధర్మన్న కవి 'మా కొద్దీ నల్ల దొరతనం' అని పాట రాయవలసి వచ్చింది. ఇప్పుడు శత్రువుల దగ్గరే అస్త్ర శస్త్రాలన్నీ వున్నాయి. మన దగ్గరేం లేవు. యుద్ధం చేయడానికి సంసిద్ధతా లేదు.

స : *ధర్మారావుగారికి బహుముఖ ప్రజ్ఞ వుంది కదా!*

ఏ : అవును వుంది. అది అసాధారణ బహుముఖ ప్రజ్ఞ, కానీ ఏదో ఒక రంగంపై ఆయన తన దృష్టిని సారించి వుంటే ఆ రంగంలో




డా॥ ఏటుకూరి ప్రసాద్‌గారికి పిహెచ్.డిని తెచ్చిపెట్టిన పరిశోధనాగ్రంథం అసలు ప్రతి ఇదే. ఇప్పుడు 'తాపీ ధర్మారావు జీవన సాఫల్య పురస్కారం' పొందడానికి కారణమైనదీ ఇదే.

ఆయనతో పోల్చడానికి మరొకరు వుండేవారు కాదు. ధర్మారావుగారు సాహిత్యం, రాజకీయం, పత్రికా రచన, సినిమాలు అన్నిటినీ జనాలకు చేరువ చేశారు.

స : *మీ పరిశోధన...*

మొదట 'ప్రజా కళారూపాలు వామపక్ష ఉద్యమాలకు ఎలా తోడ్పడ్డాయి' అనేది నా పరిశోధనాంశం. తాపీ ధర్మారావుగారు విశ్వవిద్యాలయం పెద్దలకు నన్ను పరిచయం చేసి ప్రోత్సహించారు కూడా. అయితే తర్వాత నా పరిశోధనను 'తాపీ ధర్మారావు జీవితం – రచనలు' అన్న అంశం మీదే చేయాలనిపించి, చేశాను.

స : *మీ మీద ఎవరైనా పరిశోధన....*

ఏ : చేశారు. 2005లో ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిశోధకురాలు పి.వి. అనూరాధ 'ఏటుకూరి ప్రసాద్ సాహిత్యం – పరిశీలన' అంశంపై పరిశోధన చేశారు. జీవితం, వ్యక్తిత్వం, కవిత్వం, పత్రికలు వంటి అంశాల వింగడింపులతో అది సాగింది. యువజన, అభ్యుదయ వంటి పత్రికలకు నా సంపాదకత్వం, కలం బొమ్మలు, కెరటాలు వంటి నా పుస్తకాలపై అందులో విశ్లేషించారు.

స : *తాపీవారు మరణించాక ఆయన సాహిత్య ముద్రణకై ప్రత్యేక ప్రయత్నాలేమైనా జరిగాయా?*

ఏ : జరిగాయి కాని క్రియా రూపం ధరించలేదు. తాపీ వారి అబ్బాయి చాణక్య – ఆయన, పరుచూరి హనుమంతరావు, తాపీ మోహనరావులతో ఒక సంఘాన్ని కూర్చారు. కాని కొనసాగింపులేకపోయింది.

స : *ధర్మారావుగారి గ్రంథాల్లో అన్నీ వేయవలసిన అవసరం వుందా?*

ఏ : ఉంది. ఆయన తొలినాళ్ళలో వీరగ్రాంధిక వాది. 1912లోనే 'ఉషఃకాలం' అనే వచన పుస్తకం రాసి వాడుక భాష వల్ల భాషకు జరిగే నష్టాన్ని తెలిపారు. ఒక రచయిత ఎన్నో పరిణామాలు పొంది, మార్పులు చెంది సాహితీ సేవ చేస్తారు. అవన్నీ వర్తమాన భవిష్యత్తరాలకు అందియ్య వలసిన బాధ్యత మనపై ఉంది.

స : కొనుగోలు సాహిత్యంలో మత ధార్మిక గ్రంథాలు అధికంగా ఉంటాయి కదా! అటువంటి అంశంలో విశాలాంధ్ర ఎటువంటి పాత్ర వహించింది. విశాలాంధ్ర ప్రచురణాలయం వైజ్ఞానిక గ్రంథాలు, వామ పక్ష భావజాల గ్రంథాలు, అభ్యుదయ భావాలు వ్యాప్తి చేసి సమాజాన్ని





ముందుకు నడిపించే గ్రంథాలు వంటివే వేయాలని సంకల్పించింది. అలాగే చేసింది. డిస్ట్రిబ్యూషన్ ద్వారా కూడా గట్టిగానే నిలబడింది.

**స :** *రెండు తెలుగు రాష్ట్రాలు రెండుగా ఏర్పడ్డాక ప్రచురణా రంగంలో పరిస్థితులు ఎలా వున్నాయి.*

**ఏ :** విశాలాంధ్ర ప్రచురణాలయం రెండుగా మారింది. నవ చేతన సంస్థ, విశాలాంధ్ర ప్రచురణాలయం అయ్యాయి. ఒకటి తెలంగాణాకు– రెండోది తక్కిన ప్రాంతానికి.

విశాలాంధ్ర సంస్థకు పుస్తకాల షాపులు ఎక్కువ వున్నాయి. నవచేతనకు ఖమ్మం, కరీంనగరు, వరంగల్లు, హైదరాబాదుల్లో మాత్రమే వున్నాయి. నవచేతన కంటె ఆదాయ రీత్యా విశాలాంధ్ర ముందుంది.

నేను 1983 నుండి 1995 వరకు ఏటుకూరి బలరామమూర్తి వంటి వారితో విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదక సభ్యుడిగా ఉన్నాను. 1996 నుండి 2014 వరకు సంపాదకుడిగా ఉన్నాను. తర్వాత ప్రస్తుతం నవ చేతనకు ప్రధాన సంపాదకుడిగా వున్నాను. మేం వేసిన చేనేత కథలు, రుద్రాభట్ల నరసింగరావు కథలకు మంచి ప్రాచుర్యం వచ్చింది.

పుస్తకాల కొనుగోలు మనస్తత్వం పెరగాలి. అప్పుడే ప్రచురణ రంగానికి వికాసం.

తాపీగా సంతృప్తికరంగా సాగుతున్న జీవితం శ్రీ ప్రసాద్‌గారిది. సమసమాజ ధర్మానికి అనుగుణమైన రచనలకు, వాని వెలుగులకీ అధిక కాలాన్ని వెచ్చించిన నిత్య శ్రామికుడు. నమ్మిన కమ్యూనిష్టు పార్టీని అనుసరిస్తూన్న వామ పక్షీయుడు. రెక్కలు విప్పుకుని తమ భావజాల విహారంలో అహరహం గడుపుతున్న ఉన్నతుడు. గుంటూరులో 1936 జూలై 19న పుట్టారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ ఎమ్మె పట్టా చేపట్టారు. ఉస్మానియా పి.హెచ్‌డి చేసి డా॥ ఏటుకూరి అయ్యారు. 1959 నుండి సి.పి.ఐ సభ్యులు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సమర్థించారు. నాలుగు కాలాల పాటు చెప్పుకోతగ్గ అభ్యుదయ ప్రత్యేక సంచికలు అందించారు. 1960 నుండి 1964 వరకు గుంటూరునుండి యువజన పత్రిక మంచి ప్రమాణాలతో అందించారు.

ఆయన తన జీవిత కాలంలోని ఎన్నో మధుర స్మృతులు, స్మరణీయ వ్యక్తులు, స్మరణీయ సంఘటనలు ఎన్నో! ఎన్నెన్నో, వర్తమానకాలం లోని కులాంతర వివాహాల సందర్భంగా పరువు హత్యలకు ఆయన హృదయం కల్లోల తరంగితమౌతోంది.

ఆయన్ని కదిపితే దువ్వూరి వెంకటరమణశాస్త్రి, జమ్మలమడక మాధవరాయశర్మ, కరుణశ్రీ, బి.రామరాజు, ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీశ్రీ, ఆరుద్ర, సోమసుందర్, దాశరథి, సినారె, బంగోరె వంటివారు ఆయా సందర్భ సంఘటనలతో సాక్షాత్కరిస్తారు. ఇరవై వేల పుస్తకాల గృహ గ్రంథాలయంతో ఆయన జ్ఞాన దాహాన్ని తీర్చుకుంటూనే వుంటారు.

ఆరోగ్యంగా ఉన్న శ్రీ ఏటుకూరి ప్రసాద్‌గారికి రక్త పరీక్ష చేయిస్తే, ఆ రక్తంలో తాపీ ధర్మారావుగారున్నారని సాహిత్య వైద్యులు తేలుస్తారనిపిస్తుంది. అదీ ఆయన అభిమానం, పెద్దాయనంటే.

ఎనభై రెండేళ్ళ ఏటుకూరి వారు ఎనభై ఒక్క ఏళ్ళ విశ్రాంత సైన్సు టీచరు చింతలపాటి కుసుమ కుమారితో, పుత్రరత్నం అరుణ ప్రసాద్‌తో హైదరాబాదులోని సాహిత్య మహిమాయత్ నగర్‌లో ప్రశాంతంగా సంతృప్తికర జీవితాన్ని సాగిస్తున్నారు.

ఆయురారోగ్య భాగ్యాలతో వారు తులతూగుతూ సామాజిక సాహిత్య సేవలను ఇలాగే కొనసాగించాలనేదే మనందరి ఆకాంక్ష.

## ఎడ్ల రథంపై ఏటుకూరి...

ప్రజా రచయితకున్న గౌరవానికి గీటురాయి ప్రజలే! గుంటూరు జిల్లా మాచెర్లలో ఒక ఎడ్ల రథంపై వూరేగించారు. ఆ ఊరేగించింది ఇద్దర్ని. మరొకరు కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు.

## ఏదో గడబిడ చేశామన్నమాట!

ఓసారి తాపీ ధర్మారావుగారికి ఓ ఉత్తరం వచ్చింది. అంత హైదరాబాద్‌లోనూ 'తాపీ ధర్మారావుగారు, చిక్కడపల్లి, హైద్రాబాదు' అని మాత్రమే చిరునామాగా రాస్తే వచ్చేసిందట. దానిపై ధర్మారావుగారు ప్రసాద్‌గారితో మనం చిక్కడపల్లిలో ఏదో గడబిడ చేస్తున్నామన్నమాట, ప్రసిద్ధి వహిస్తున్నామన్నమాట అన్నారట సరదాగా...

## రాతలలా వుండేవి!

విశ్వనాథ సత్యనారాయణగారు రాసిన కాగితాలు కొన్ని నాకు పావని శాస్త్రిగారు పంపారు. కొట్టివేతలు, మార్పులు ఆ రాతల్లో వుండేవి. కృష్ణశాస్త్రిగారి వంటివారి లిఖిత ప్రతుల్లో అలా కొట్టివేతలుండేవి మార్పులుండేవి. తాపీ ధర్మారావుగారు తమ జేబులో పొడుగుపాటి కాగితాన్ని వుంచుకుని ఏవేనా ఆలోచనలు వస్తే దానిపై రాసుకుని మళ్ళీ మడిచి జేబులో పెట్టుకునేవారు.

ఒక్క సి.నారాయణరెడ్డిగారు మాత్రం మార్పుల్ని తలలోనే చేసుకుని సరాసరి కాగితంపై రాయగలిగేవారు. కరుణశ్రీ కొట్టివేతలు, మార్పు రాతలు చూశాకే నాకు పొయిట్రీ వర్క్‌షాపునకు ప్రేరణ, స్ఫూర్తి అయింది. కరుణశ్రీ సాహిత్య సభలకు వెళ్లిన సందర్భాలలో ఆయన తరగతులు నేను తీసుకు చెప్పేవాణ్ణి.



రచయిత : కీ.శే.దుర్గానంద్

# శబ్దగాండీవి వేమన

(సెప్టెంబరు సంచిక తరువాయి)

అంటరానితనం పాటించడమనేది సివిల్ వార్ లాంటిది. సమాజానికి ఒక పుండు. పెద్ద పెద్ద సమస్యల్ను పెద్దపెద్ద యుద్ధాలు చేసి శత్రుహననం చేసి తీర్చవచ్చుగాని ఇలాంటి సమస్యలు గృహ సమస్యలుగా ఉండి సమాజానికి తలనొప్పి కలిగిస్తాయి. వీటిని ఎలా పరిష్కరించాలో తెలియదు. సవర్ణులకు ఎంత చెప్పినా వాళ్లు కడజాతివాళ్లను హీనంగా చూడటం మానుకోరు. యుద్ధం చేయడానికి వాళ్ళు బయట శత్రువులు గాదు. సమాజంలోని వారు. వీళ్లనెట్లా శోధించాలి. సమాజంలో దుష్టులు క్రూరులు రౌడీలు ఉంటే పేచీ లేదు. వాళ్లకంటే ప్రమాదకారులూ ఏమీ చేయడానికి వీలులేని వారు ఈ ఛాందసులూ కుత్సితులు, చాడీకోరులు, మెరమెచ్చు మాటలు పలికే వాళ్ళు. వీళ్ల వల్ల రౌడీలు హంతకులకంటే ఎక్కువ అన్యాయం జరుగుతుంటుంది. రౌడీలను హంతకుల్ను సమాజం నుంచి ఒక్కసారి తొలగించవచ్చు. కాని ఈ వేరుపురుగుల్ని ఎలా? పాముల వల్ల మనకు బాధ లేదు. అవి ఎప్పుడో ఎక్కడో ఉండి కరుస్తాయి. కాని ఈగలు, దోమలు, ఎలుకల బాధ భరించరానిది. ఇవి పట్టుకోవడానికి దొరకవు. దేశాన్ని మొత్తం కొరుకుతుంటాయి. వేమన దృష్టి ఇలాంటి నయవంచకుల మీదే ఎక్కువ ఉంది. ఇలాంటి చిన్న జీవుల వల్లే దేశం చెడిపోతుందని ఆయన అభిప్రాయం.

*'చెప్పులోని రాయి చెవిలోని జోరీగ*
*కంటిలోని నలుసు కాలిముల్లు*
*ఇంటిలోని పోరు ఇంతింత గాదయా'*

చూడండి ఎంత చక్కని బాధను వేమన మన ముందు పెట్టేడో. చెప్పులో రాయి తీసి వేసుకోవడానికి బద్ధకం, ఉంటే నెరుముతూ ఉంటుంది. చెవిలో జోరీగ అంతే. లోపలికి పోదు బయటికి రాదు. కంటిలో నలుసు అలాగే. కాలి ముల్లు. ఇంటిలో పోరు. ఇవి ప్రాణం తీయవు. కాని అంతకంటె ఎక్కువ ప్రాణాంతకమయినవి.

వేమన వేదాల్ను కఠోరంగా దూషించాడు. వేదాలకంటే వేదాల్ను పదేపదే వల్లె వేస్తూ అవి భగవంతుడు సృష్టించినవంటూ వాటి మాటున తమ నైచ్య వ్యవహారాల నన్నింటినీ దాచుకుంటున్న పండితబ్రువులంటే ఆయనకు చెడ్డ చిరాకు, వాళ్ల మీది అసహనం ఈ వేదాల మీదకు వచ్చింది. అందువల్ల వాటిని పరమ దారుణంగా తిట్టాడు.

*'వేద విద్యలెల్ల వేశ్యల వంటివి*
*భ్రమల బెట్టి తేట పడగ నీవు*
*బ్రహ్మవేమెు తెలిసి బ్రతుకుట నిజమౌను'*

ఇదీ ఆయనకు వేదాల పట్ల ఉన్న గర్హణ. వేశ్యల మాయా వాగురంతో చిక్కుకున్న గృహస్థు ఎలా అయితే ఇంటి ముఖం చూడడో అలాగే ఈ వేద విద్యలు బ్రహ్మ ముఖం చూడ నివ్వవు. వేదాల కంటే ఉపనిషత్తులు మహోన్నతాలు. అవీ వేదాల్లోని మంత్రాలే అయినా అసలైన తత్త్వ విద్యా జీవన రహస్యం గలిగిన భాగాలు. సంగ్రథించి వేరుగా చేయబడినాయి. ఈ జ్ఞాన కవులకుగాని శంకరాచార్యుడి వంటి అద్వైతులకుగానీ ప్రేరణ ఈ ఉపనిషత్తులే. ఈ ఉపనిషత్తుల మూలగతార్థమే వేమన కబీరు రవీంద్రుడిలాంటి వారికి మూల ప్రేరకాలైనాయి. కొన్ని ఉదాహరణలు –

*'తదేజతి, తన్నై జతి తద్దూరే, తద్వంతికే*
*తదంతరస్య సర్వస్య*
*తదు సర్వ స్యాస్య బాహ్యతః'*

– ఈశోపనిషత్తు

దీని అర్థమేమంటే ఆ పరమాత్మ నడుస్తున్నాడు కాని నడవడు, దూరాన ఉన్నాడు, దగ్గర ఉన్నాడు. ఈ సర్వజగత్తుకూ లోపల ఉన్నాడు బయట ఉన్నాడు. అంటే బాహ్యాంతరాల సర్వత్రా అతడు నిండి ఉన్నాడని. దీనికి వేమన ఏ మంటున్నాడో చూడండి.

*'అఖిలా లేరు డనంతుడు*
*సకలాత్మలయందు సర్వ సాక్షియు దానై*
*నిఖిలముల నిర్వికారుడు*
*నికిరము బ్రహ్మమ్మనంగ నిజముర వేమా!*

ముండకోపనిషత్తులో ఇలా ఉంది :

*భిద్యంతే హృదయ గ్రంథి*
*ఛిద్యంతే సర్వ సంశయాః*
*క్షీయంతే చాస్య కర్మాణి*
*తస్మిన్ దృష్టే పరావరే*

ఇంద్రియాగోచరమైన ఆ పరమాత్మను కనుగొంటే హృదయ గ్రంథులు నశిస్తాయి. సర్వ సంశయాలు పటాపంచలు అవుతాయి. కర్మలు క్షీణిస్తాయి.

వేమన వాక్కుల్లోనూ ఇదే తత్వం ప్రతిబింబించుతుంది

*చర్చ మీరిన జ్ఞానంబు సంతరించి*
*మూర్ఛ చెందిన యట్లున్న ముక్తి గలుగు*

చర్చాతీతమైన జ్ఞానంలో ముక్తి లభిస్తుందని. సంశయాలు విడబడి పోతాయని ఇంకా ఎన్నో చోట్ల వేమన చెప్పాడు. వేమన ఉపనిషత్తులు చదివినా చదవక పోయినా ఉపనిషత్ జ్ఞానమే ఈ జ్ఞాన కవులలో దొరలి వచ్చిందని చెప్పడం నా అభిమతం.

ఈశోపనిషత్తులో మరొక మంత్రం

*"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖమ్*
*తత్త్వం పూషన్నపావృణు సత్య ధర్మాయ దృష్టయే"*

దీని అర్థం 'బంగారు పాత్ర ద్వారా సత్యము యొక్క ముఖం మూయబడి ఉంది. అందువల్ల ఓ సూర్యుడా! సత్యదృష్టి కొరకు దాన్ని నీవు తొలగించు! ఇక్కడ బంగారు పాత్ర అంటే



Unfiled Notes Page 23

మాయా ప్రకృతి. మాయా ప్రకృతి తన వన్నెలు చిన్నెలతో సత్యాన్ని కనపడకుండా దాచివేసింది. అది జ్ఞాన సూర్యుడితోనే బయట పడుతుంది.

బంగారు ముఖంతో కప్పబడిన యీ సత్యాన్నే వేమన నేతితో పోలుస్తాడు. వెన్న ముద్ద మన చేతిలో ఉంది. కాని దాన్ని తెలుసుకోలేక నెయ్యిని వెతుకుతున్నాం అంటాడు.

*'వెన్న చేతబట్టి వివరంబు తెలియక*
*ఘృతము కోరునట్టి యతని భంగి'*

ఉపనిషత్తులో భ్రమా, భ్రామకం వేరుగా చెప్పబడింది. ఇక్కడ జ్ఞానం తెలిసిన తరువాత తాదాత్మ్యం చెప్పబడ్డది. ఈశోపనిషత్తు ఒక చోట 'అంధం తమః ప్రవిశంతి యేऽ విద్యా ముపాసతే" అంటుంది.

అవిద్యను ఉపాసించే వాళ్లు గాఢాంధ కారంలోకి వెళతారని. మన వేమన దృష్టిలో ఈ అవిద్య అంటే ఏమిటో చూడండి..

*'కారుకారు గురులు కాగుణితము జెప్ప*
*శాస్త్ర పాఠములను జదివి చెప్ప'*

కా గుణితమూ శాస్త్ర పాఠాలు చెప్పేవాళ్లు గురువులు కారు. అంటే ఇవి అవిద్యలు. పొట్ట కూటికోసం చదువుకునేవి. వీటితో మోక్షం లభించదు.

'అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్య యాऽమృత మశ్నుతే" అవిద్య' మృత్యువును దాటడానికే పనికి వస్తుంది. విద్యతోనే అమృతం అంటే ముక్తిని పొందగలుగుతాము. శాస్త్ర పాఠాల వల్ల ప్రయోజనం లేదని చెప్పి వేమన ఆ తరువాత ఇదే మాట అన్నాడు. "ముక్తి దారి జూపు మూలము గురుడురా" ఇక్కడ గురుడు అంటే విద్యనూ, బ్రహ్మ విద్యనూ ఇచ్చేవాడని. ఉపనిషత్తుల్లో చెప్పిన మాటల్నే ఈ జ్ఞానులు ఇంకా శాఖోపశాఖలుగా విస్తరింపజేసి లోకానుభవాన్ని కూడా మేళవింపజేసి ఆ మార్గానికి ఒక నిశ్చిత రూపం కల్పించారు. తత్వ రహస్యం మాత్రమే చెప్పిన ఉపనిషత్తులు వీరికి కేవలము బ్రహ్మతత్వాన్వేషణకే ఉపయోగపడలేదు. విద్యకు, బ్రహ్మకు ఆ విరాట్ తత్వానికి ప్రతిబంధకంగా ఉన్న ప్రకృతిని, మాయను నిరసించడానికీ తిట్టడానికీ కూడా ఒక ప్రేరణను ఇచ్చినాయి. అవిద్యలో కూరుకుపోయిన వాడు 'అంధంతమః ప్రవిశంతి' అని ఉపనిషత్తులు ఎలాగూ అన్నాయి. దాన్నిబట్టి జ్ఞాన కవులకు ఈ అంధ తమస్సు అవివేకులైన రోజుల్లోనూ, దాంభికులైన మత పండితుల్లోనూ స్వార్థపరులైన లౌకిక జీవుల్లోనూ గుళ్లల్లోనూ గోపురాల్లోనూ కృత్రిమ శాస్త్ర పాఠాల్లోనూ అబద్ధాలు వంచనలు కవటాలు స్వార్థాలు ఉన్న ప్రతి జీవితపుటడుగులోనూ కనిపించింది. జ్ఞాన కవులకు ఇవన్నీ మాయా ప్రకృతి కూటమికి చెందినవి. ఆత్మ, జ్ఞానము – వీటికి చెందినవి సద్విద్య, సద్గురుడు, సన్మార్గము, సత్సాంగత్యము, మిత భాషిత్వము. సరళ జీవనము, నిరాడంబరత, సమాధి, యోగదృష్టి, జీవకారు ణ్యము పరోపకారము మొదలైనవి. ఇలా వీళ్లు చక్కగా జీవితపు ఋత మార్గమేమిటో అనృత మార్గమేమిటో విభజించి చూపెట్టారు. హిందూ మతంలో అయితే ఇవన్నీ కలగా పులగమై పోయినాయి. యజ్ఞాల పేరు చెప్పి ఎంత హింసైనా చేయవచ్చు. కృష్ణుడు పేరు చెప్పి ఎంతమంది గోపికల్నైనా ప్రేమించవచ్చు. నానా ఎంగిళ్ళు తిని బంగారపు తీగెతో నాలుక కాల్చుకుని శుద్ధి చేసుకోవచ్చు. కుండలో పుట్టినవాడికి జందెం వేసి బ్రాహ్మణుడనవచ్చు. నియోగం పేరుతో పదిమంది భర్తలనైనా పొంది పుత్రులను బడయవచ్చు. ఇందులో ఏది ధర్మం ఏది అధర్మం. లా పాయింటు ఇటు లాగితే పతివ్రతలు కులటలు అవుతారు. జీవితమంతా సర్వ పాపాలు చేసి గంగలో ఒక్క మునక మునిగితే వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటాయి. ఇలా ఉంది మన హిందూ సమాజం. ఈ పరిస్థితుల్లో జ్ఞాన కవులు ముందుకు వచ్చి ఇది ధర్మం, ఇది అధర్మం. ఇది వెలుగు, ఇది చీకటి– ఇది సత్యం– ఇది అసత్యం, ఇది నిత్యం ఇది అనిత్యం, అని పాలూ నీళ్లూ వేరు చేసి చూసినట్టు చూపారు. పార లౌకిక జీవితం ఎంత చెప్పాడో లౌకిక జీవితాన్ని గురించి అంత కంటె ఎక్కువ చెప్పారు. దేవుణ్ణి గురించి చెప్పినప్పుడు దయ్యాన్ని గురించీ చెప్ప వలసి వస్తుంది. రాముణ్ణి గురించి చెప్పినప్పుడు రావణాసురుణ్ణి గురించీ చెప్ప వలసి వస్తుంది. అయోధ్యను ఎంత పొగడాలో లంకను అంత తెగడ వలసి వస్తుంది. అందువల్లే బ్రహ్మ తత్వాన్ని చెప్పే ప్రతి సందర్భంలో ఈ లోకాన్ని దీని దురుపయోగాన్ని ఎత్తుకున్నారు జ్ఞాన కవులు. ఈ లోక వ్యవహారాన్ని ఇంత ఎక్కువగా ఎత్తుకోవడం వల్లే వేమన గురించి ఒక అపప్రథ కూడా ఏర్పడ్డది. ఈయన లోకనింద చేసేదే తప్ప పరమాత్మ, జీవుడు యోగము మొదలైన గంభీర విషయాలను గురించి చెప్పలేదోమోనని. కాని వేమన చెప్పినంత ఈ బ్రహ్మ విద్యను గురించిన కవిత్వం ఎవరూ చెప్పలేదు. ఈ తాత్త్విక విషయాలు కలిగిన పద్యాలే ఆయన రచనల్లో ఎక్కువ ఉన్నాయి. కాకపోతే ఈ సంఘ దూషణకు సంబంధించిన పద్యాలు అతి మిక్కుటముగా లోకంలో ప్రచారం కావడం వల్ల ఆయన తాత్త్విక విద్వత్తును ఎవరూ పట్టించుకోలేదు. అది అక్కర్లేదు అనుకున్నారు కూడా.

చదువుకున్న వాళ్లను నిరసించడం ఆనాడూ ఉంది. ఈనాడూ ఉంది. చదువుకున్న వాళ్ళు జీవితానికి దూరంగా పోయి వ్యర్థులవుతుంటారు. ఎందుకంటే చదువనేది నిత్య ప్రవాహం, సహజ ప్రవాహం. అది ప్రజా జీవితంలోనించి పెల్లుబుకి వస్తుంది. పండితులనే బండరాళ్లు పడికట్టు పాఠ్యక్రమాలనే ఆనకట్టలతో దాన్ని బంధించి తమకు అనువైన కలుగుల్లోకి ప్రవహింపజేసి తీసుకు వెళ్ళడానికి చూస్తుంటారు. విద్యాధికులు ఈ విద్య స్టాగ్నెంట్ వాటర్. ఈ విద్యాలయాల కాలేజీల లాకుల్లో నించి పోయి సిండికేటుల చాదస్తం అనే ఉప్పు చౌడు భూముల్లో మేటలు వేస్తుంది. అందువల్ల ఈ పండితుల విద్యకూ ఈ ఎకడమీల విద్యకూ, ఈ సిండికేటు విద్యకూ ప్రజల విద్య ఎప్పుడూ ఎదురు తిరుగుతూనే వస్తుంది. వేదాల చదువు ఎకడమిక్ చదువు. బుద్ధుడిది ప్రజల చదువు. అందువల్లే ఈ ఎకడమిక్ చదువుకు బుద్ధుడు ఎదురు తిరిగాడు కృష్ణుడు ఎదురు తిరిగాడు. క్రీస్తు ఎదురు తిరిగాడు. నానక్ ఎదురు తిరిగాడు. కబీరు ఎదురు తిరిగాడు. గాంధీ ఎదురు తిరిగాడు. మన వేమనా ఎదురు తిరిగాడు.

*'ఠింగణాలు బలసి నింగికి నెగిరిన*
*జెట్టు చివర పండు చేత బడునె!*
*పుస్తకములు జదువ బొందునా మోక్షముల్'*

ఈ చదువుకున్న వాళ్ల నందరినీ వేమన్న ఠింగణాల క్రింద జమకట్టాడు. ఠింగణా ఎగిరి ఎగిరి చెట్టు పండును ఎలా అందుకోలేడో అలానే ఈ పుస్తక పరాయణులూ ఈ నెక్ టై ప్రొఫెసర్లూ ఈ ముక్కు పొడుం పండితులూ అసలు జీవిత లక్ష్యాన్ని అందుకోలేరు. కబీరు 'పఢ్‌పఢ్‌ముయే పండిత్' అంటాడు. చదివి చదివి పండితులు చచ్చిపోతున్నారని.

**తరువాయి వచ్చే సంచికలో...**

భాషోద్యమ కథానిక

యనమండల ఆనంద నాయుడు
99666 63979

# తెగిపోతున్న బంధాలు



నాకు రాజమండ్రితో దాదాపుగ 15 ఏళ్ళ అనుబంధం. ఊహ తెలిసినప్పటి నుండి ఏ ఊరితోను అంతటి అనుబంధం లేదు. నా దృష్టిలో నవ్యాంధ్రప్రదేశ్ కు రాజధాని కాగల ఏకైక పట్టణం రాజమండ్రి మాత్రమే. రాజధాని కావడానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన దూరముండాలి అన్న ముఖ్య విధాన నిర్ణయం వలన ఈ సాంస్కృతిక రాజధానికి రాజకీయ రాజధాని అయ్యే అవకాశం లేకుండా పోయింది. రాజమండ్రి పేరు మదిలో మెదిలితేనే ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. తెలుగు పండితులు, భాషోద్ధారకులు, వైతాళికులు నడయాడిన నేల. అఖండ గోదావరి మాత స్పర్శతో పులకించిన పురం.

ఉదయమే ఏలూరు నుండి బయలుదేరి వెళ్ళిపోయి దేవీచౌక్ వద్దగల ఆఫీసులో పని ముగించుకొని గత స్మృతులను నెమరు వేసుకొంటూ అక్కడి నుండి నడచుకొంటూనే రైల్వే స్టేషన్‌కు వెళ్ళేటప్పటికి సమయం మధ్యాహ్నం రెండు గంటలు. ఏలూరు వెళ్ళడానికి సాయంత్రం నాలిగింటి వరకు సరైన రైలు ఏదీలేదు. హౌరా మెయిల్ వంటి దూరపు రైళ్ళు ఒకటో రెండో ఉన్నా వాటిలో ఖాళీ ఉండదని భావించి వైజాగ్ నుండి బయలుదేరి వచ్చే రైలు ఎక్కాలని నిర్ణయించుకొన్నాను. సరే ఎక్స్‌ప్రెస్ టికెట్ తీసుకొని ఎ.సి. వెయిటింగ్ రూంలోకెళ్ళి కూర్చొన్నాను. 2 గం॥30 ని॥లకు విశాఖ పట్టణం - విజయవాడ పాసింజర్ రైలు వస్తున్నట్లు అనౌన్స్ చేశారు. వెళ్ళి విచారించగా 1.50 గం॥లకు రావలసిన పాసింజర్ రైలు ఆలస్యంగా వస్తోందని దీనికి వెనుక ఎక్కువ రైళ్ళు ఏవీలేనందున 4.30 గ॥లకు ఏలూరు చేరుకోగలదని తెలియజేశారు. ముందుగా అనుకొన్నట్లు ఎక్స్‌ప్రెస్ రైల్లో 4 గం॥లకు ఒక వేళ బయలుదేరినా 5 గం॥ తరువాత గాని ఏలూరు చేరుకోలేను. కాబట్టి పాసింజర్ రైలు అయినా కానీ ప్రయాణానికి సిద్ధపడిపోయా. ఎటొచ్చీ రూ.50/- వృధా అయినా పరవాలేదు. బస్సుకైతే వందకు పైమాటే. ఇప్పుడు దెబ్బె అయిదే మరి ప్రయాణపు అలసట కూడ ఉండదు కదా!

అనుకొన్నట్లే 2.30 గ॥లకు రెండో ప్లాట్ ఫారం మీదకు రైలు వచ్చింది. ఖాళీగ ఉంది. నాతో పాటుగ ఒక సూపర్ సీనియర్ పెద్దాయన, మరో స్త్రీ బోగీలోకి వెళ్ళి కూర్చొన్నాము. ఆయనకు వందేళ్ళు దాటాయని, దాని తాలూకు జన్మదినోత్సవం ఇటీవలే ఏలూరు వద్దగల వారి గ్రామంలో జరిగిందని, ఆమె ఆయన కుమార్తె అని వారి మాటల్లో నాకర్థం అయింది. నాకు అలాంటి పెద్దవాళ్ళను చూసినప్పుడు వారి జీవన విధానం, అనుభవాలు పంచుకోవడం అంటే చాలా ఇష్టం.

కొంత సమయం తరువాత పరిచయా లైన పిమ్మట తన గురించి తెలియజేయమన్నాను. నెమ్మదిగా చెప్పడం మొదలు పెట్టాడు. ఒక్కతే అమ్మాయి. అల్లుడు రాజమండ్రి. వారిద్దరూ ఉద్యోగస్థులే. ఐదేళ్ళ క్రితమే ఆమె కూడా ఉద్యోగ విరమణ చేసింది. తనకు ఓ పదెకరాల పొలం ఉంది. తన తండ్రి కమ్యూనిస్టు భావాలు గల వ్యక్తి అయినందున చిన్నతనం నుండి కూడ ప్రతి విషయాన్ని కొంత లోతుగా ఆలోచించే స్వభావం అలవడింది. ఆ రోజులలో పదవ తరగతి వరకు చదువుకొన్నాడు.

తన ఆరోగ్య రహస్యాన్ని కూడ తెలియ జేశాడు. చిన్నప్పటి నుండి కూడా ఒక పట్టు బియ్యం భోజనమే అలవాటు. రోజూ ఉదయం ఒక గ్లాసెడు రాగి జావ అలవాటు. మనిషి పాతికేళ్ళ వరకు, చేసే పనికి శరీరపోషణకు పెరుగుదలకు ఆహారం అవసరం అంటాడు. తరువాత పెరుగుదల ఉండదు గనుక మూడింట రెండువంతుల ఆహారమే తీసుకొనేవాడు. మాంసాహారం అలవాటు తక్కువ. తన పొలం లో పండించే కాయగూరలు, ఆకుకూరలు, మునగాకు వంటివి ఉపయోగించుకొనేవారు. పచ్చళ్ళు, నెయ్యి అలవాటు తక్కువ. కాలానుగుణంగా వచ్చే పళ్ళు తినేవాడు. కూరల్లో వేసే కాయగూరల ముక్కలు, కరివేపాకు, కొత్తిమీరి ఆకులు కూడ తినడం అలవాటు. చదవడం బాగా అలవాటు. చిన్నా చితక పొలం పనులు చేసేవాడు. ఎప్పుడూ ఏదో ఒక

పని చేస్తూనే ఉంటాడు. ఖాళీగ ఎప్పుడూ ఉండడు.

కుతూహలంగా వింటున్నాను. ఇంత పద్ధతిగ ఉన్న మనిషి తన తరువాత తరం వారిని ఎలా తీర్చిదిద్దాడు? అదే విషయం అడిగాను. అది కూడ నెమ్మదిగా చెప్పసాగాడు. ముందే చెప్పినట్లు ఒక్కతే అమ్మాయి. డిగ్రీ చదివించి పెళ్ళి చేశాడు. కూతురు, అల్లుడు ఇద్దరూ ఉద్యోగ రీత్యా హైదరాబాద్ లో ఉండే వారు. వారికిద్దరు కవల పిల్లలు. ఇద్దరూ అమ్మాయిలే. ఇద్దరూ ఒకే చోట ఉంటే కష్టమని పెద్దమ్మాయిని వారితో హైదరాబాద్లో ఉంచు కొన్నారు. చిన్న పాపను ఊర్లో వీరితో ఉంచుకొన్నారు.

వారిద్దరి చదువులు, పెళ్ళిళ్లు, జీవితాలు కూడ విచిత్రంగా జరిగాయి. పదవ తరగతి పూర్తయిన తరువాత చిన్న పాపను కూడా ఏలూరు నుండి హైదరాబాద్ తీసుకొని వెళ్ళడం, ఇద్దరిని ఒకే కాలేజీలో ఇంటర్, ఇంజనీరింగ్ చదివించడం జరిగింది. పిల్లల తండ్రి పనిచేసే సంస్థలోనే తన సహచరుడికి, ఇద్దరు అబ్బాయిలు. వారు కూడ కవలలే. వారిద్దరినీ పై చదువుల కోసం అమెరికా పంపించగా చదువు, ఉద్యోగం కొనసాగించారు. వారూ వీరూ కూడ మంచి మిత్రులవడంతో పెళ్ళిళ్ళు చేసి అమెరికా పంపేశారు.

అసలు కథ ఇక్కడి నుండే మొదలైంది. పెళ్ళైన తరువాత ఆడ పిల్లలిద్దరూ సంసారం చదువులూ కొనసాగించారు. చిన్నమ్మాయితో సమస్యలేదు. సజావుగ, చక్కగ చదువు, సంసారం, ఉద్యోగం జరిగి పోతున్నాయి. ఎటొచ్చీ పెద్దమ్మాయితోనే సమస్య. చదువు వరకు పరవాలేదు. ఉద్యోగం కూడ సంపాదించుకోగలిగింది. ఎటొచ్చీ సంసారం విషయంలోనే సర్దుబాటు చేసుకోలేక భర్త నుండి విడిపోయింది.

నాకు విచిత్రంగా అనిపించింది. మగపిల్లలిద్దరు, ఆడపిల్లలిద్దరు దాదాపుగ ఒకే వాతావరణంలో పుట్టి పెరిగారు. అయితే ఇంత తేడాగ ఎందుకున్నారు? అదే విషయం వాళ్ళమ్మాయిని అడిగాను. బాల్యం, అక్కడి పెంపకం, చదువులలో తేడా ఉంది. కనుక ఆ ప్రభావమే అయి ఉంటుందని ఆమె వివరించింది. పాప పదవ తరగతి వరకు మా వద్ద లేదు. తన తాతగారి వద్ద పెరిగింది. ఇంటరు, ఇంజనీరింగ్ చదివే రోజుల్లో ఎంత బిజీగ ఉన్నా కూడా చిన్నమ్మాయి తెలుగు పేపరు చదవడం మానదు. అందులోనూ మహిళలకు ప్రత్యేకించిన పేజీలని పూర్తిగ చదివేది. తన చిన్నప్పుడు నాన్న తన చేత చిన్న చిన్న కథల పుస్తకాలు, ఆదివారం పుస్తకాలలో వచ్చే చిన్న పిల్లల పేజీలు, పజిల్స్ లాంటివి చదివించే వాడు. వయసును బట్టి తగిన శీర్షికలు చదివించేవాడు. అందులో చదువుకు సంబంధించినవి, ఆరోగ్యానికి సంబంధించినవి, మానసిక శాస్త్రానికి సంబంధించినవి మొదలైనవి అన్నీ చదివించేవాడు. దాంతో నాకు నా జీవన విధానానికి సంబంధించి ఒక అవగాహన ఏర్పడింది. అందుకే కాబోలు ఇప్పటికి కూడ తనకు తన భర్తకు సంబంధించి ఎలాంటి పొరపొచ్చాలు లేవని, ఆరోగ్య సంబంధ సమస్యలు కూడ తలెత్తలేదని తెలియజేసింది.

ఇంతలో పెద్దాయన కలుగజేసుకొని చెప్పడం మొదలు పెట్టాడు. ఇంగ్లీషు, తెలుగు కంటె మూడు రెట్లు కష్టం. పదాన్ని ఎలా చదవాలి నేర్చుకోవాలి. దానికి అర్థం నేర్చుకోవాలి. పదం తెలిస్తే స్పెల్లింగ్ కూడ నేర్చుకోవాలి. ఎంత పండితుడైనా మాతృభాషను చదివేంత వేగంగా చదివి ఆకళింపు చేసుకొనేట్లు ఇంగ్లీషులో చేయలేడు. దాని ఫలితంగ పిల్లలు విషయానికంటే కూడ భాష నేర్చుకోవడానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చి, ఇతర పుస్తకాలు చదివే వ్యవధి ఉండక, ఆట పాటలు లేక, దీర్ఘ కాలంలో నాణ్యమైన ఆరోగ్యాన్ని పొందలేరు. తగినంత వ్యవహార జ్ఞానం కూడ పొందలేరు. ఎలాగూ ఇంగ్లీషు మీడియం చదువుతున్నందున ఇంటిలో తెలుగు మీద శ్రద్ధ వహించాడు. ఓసారి బడిలో తెలుగులో మాట్లాడినందుకు ఆమెను ఒక టీచర్ కొట్టింది. అప్పుడు తను వెళ్ళి హెడ్మాస్టరుతో మాట్లాడాడు. పిల్లలను ఇంగ్లీషులోనే మాట్లాడాలని వత్తిడి చేస్తే భావ ప్రకటన, వ్యక్తిత్వ వికాస లోపం జరుగుతాయి. గణితం లాంటి సబ్జెక్టులు అవగాహన లేక పిల్లలు వెనకబడి పోతారని వివరించడం జరిగింది. అప్పటి నుండి చూసిచూడనట్లుండేవారట.

ఇంతలో ఆమె కలుగజేసుకొని తన ఇద్దరి అమ్మాయిల ప్రవర్తనలో గల తేడాను గుర్తించి చెప్పడం మొదలు పెట్టింది. అమ్మకు పెద్ద పూజలు కాదు గాని రోజువారి పూజలు అల వాటు. ఆ పూజలు మన కోసం కాకపోయినా పిల్లలలో నడవడికకు, సత్ప్రవర్తనకు సహాయ పడుతుందని చెప్పేది.

పెద్దమ్మాయి పదవ తరగతి వరకు నగరంలోనే పేరెన్నికగన్న స్కూల్లో చదివిందని, తెలుగు మూడవ భాషగ ఉండడం, ఉద్యోగాల రీత్యా తాము అంతగా పట్టించుకోక పోవడంతో తెలుగు చదవడం, రాయడం అంతగా రాదని తెలియజేసింది. పిల్లలిద్దరి ప్రవర్తనలో కూడ స్పష్టమైన తేడాను గుర్తించగలిగింది. ఇంటరు, ఇంజనీరింగు స్థాయిలలో కూడ చిన్నమ్మాయి చదువే కాకుండా ఇతర అన్ని విషయాలలో ముందుండేది. ఇప్పుడు చేస్తున్న ఉద్యోగాలలో కూడ చిన్నమ్మాయి చక్కగ కలుపుగోలుగ విధి నిర్వహణ చేసుకోగలుగుతోంది. తన ఆఫీసులో పనిచేసే ఇతర దేశాల వారి భాషలను తేలికగ త్వరగ నేర్చుకోగలుగుతోంది. ఇన్నాళ్ళు తాను విశ్లేషించుకోలేదు. ఇప్పుడు నాన్న చెప్పిన విషయాలను బట్టి బహుశా మాతృభాషపైగల పట్టు చిన్నమ్మాయి జీవనగతికి, పురోగతికి అంతర్లీనంగా సహాయపడుతోందని భావిస్తోంది. ఇంతేగాకుండ పిల్లల జీవితాలను ఫణంగా పెట్టి చేసే ఉద్యోగం అనవసరమనిపిస్తోంది. భర్త సంపాదన సరిపోనప్పుడు మాత్రమే భార్య ఉద్యోగం చేయడం అవసరమని చెప్పింది.

**నిజమే, మనందరం ఎంత తప్పు చేస్తున్నాం! అమ్మభాష కాబట్టి నేర్చుకోండి అంటే ఎవరు నేర్చుకొంటారు?! అమ్మే అవసరం లేదనుకొంటున్న ఈ రోజుల్లో అమ్మ భాష ఎవరికి కావాలి? అందుకే మనందరం కూడ ఆ మాటే అనరాదు. మాతృభాష నేర్చుకొంటే కలిగే ప్రయోజనాలు తెలియజేయాలి. అందునా. ఎత్వం - ఏత్వం, ఒత్వం - ఓత్వం వంటి విషయాల వలన సంస్కృతం కంటే కూడా ఉచ్చారణ విషయం తెలుగు ఒక మెట్టు ఎక్కువనిపించింది నాకు. అందుకే 'మాతృభాష కళ్ళైతే, పరాయి భాష కళ్ళజోడులాంటిదని' అంటారు. నిజమే కళ్ళుంటూ ఉంటే కదా, కళ్ళజోడుతో పని జరిగేది!.**

ఎక్స్‌ప్రెస్ టికెట్ కొని పాసింజర్ రైల్లో ప్రయాణం చేసినందుకు ఇప్పుడు నాకే మాత్రం విచారం లేదు. నేను విన్న విషయం కోట్లాది మందికి తెలియజేయడం ముందు ఆ యాభై రూపాయల నష్టం ఒక లెక్క లేదు. ప్రయాణం ఎలా జరిగిందో కూడ తెలియలేదు. అంతగా మైమరచి విన్నాను. ఇంతలో ఏలూరు రానే వచ్చింది. వారి వద్ద సెలవు తీసుకొని గంపెడు ఆనందంతో ఇంటి దారి పట్టాను.



Unfiled Notes Page 26

# తెలుగు భాషా వికాసానికి పుష్కరకాలంగా కృషి



**ఆగష్టు 29 గిడుగు జయంతి – తెలుగు భాషా దినోత్సవం**
**ముఖ్యఅతిథులు – కోటపురుషోత్తం, సాకం నాగరాజ**
**వేదిక – శ్రీపద్మావతి మహిళా డిగ్రీ & పి.జి. కళాశాల, తిరుపతి**

తెలుగు భాష పరిరక్షణ ఆశయంతో 12 సం॥రాల క్రితం తిరుపతిలోని ఓ పదిమంది సభ్యులు చేరి ప్రారంభించిన సంస్థ తెలుగు భాషోద్యమ సమితి. నేటి వరకూ వందకు పైగా మహాకవుల జయంతి వర్ధంతి సభలు, పుస్తకావిష్కరణ సభలను నిర్వహించింది. ఇంకా తెలుగు భాషకోసం ఉద్యమ కార్యక్రమాల్లోనూ పాలు పంచుకుంటోంది. ముఖ్యంగా తెలుగుభాషకు ప్రాచీన హోదా సాధనకై తెలుగు భాషోద్యమ సమాఖ్యకు బాసటగా నిలిచింది. సంతకాల సేకరణ, పోస్టుకార్డు ఉద్యమం, నిరాహారదీక్షలు వంటి ఆందోళనా కార్యక్రమాలు చేపట్టింది. భాషాభివృద్ధికి ఉపకరించే జి.ఒ.ల అమలుకు ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తూ వచ్చింది. వివిధ కార్యక్రమాల కోసం తిరుపతికి విచ్చేసిన సాహితీవేత్తలు, భాషావేత్తలు కె. శివారెడ్డి, శిఖామణి, సింగమనేని, అట్టాడ, గంటేడ, వల్లూరి, పెనుగొండ, స.వెం. రమేష్, డా॥ సామల రమేష్‌బాబు వంటి వారితో సభలు, గోష్ఠులు జరుపుతూ తిరుపతిలో సాహిత్య పరిమళాల్ని నింపి మన్ననల్ని పొందింది.

అన్నిటికంటే సమితి ప్రధాన కార్యక్షేత్రం బడి పిల్లల్లో పుస్తక పఠనం. "తెలుగు భాషని పట్టించుకోవడం అంటే... మొదటిగా పిల్లల్ని పట్టించుకోవడం. పిల్లల్ని పట్టించుకోకుండా వారి దోవన వారిని విడిచి పెట్టామంటే భాషను కూడా విడిచి పెట్టేశామనే అర్థం. నీటి సమస్య ఎంత తీవ్రమైనదో మాతృభాషా సమస్య కూడా అంతే తీవ్రమైనది. నీటి వనరుల్ని కాపాడి భావితరాలకు ఎంత జాగ్రత్తగా అందించాలో తెలుగు భాషా వనరుల్ని కూడా అంతే భద్రంగా భావి తరాలకు అందించాలి" అనే ధ్యేయంతో సమితి పని చేస్తోంది. పిల్లలకు అర్థమయ్యే భాషల్లో, వాళ్లంతట వాళ్ళే ఇష్టంగా చదువుకునే రీతిలో సమితి సొంతంగా పదిహేను పుస్తకాలను ప్రచురించింది. తెలుగు పద్యమూ –మా నాన్న!', ఉగాది పచ్చడి, పర్యావరణ పంచాంగం, పూలూ– పళ్ళూ! విద్యార్థుల కోసం శ్రీశ్రీ, చిత్తూరు కథ, సామెతలు – కవితా రూపాలు మొ॥నవి. ఇంకా అనేకం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తూ తెలుగుభాష పట్ల మమకారం కలిగించడానికి కృషి సల్పుతోంది.

ప్రస్తుతం కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సందర్భంగా 'విద్యార్థులూ – విజ్ఞాన వీచికలూ!'...32 పేజీల పుస్తకాన్ని 11 వేల ప్రతులు ముద్రించి జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసి చదివించింది. అయిదు పిట్ట కథలూ, కొన్ని మినీ కవితలూ, సామెతలూ, కొందరు మేథోగత వ్యక్తుల ఆలోచనల్ని ఏర్చి కూర్చిన పుస్తకం ఇది. విద్యార్థుల పాలిట ఓ 'మిఠాయి పొట్లం' వంటి ఈ సంపుటి సమితి పుష్కరోత్సవం కానుక. ఈ పుస్తక ప్రచురణతోపాటు సమితి పుష్కరోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 25 నుంచీ అయిదు రోజులపాటు విద్యార్థులకోసం పద్యవైభవం, కవి సమ్మేళనం, సింగమనేని 'మున్నుడి' పుస్తక ఆవిష్కరణ, పుస్తక పఠనం కార్యక్రమాల్ని జరిపింది. ఆగస్టు 29న గిడుగు 155వ జయంతిని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాలల్లో పండుగ వాతావరణంలో జరిపి సాహిత్య స్ఫూర్తిని నింపింది.

సాకం నాగరాజు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. శతావధాని ఆముదాల మురళి, డా॥ నాదెండ్ల శ్రీమన్నారాయణలు గౌరవాధ్యక్షులు. గంగవరం శ్రీదేవి అధ్యక్షులుగా, డా॥ వి. కృష్ణవేణి ప్రధాన కార్యదర్శిగా సమితి తన ప్రయాణం సాగిస్తోంది. అందరినీ అభినందిద్దాం ఈ సందర్భంగా.

కవిత

## ఎవరో వారు

ఎవరో వారు
ఇంకా గుర్తున్నారు
నడిచి, నడిచి
ఎంతో దూరం వెళ్ళినా
వీపు వెనుకే
ఉన్నట్లున్నారు

ఎవరో వారు
కనురెప్పలపై కూడా
కనబడుతున్నారు
వేనవేల అనుభవాలు గడిచినా
మనసు పాదాల్ని పట్టుకు
లాగుతున్నారు

ఎవరో వారు
ప్రళయ ఘోష లోనే కాదు
నీరవ నిశ్శబ్దం లో కూడా
లొల్లాయి పాటలా
గుండె తడుతున్నారు
మరిచిపోని నినాదమై
శరీరాన్ని పిడికిలి చేస్తున్నారు

ఎవరో వారు
నేనెవరో నాకు చెబుతున్నారు
అమ్మ బువ్వ రుచో,
నాన్న చెమట తడో తెలియదు
ఆకాశం పై కాలు మోపినా
నేల వాసన నన్ను వీడదంటున్నారు

– 'కృష్ణుడు'

చిన్నకథ

# చదువు

వడలి వెంకటనాగవరలక్ష్మి
9440188890

"మా పిల్లలకస్సలు తెలుగు రాదు. అక్షరాలు కూడా రావు" అదేదో ఘనతలాగా చెప్పింది శ్యామలగారు.

"బడిలో నేర్పరా" అడిగాన్నేను.

"మా పిల్లలు హిందీ తీసుకున్నారు. మా పిల్లలకు హిందీ ఇష్టం కూడానూ"

"అదేంటి. మన తెలుగు నేర్చుకోకుండా ఎలా"

"ఎందుకు తెలుగు ? ఎందుకు పనికొస్తుంది? మా పిల్లలను ఎంత ఖర్చుపెట్టయినా మంచి చదువులు చదివిద్దామనుకుంటున్నాము. అమెరికానో, ఆస్ట్రేలియానో, ఢిల్లీ, ముంబయి యిలా ఎక్కడ సెటిల్ అవుతారో. అక్కడ తెలుగేమి చేసుకుంటాం. వేస్ట్. మేం వద్దనుకున్నాము. స్కూలు వాళ్ళూ వద్దన్నారు" తేల్చి చెప్పింది శ్యామలగారు.

నా మనసు చివుక్కుమన్నది. తెలుగు మంచి చదువు కాదా? తెలుగు చదువుకుని వీళ్లేమీ పాడవలేదే. చక్కని ఉద్యోగం సంపాదించారు, పెళ్ళి కాకముందే చవకలో స్థలం కొన్నారు, చిన్న వయసులోనే ఇల్లు కట్టారు శ్యామల పెనిమిటి. జాగ్రత్తగా, లోటు లేకుండా సంసారం నడుపుతూ గౌరవంగా బ్రతుకుతున్నారు. ఇవన్నీ వీళ్ళకెలా అబ్బాయి? భాష, సంస్కృతి నేర్పాయి. చినుకు చినుకు కలిస్తేనే ప్రవాహమవుతుందని తెలుసుకున్నారు. కనుకనే డబ్బు కూడబెట్ట గలిగారు, దీపముండగా ఇల్లు చక్కబెట్టుకుంటున్నారు. ఇది గుర్తెరగక తెలుగు పనికిరాదనటం ఏమిటి? నాణ్యమైన, ప్రశాంతమైన జీవితం గడపడానికి అవసరమైన అనుభవసారాన్ని చిన్నతనం నుంచే వింటూ వంటబట్టించుకున్నారు కనుకనే ఆనందంగా ఉన్నారు. కాని ఇప్పుడు తమ పిల్లలకు తమ అనుభవాలను పంచకుండా పరాయివేవో వారిమీద రుద్దుతూ తప్పు చేస్తున్నారనిపించింది. మన జీవితంలో అమ్మభాష ప్రాధాన్యాన్ని బోధపరిచే నా ప్రయత్నం విఫలమైంది . పన్నెండు ఏళ్లు గడిచిపోయాయి.

శ్యామలగారు బండిమీద నుంచి పడిపోయారంటే పలకరిద్దామని వెళ్ళాను. గేటు తాళం తీసి ఉంది. వెళ్ళి తలుపు కొట్టాను. ఆవిడ ఎవరని అడిగి, పెరటిలో బట్టలు ఆరవేస్తున్నానని, వస్తున్నానని బిగ్గరగా చెప్పారు. ఆవిడ వచ్చేలోపు మొక్కలను పరికిస్తున్నాను. మల్లె, సన్నజాజి, విరజాజి డాబా మీదకి ఎక్కాయి. ఇంటి ముందు మామిడి నీడనిస్తోంది. పెరటి వెంపు అరటి ఉండాలి, పక్క సందులో వారగా గులాబీ, కనకాంబరం, చామంతులు, కుండీల్లో మరువం, దవనం, వాకిట్లో గన్నేరు, మందారం ఇలా ఏటి పొడుగునా లోటు లేకుండా పూలు పూస్తాయి. మామిడి పక్కన నిమ్మ పిందె వేసింది, కాకర, బీర కాబోలు పైకి పాకించి ఉన్నాయి. ఇంతచక్కని ఇల్లు చాలా కొద్దిమందికే అమరుతుంది. తెలివైనవారో, అదృష్టవంతులో అనుకుంటూ ఉండగా శ్యామలగారు తలుపుతీశారు. కుంటుతూ నిదానంగా వచ్చినట్టున్నారు. లోపలికి వెళ్లి కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ ఉండగా భోజనానికి రానని వాళ్ళబ్బాయి ఫోన్చేశాడు. ఈవిడ కోప్పడినా వాళ్ళబ్బాయి లక్ష్యపెట్టలేదని వారి మాటల ద్వారా నాకర్థమయ్యింది. శ్యామలగారి నిరుత్సాహానికి కారణం కాలిదెబ్బ కాదని, కొడుకని అర్థమయ్యింది.

"మీ అబ్బాయికి కాలేజీ తీయలేదా, అడిగాన్నేను.

"కాలేజీ మానేశాడు"

"అదేమి"

"చదవనన్నాడు. చదువంటే ఇష్టం లేదన్నాడు. ఇంటరు దాకా ఎలాగో నెట్టుకొచ్చాము. ఎంసెట్లో ర్యాంకు రాలేదు, అయినా ఇంజనీరింగ్లో డొనేషన్కట్టి చేర్చాము. రెండు సంవత్సరాలకి ఒక్క పేపరు కూడా ప్యాసవలేదు. ట్యూషన్లు పెట్టించాము, వెళ్ళడు. గాలికి తిరుగుతున్నాడు. ఇంక చదవనన్నాడు. ఈ పేపర్లు అయితేగాని మూడవ సంవత్సరంలోకి వెళ్ళడు. చదవడు. అదే బెంగగా ఉంది".

"ఎందుకని చదవడు" అడిగాన్నేను.

"చిన్నప్పటి నుండి పుస్తకం తీసి చదివేవాడు కాదు. ఎంతసేపూ టి.వి. ఆ పాటలు, డాన్సులు, సీరియల్స్ అయినా చూస్తాడుగాని పుస్తకం తీసి చదవడు. మా అమ్మాయీ అంతే, ఆడపిల్ల కనుక పెళ్ళిచేసి పంపుతాము. మగ పిల్లాడు ఎలా? రాత్రి పగలు నిద్రలేదు, ఏం చెయ్యాలో తోచదు." ఇలాగే ఏవో చెప్పి వాపోయింది శ్యామలగారు.

నాకు తప్పు ఎక్కడ జరిగిందో అర్థమయ్యింది.

"మీరేమీ అనుకోకపోతే ఒక సలహా చెబుతాను"

"అయ్యో ఎందుకనుకుంటాను చెప్పండి"

"మీపిల్లలకు మొదటి నుంచి అక్షరాలు చదవడం అలవాటు అవలేదు. మీరు తెలుగు నేర్పించనందువల్ల, వాళ్లకి చేతిలో పుస్తకం పట్టుకుని చదవడం అలవాటు అవలేదు. బడిలో చదివిందే చదువు. ఇంటికి వచ్చాక పత్రికో, పేపరో ఇలా ఏదో ఒకటి చేతితో పట్టుకుని చదవడం, కొత్త విషయాలు తెలుసుకోవటం, ఆసక్తికరంగా వెతకటం ఇలాంటివి అలవాటు అవలేదు. అందుకని టివిలో ఏదో ఒకటి చూడటానికి అలవాటు పడిపోయారు"

"మీరన్నదీనిజమే. తెలుగుఅక్షరాలు కూడా రాకపోవడంతో ఎప్పుడూ పుస్తకం ముట్టుకుని ఎఱుగరు. హిందీ మాకు రాదని, బడిలోనే స్టడీ అవర్లో చదువుతున్నారు కదా అనుకున్నాము"

**"మీరు కేబుల్ కనెక్షన్ తీయించి, తెలుగు దినపత్రిక తెప్పించండి. వాళ్లు గత్యంతరంలేక మెల్లిగా తెలుగు చదవడానికి అలవాటు పడతారు. అలా అలా పుస్తకం చదవడం అలవాటైతే, మెల్లిగా వాళ్లే దారిలోకి వస్తారు. టివి పిచ్చి తగ్గుతుంది . మన భాషే మనకు దారి దీపం. పరాయి భాషలు భుక్తికోసం. ఇంగ్లీషు, హిందీ టీచర్లు, లెక్చరర్లు, ఇంట్లో ఇంగ్లీషు, హిందీలలో మాట్లాడుతున్నారా. మనమూ అంతే. మనకు తెలుగే వెలుగు".**

"తెలుగు ఎందుకు పనికొస్తుందనుకున్నాము. ఇలా పుస్తకానికి దూరమవుతారనుకోలేదు. మీరు చెప్పినట్టు చేసి చూస్తాము. కేబుల్ కనెక్షన్ ఎంతసేపు పీకి పారేస్తాను?! పిల్లల చదువు, భవిష్యత్తు కన్నా ఏదీ ముఖ్యం కాదు" అన్నది శ్యామలగారు.

ఆవిడ మాటలలోని ఆశ నమ్మదగినదిగానే అనిపించింది. కాసేపు పరామర్శలు అయ్యాక వెనుదిరిగాను.

మధురాంతకం నరేంద్ర
9866243659

# మనవాడే...గొప్పవాడు


కుం. వీరభద్రప్ప

వార్తా సౌకర్యాలు పెరిగి, రవాణా సాధనాలు మెరుగుపడి దూరాలన్నీ దగ్గరవడంతో ప్రపంచీకరణ ముంచుకు రావడమూ, ప్రపంచమే పెద్ద కుగ్రామంగా మారిపోవడమూ జరిగిపోయాయి. అందువల్ల సర్వ ప్రపంచమూ మనకవగతమైపోయిందని గూడా అనుకున్నాం. అయితే మన యిరుగు పొరుగు భాషల్లో జరుగుతున్న సాహిత్యకృషి యేమిటో గూడా మనకు తెలియదన్న సత్యం తెలుసుకున్నప్పుడు మన భ్రమలన్నీ పటాపంచలైపోతాయి. భాషలుగూడా పల్లమెరిగి పారే నీళ్ళలా, యిష్టమొచ్చిన రీతుల్లో వ్యాపిస్తాయని గ్రహించకుండా, భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి పూనుకున్నవాళ్ళం మనం. మనదని అనుకునే ప్రాంతంలోనే, పక్కనుంచీ చొచ్చుకొచ్చిన భాషా సాహిత్యాల పాయల్లో విశేషమైన కృషి చేసిన సృజనకారుల్ని తెలుసుకోలేకపోయే మన పరిమిత జ్ఞానాన్ని నిరూపించే అరుదైన, విశిష్టమైన రచయితల్లో కుం. వీరభద్రప్పగారొకరు. కుంవీగా ఆయన కన్నడ సాహిత్యంలో సుప్రసిద్ధులు.

కుంవీగారు పుట్టిన బళ్ళారి జిల్లా కర్ణాటక రాష్ట్రంలోకి చేరినప్పటికీ అక్కడ యిప్పటికీ తెలుగుభాష గుబాళిస్తూనే వుంది. ఆయన స్వగ్రామం కొత్తూరు ఆంధ్రరాష్ట్ర సరిహద్దుకు చాలా దగ్గర్లోనే వుంటుంది. కుంవీగారు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వుద్యోగమే చేశారు. తెలుగు – కన్నడ భాషలు రెండూ సహజీవనం చేస్తున్న ప్రాంతాల జీవితాన్ని తన మాతృభాష అయిన కన్నడంలో సాహిత్యీకరించారు. అనేక తెలుగు కథలూ, నవలలను కన్నడంలోకి అనువాదం చేశారు.

ఆక్స్‌ఫర్డ్ ప్రచురణ అయిన దక్షిణ భారతదేశపు కథానికల పుస్తకంలో కుంవీగారి కథను మొదటిసారిగా చదివాను 'A Sweet Dish' అనే చిన్న కథ అది. జీవిత పోరాటంలో వోడిపోయిన వొక గ్రామీణ కూలీ కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం కోసం విషం కలిపిన పరమాన్నం తినడం ఆ కథలోని వస్తువు. తెలుగు రచయితలు రైతుల ఆత్మహత్యల గురించి విరివిగా కథలు రాస్తున్న కాలానికి కాస్త ముందుగా వచ్చిన కథ అది. ఆ సమస్యను కుంవీగారు తన చిన్న కథలో ఆర్ద్రంగా, ఆలోచనాత్మకంగా, విభిన్నంగా చిత్రించిన తీరు నన్నెంతో ఆకట్టుకుంది. అప్పటి నుంచీ ఆయన కథలన్నీ చదవాలన్న కోరిక వెంటాడుతూనే వుంది. యిప్పుడు యిలా రంగనాథ రామచంద్రరావుగారి తెలుగు అనువాదం వల్ల ఆ కోరిక కొంతవరకూ తీరింది.

రచయితల్లో పుట్టు రచయితలనీ, పెట్టు రచయితలనీ రెండు రకాల వాళ్ళుంటారని విమర్శకులు పేర్కొంటారు. కథల్ని చెప్పడమన్నది సహజమైన విద్యగా పుట్టుకతోనే సంక్రమింపజేసుకున్నవాళ్ళు, పుట్టిన తర్వాత అభ్యాసంపైన కథల్ని చెప్పడం నేర్చుకున్నవాళ్ళు – అని ఆ మాటలకర్థం. కుంవీగారు మొదటిరకం కథకుడు. మన పల్లెలన్నింటిలోనూ తీరికగా కూర్చుని వినే గ్రామీణులకు యే విషయాన్నయినా ఆసక్తికరంగా, జనరంజకంగా కథలా చెప్పుకుపోయే కథగాళ్లు కొందరుంటారు. కుంవీగారీకోవకు చెందిన వ్యక్తి. తన ప్రాంతానికి చెందిన జాతీయాలూ, నుడికారాలతో ఆయన కథలన్నీ కర్ణాటాంధ్రప్రాంతపు మట్టి వాసనల్ని గుబాళిస్తాయి.

కథా రచయితలు చేయాల్సిన ముఖ్యమైన పని కథ చెప్పడమే! కానీ కేవలం కథ మాత్రమే అయిన కథలు గొప్పగా నిలవవు. అవి సమకాలీన సాంఘిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక జీవితానికి విమర్శలుగా, వ్యాఖ్యానాలుగా గూడా ఉండాలి. కథను మాత్రమే చెప్పుకుపోయే కుంవీగారి కథలన్నింటికీ అనుసంగికంగా యీ భిన్న పార్శ్వాలు సహజంగా అమరిపోతూ వాటికి గొప్ప సాహిత్య గౌరవాన్ని చేకూరుస్తాయి. ఆయన తొలినాటి కథల్లో నెమ్మదిగా, మంద్రంగా, సవివరంగా, సమగ్రంగా కథనంతా తీరికగా చెప్పుకుపోవడం కనిపిస్తుంది. తరువాతి కాలంలో సంక్షిప్తతకూ, శిల్ప పరిపుష్టతకూ ప్రాముఖ్యత నివ్వడమూ గమనించవచ్చు. మూడవదశలో ఆధునిక మాంత్రిక వాస్తవికతను అద్భుతమైన ప్రాంతీయతా ముద్రతో ఆవిష్కరించాడాయన.

కుంవీగారు సహజంగానే మార్క్సిస్టు రచయితగా రూపొందాడు. 1970 ప్రాంతాల్లో ఆత్యయిక పరిస్థితి (Emergency) విధించినప్పుడు యెలుగెత్తి వ్యతిరేకించినవాడాయన. 60–80 దశకాల్లో తెలుగు సాహిత్యాన్ని గొప్పగా ప్రభావితం చేసిన వామపక్ష భావజాలాన్ని సరిహద్దుల్లోంచీ అందిపుచ్చుకున్న రచయిత కుంవీ. అందువల్ల ఆనాటి తెలుగు కల్పనా సాహిత్యపు విడదీయరాని శాఖగా కుంవీగారి సాహిత్యమంతా విప్పారింది. ఆయన రాసిన చాలా కథలు సమకాలీన తెలంగాణాలోని ఫ్యూడల్ జీవితాల్ని గుర్తుకు తేవడమూ, 'కరివేముల' అనే నవలికలాంటి కథ దాశరథి రంగాచార్యగారి 'చిల్లరదేవుళ్లు' నవలను జ్ఞాపకం చేయడమూ యాదృచ్ఛికంగా జరిగిన పనిగాదు.

కుం.వీరభద్రప్పగారిప్పటికీ 'కొత్తూరు' అనే తన స్వంత గ్రామంలోనే నివసిస్తున్నారు. కన్నడంలో దాన్నే 'కొట్టూరు' అనిపిలుస్తారు. ఆంధ్ర రాష్ట్రాల్లో, ముఖ్యంగా కన్నడ ప్రాంతాలకు దగ్గరగా వుండే చిత్తూరు అనంతపురం జిల్లాల్లో కొత్తూరు అనే పేరుతో చాలా గ్రామాలున్నాయి. అసలు తిరుపతికి పాత రోజుల్లో కొత్తూరు అనే పేరు గూడా వుండేది. తిరుపతికి దగ్గర్లోని పుత్తూరుకు తమిళంలో పుదుపూరు అంటే కొత్త వూరనే అర్థం. కుంవీగారి కొత్తూరు తెలుగు రాష్ట్రాల్లోని కొత్తూరు లాంటిదే! ఆయన చాలా కథలకు ఆ వూరే నేపథ్యంగా వుంది. క్రోడు త్రిశూలం పట్టిన కథ" అనే కథలోని కొత్తూర్లో రెడ్డోళ్ల సందు, కోమట్ల సందు, బ్రాహ్మల సందు అనే వీధులే వున్నాయి. లింగాయతుల సందు అనే దొక్కటే కన్నడ ప్రాంతాలను గుర్తుకు తెస్తుంది. సరిహద్దు పట్టణమైన

ఆదోనిలో లింగాయతుల సందులున్నాయి. పైన పేర్కొన్న కథలోని వో చిన్న పాత్ర పేరు 'తెలుగోళ్ళ సంగడు'. సరిహద్దుల్లో రెండు భాషలు యెలా సహజీవనం చేస్తున్నాయో తెలుసుకోవాలంటే కుంవీలాంటి రచయితల రచనలే చదవాలి.

కుం.వీగారి మరో కథలో మారెమ్మ అనే గ్రామదేవత గుడివుంది. చిత్తూరు జిల్లాలో తమిళ ప్రాంతాలకు సరిహద్దుగా వుండే బొమ్మ సముద్రం అనే వూరికి చెందిన సి. వేణుగారు 'మారెమ్మ గుడి' అనే కథ రాశారు. లేదంటే వేణుగారి కథలో రెడ్లూ, హరిజనులూ పాత్రలైతే, కుంవీగారి కథలో గౌడలూ, హరిజనులూ పాత్రలు. కుంవీగారి పాత్రల పేర్లు – కివుడ, సణ్ణి, తివ్వి, డొణ్ణి, ఎలుగ చవుడ– వంటివి తెలుగు పాఠకులకు కొత్తగా, వింతగా కనిపిస్తాయి.

సరిహద్దు ప్రాంతంలో నివసిస్తున్నందువల్ల కుంవీగారు చాలా కథల్లో తెలుగు సాంఘిక జీవన గతుల్ని కన్నడ కథల్లోకి తీసుకెళ్ళగలిగారు. 'జరిమానా' అనే కథ దాదాపుగా తెలుగు ప్రాంతాల్లోనే జరుగుతుంది. అందులో నగ్జలైటుగా మారే అశోక్ అనేకుర్రాడి పూర్వీకులు వరంగల్ ప్రాంతం వాళ్ళు. ఓరుగల్లు ప్రతాపరుద్ర గజపతి ఆస్థానంలో రాజపురోహితులుగా వుండేవాళ్ళు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజా ప్రభుత్వం భూ సంస్కరణలు జేసి వాళ్ళ భూముల్ని కాజేసింది. ఆస్థులు పోయినా అశోక్ తండ్రిమాత్రం పాత సంప్రదాయాల్ని వదలలేదు. అశోక్ సోదరి వొకమ్మాయి కూచిపూడి నాట్యం అభ్యాసం చేస్తూ వుంటుంది. అశోక్ గుడివాడ కాలేజీలో చేరతాడు. చివరకు నగ్జలైటుగా మారి ఉద్యమంలో కెళ్ళిపోతాడు.

'రవిక' అనే కథను కుంవీగారు తూర్పున సిందువాడీ, పశ్చిమాన కుంతలవాడీల మధ్య జరిగినట్టుగా చెప్తారు. మనం ప్రాచీన గాథల్లో వినే కుంతలదేశం బళ్ళారి ప్రాంతానికుండే పాతపేరే! పశ్చిమ చాళుక్యులు యీ ప్రాంతాన్ని పాలించారట! ఆ ప్రాంతాన్ని ఆ రోజుల్లో నోలంబవాడి అని పిలిచేవారనీ, ఆ ప్రాంతంలో శివమొగ్గ, చిత్రదుర్గ, దావణగిరి మొదలైన కన్నడ రాష్ట్ర ప్రాంతాలే గాకుండా కొంతవరకూ అనంతపురం జిల్లా గూడా చేరి వుండేది.

'హత్య' అనే కథలో కనిపించే పాత్ర సంగాల వెంకటప్పనాయుడు తెలుగువాడే అయి వుంటాడు. 'సూతకం' కథల్లో పేర్కొన్న లింగంపల్లి, వెల్దుర్తి, ముత్తల చెరువు, రాయలపాడు మొదలైన వూళ్లు తెలుగు రాష్ట్రాల్లో వున్నవే! ఆ కథ జరిగే ప్రాంతం కర్నూలు జిల్లాలో యెక్కడైన జరగవచ్చు. రచయిత ఆ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ 'ముసునూరు వంశపు ప్రోలయనాయకుడు క్రీ.శ. 1325 – 29 మధ్య రాతి బండల కొండ మధ్య 'చిన్నబిల' అనే దేవాలయాన్ని ద్రావిడ శైలిలో కట్టించారు అని పేర్కొంటారు. ఆ కథలోని నాయుడు అనే ఫ్యూడల్ నాయకుడు శ్రీకృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్త మాల్యద' కావ్యంలోని గోదాదేవి వర్ణనను విశ్లేషిస్తాడు.

కుంవీగారికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును తెచ్చిపెట్టిన 'అరమనె' (రాజమహల్) అనే నవల 1800 –1825 ప్రాంతంలో బళ్ళారి, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలను 'సీడెడ్' అనే పేరుతో బ్రిటీషు గవర్మెంటు ప్రతినిధిగా పనిచేసిన తామస్ మన్రో కాలపు సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను చిత్రిస్తుంది. ఆయన రాసిన 'గాంధీక్లాసు' అనే ఆత్మకథను చదివితే బళ్ళారి ప్రాంతపు జీవితమంతా అర్థమవుతుంది.

యేదో వొకరకంగా తెలుగు సీమకూ, తెలుగువాళ్లకు ఆత్మీయమైన పన్నెండు కథలను యీ సంపుటానికి యెన్నుకున్నారు. మన రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామీణ జీవితపు స్థితిగతులను తెలుసుకోవడానికీ కథలు చక్కగా వుపయోగపడతాయి. కుంవీగారు గ్రామీణ రైతుల జీవితాలనూ, వ్యవసాయానుసంగిక కులాలైన కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి వంటి వృత్తి పనివాళ్ల యాతనలనూ, పల్లెల్లో యింకా అస్పృశ్యులుగానే వేదనలకు గురవుతున్న మాల మాదిగల వ్యథలను కథలుగా రాశారు. సాదాసీదా జీవితాలను గురించి రాస్తూనే పీడనల వల్ల తిరుగుబాటు తప్పదని యీ కథలన్నిటిలోనూ రచయిత నిర్ద్వందంగా తేలుస్తారు. ప్రతి కథా మనకు తెలియని చీకటి జీవితాన్ని పరిచయం చేస్తుంది. గ్రామీణ సీమల్లో దళితులు, కూలీలు, బడుగు జీవులు యెంత దుర్భరమైన, అమానవీయమైన దోపిడికి గురవుతున్నారో నిరూపిస్తుంది. కథకు అవసరమైన రీతిలో వ్యంగాన్నీ, హాస్యాన్నీ, ధ్వనినీ వాడుకోవడంలో కుంవీగారి నైపుణ్యం స్పష్టంగా వెల్లడవుతుంది.

బళ్ళారి జిల్లా కన్నడ మాండలికంలో రచనలు చేసే కుంవీగారి రచనా శైలిని కన్నడ విమర్శకులందరూ విశిష్టమైనదిగా గుర్తిస్తారు. మరింత లోతుగా పరిశోధన చేసినవాళ్ళు కుంవీగారు బళ్ళారి కన్నడ మాండలికానికి తనదైన వైయక్తికమైన ప్రత్యేకమైన నగిషీలు చెక్కారని అభివర్ణిస్తారు. ఆయనను వాళ్లు "మన మధ్యే వొక అపురూపమైన కథకుడు" అని సంభావిస్తారు. కువెంపు, శివరామకారంత్, యు.ఆర్. అనంతమూర్తి, పూర్ణచంద్ర తేజస్వి, దేవనూరి మహదేవ, భైరప్పవంటి గొప్ప సాహిత్యకారుల సరసన ఆయనకూ ప్రత్యేకమైన స్థానముందని పేర్కొంటారు.

కుంవీగారి సాహిత్య కృషి విశిష్టమైనది మాత్రమేగాదు, పెద్దది గూడా! ఆయన దాదాపుగా 200 కథలూ, 20 నవలలూ, 5 జీవిత చరిత్రలూ, వొక ఆత్మకథా, రెండు కవితా సంపుటాలూ వెలయించారు. అనేక అనువాదాలు చేశారు. ఆయన కథలూ, నవలలూ ఆధారంగా ఆరేడు సినిమాలు కూడా వచ్చాయి. కొన్ని సినిమాలకు జాతీయ అవార్డులు వచ్చాయి. ఆయన అనేక గొప్ప పురస్కారాలూ, గౌరవ డాక్టరేట్లూ అందుకున్నారు. యెంత సాధించినా, వినయంగా, నిత్య విద్యార్థిలా వుండగలిగే గొప్ప సంస్కారం వున్న అరుదైన రచయిత ఆయన.

కుంవీగారికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును తెచ్చిపెట్టిన 'అరమనె' (రాజభవనం) నవల మన్రో కాలపు బళ్ళారి ప్రాంత జీవితాల్ని మాంత్రిక వాస్తవికత ధోరణిలో చిత్రిస్తుంది. ఆయన తన రచనల్లో కృష్ణదేవరాయలు, అల్లసాని పెద్దన, తిక్కన వంటి తెలుగు మహాకవులనూ, వాళ్ళ రచనలనూ పేర్కొంటూ వుంటారు. కర్ణాటాంధ్ర విలక్షణ భూమికను సాహిత్య ప్రపంచంలో ఆయన ఆవిష్కరిస్తారు. యీ ప్రాంతాన్నే వొకప్పుడు 'మొరసునాడు' అనే వాళ్ళు. సాహిత్యానికి భాష కేవలమొక మాధ్యమం మాత్రమే! కుంవీగారు కన్నడ భాషలో మనదైన జీవితాన్నే చిత్రించారు. మన ప్రఖ్యాత కవి బాలగంగాధర తిలక్‌ను అనుసరిస్తూ "కుంవీ మనవాడే, గొప్పవాడు' అని మనం మన భుజాల్ని చరుచుకోవచ్చు.

రంగనాధ రామచంద్రరావుగారి తెలుగు అనువాదం సరళంగా సాగింది. మూల విధేయంగా వుంటూ రచయిత శైలిని తెలుగు వాళ్ళకు అందించడానికి రామచంద్రరావుగారు చేసిన కృషి అభినందనీయమైంది.

*(త్వరలో విడుదలకానున్న కుం.వీరభద్రప్పగారి కన్నడ కథల తెలుగు అనువాద పుస్తకానికి రాసిన ముందుమాట ఆధారంగా)*



Unfiled Notes Page 30

ధారావాహిక

# మౌనంలోని మాటలు

(12)

**సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ**


కన్నడ మూలం:
**డా. ఆర్.వి.బి.కుమార్**

తెలుగు అనువాదం :
**రంగనాథ రామచంద్రరావు**
9059779289




**తాగుడు కథ :**

నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు బళ్ళారి కొండ మీద ఒకసారి సారాయి తాగానని ముందే చెప్పాను కదా ! అటుతరువాత తాగలేదు. కడుపు నిండితే చాలైంది. ఇక తాగడం ఎక్కడ? నేను పెళ్ళి చేసుకున్న తరువాత ఒకసారి మా మామ, అత్త, భార్య ఇంటికి వెళ్ళినపుడు ఒక బాటిల్ బీరు తెచ్చి తాగమని చెప్పారు. నాకు తాగుడు అలవాటు లేదని చెప్పాను. అయినా ఒత్తిడి పెట్టి ఒక లోటా తాగించారు. ఆ రోజు తాగింది ఆ రోజే మరిచిపోయాను.

అయితే మా వాళ్ళు కులపంచాయితీలు జరిపేటప్పుడు అందరికీ తాగడానికి తెప్పిస్తారు. అయినా నేను తాగేవాడిని కాను.

తాగడం ఎక్కువ చేయడం ఈ సంఘం వల్లనే !

సంఘం పనులమీద నేను ఇతర ఊళ్ళకు వెళ్ళినపుడు మా వాళ్ళు తాగడానికి తెప్పించేవాళ్ళు. తాగనని చెబితే వాళ్ళు ఊరుకునేవాళ్ళు కాదు. ఒత్తిడి పెట్టి తాగించేవారు. ఇలాగే కొద్దికొద్దిగా తాగుతూ తాగుతూ ఒక తాగుబోతుగా మారిపోయాను.

ఇలా తాగుతున్నందుకు కుమార్‌సార్ తిట్టేవారు. నువ్వు తాగడం మానెయ్యమనేవారు. నేను తాగనని మాట ఇచ్చాను. అయితే తాగుడు నుంచి దూరం కావడానికి సాధ్యం కాలేదు. ఒకసారి తాగి ఆయన దగ్గరికి వెళ్ళి తాగలేదని చెప్పాను. "అన్నా, తాగవద్దని చెప్పినా ఎందుకు తాగావు? తాగుడు మానకపోతే ఎప్పుడైనా ఒకసారి మితంగా తాగు" అన్నారు.

అయితే మేము సంచారులం ! తాగుడుకు దూరంగా ఉండటం ఎలాగా అని చింతించేవాడిని.

ఆ మధ్యన ఒక సంఘటన జరిగింది. మా తమ్ముడు మాకు కానటువంటి వారి పంచాయితీకి వెళ్ళి తన భాగం సొమ్ము ఇప్పించుకుని వచ్చాడు. పోతేపోనీలే అని ఊరుకున్నాను. అతను తాగి వచ్చి, నువ్వు కూడా నీ భాగం ఇప్పించుకునివుంటే బాగుండేదని వాదించాడు. అందుకు తమ్ముడిని బెదిరించి రెండు దెబ్బలు చేసి పంపాను. ఇది జరిగిన మరుసటి రోజు మా వీధి వ్యక్తి ఒకడు తాగి వచ్చి పోట్లాటకు నిలబడ్డాడు. కసిరి వెనక్కు తోశాను. వాడు అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు దెబ్బ తగిలి రక్తం కారసాగింది. అతను చచ్చిపోతున్నట్టు నటించసాగాడు. ఇంట్లో నా భార్యలు తిట్టసాగారు. తాగుడు వల్ల ఇదంతా జరిగిందని గొడవపడసాగారు. వాళ్ళను తాగుడు మానండని చెప్పడానికి నాకు ధైర్యం, చాల్లేదు. ఎందుకంటే నేనే తాగుతాను. అలాంటప్పుడు తాగుడు మానండని నేను ఎలా చెప్పగలను?

ఇక మీదట తాగుడు మానాలని నిర్ణయించుకున్నాను. అది ఎంతవరకు సాధ్యమో చూద్దాం.

**అర్థంకాని వాళ్ళు :**

చదువుకుని పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తూ గొప్పవాళ్ళుగా చలామణి అయ్యేవాళ్ళు ఎందుకు ఇలా అల్పంగా ప్రవర్తిస్తారో నాకు ఇప్పటికీ అర్థం కాదు. వాళ్ళల్లో చదువుకున్నామనే అహం కారం పెరిగిపోయిందేమోని అనిపిస్తోంది.

ఇలాంటిదే ఒక సంఘటన చెబుతాను.

మమ్మల్నంతా కూడగట్టుకుని మైత్రిగారు రాష్ట్రస్థాయిలో సంచార – అరసంచార, విముక్త బుడకట్టుల రాష్ట్ర సంఘాన్ని స్థాపించారు. ఆయన ఉద్యోగంలో ఉండటం వల్ల సంఘానికి అధ్యక్షులుగా ఉండటం సాధ్యం కాదట. అందువల్ల భాస్కరదాసుగారిని రాష్ట్రసంఘానికి అధ్యక్షులుగా నియమించారు. బాలగురుమూర్తి కార్యదర్శిగా నియమింపబడ్డారు. మైత్రిగారు గౌరవాధ్యక్షులయ్యారు. మిగిలిన మమ్మల్నం దరిని నిర్దేశకులో సభ్యులో ఏదో చేశారు. బాల గురుమూర్తి, మైత్రిగార్ల మనస్పర్ధల వల్ల సంఘంలో గొడవ మొదలైంది. చివరికి బాల గురుమూర్తిగారు సంఘం నుంచి దూరమ య్యారు.

ఇలా దూరమైన తరువాత బాలగురు మూర్తి కొందరిని కలుపుకుని తమ సొంత సంఘాన్ని స్థాపించారు. తమ సంఘంలోనికి నన్ను రమ్మని పిలిచారు. ఏవేవో చెప్పి నన్ను ఒప్పించటానికి ప్రయత్నించారు. అయితే నేను మొదటి సంఘాన్ని వదిలి వెళ్ళటానికి ఇష్ట పడలేదు. దాంతో బాలగురుమూర్తి నన్ను తమ సంఘానికి రమ్మని పిలవడం మానేశారు. అయితే రాయచూరులో ఉన్న మా కుర్రవాడు శ్రీని వాసును తమ సంఘంలో పిల్చుకోవడానికి ప్రయత్నించారని నాకు ఆ కుర్రవాడే చెప్పాడు.

"అన్నా, నీ గురించి బాలగురుమూర్తి ఇలా ఇలా చెప్పారు. తమ సంఘంలోకి రమ్మని పిలిచారు" అని తెలిపాడు.

"నీ ఇష్టం, నువ్వు చదువుకున్న పిల్లోడివి. నీకు ఏది సరి అనిపిస్తే అదే చెయ్యి" అని

చెప్పాను.

ఆ కుర్రవాడు నన్ను దూరం చేసుకోవడానికి ఇష్టపడలేదు. అది ఆ కుర్రవాడికి సంబంధించిన విషయం. అయితే ఈ సంఘాన్ని రెండు ముక్కలు చేసినందువల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అనే చిన్న ఆలోచన ఈ చదువుకున్నవాళ్ళకి లేదు కదా అని నాకుచాలా బాధ కలిగింది.

మరొక విషయం- చదువుకోకపోయినా గురువయ్యానని చెప్పాను కదా! దానికి కారణం కె. రాము అనే స్నేహితుడు. అతడు అదేదో జానపద అకాడెమీ సభ్యుడట. ఒక సంచార జాతి కుర్రవాడు ఉన్నతస్థాయికి వెళ్ళాడని మేమంతా సంతోషపడ్డాం. అయితే 'గురుశిష్య పరంపర యోజన' నాకు దొరకకపోయినా, తన దగ్గర ఆదేశపత్రం ఉందని ఆబద్ధం చెప్పి కార్యక్రమం ప్రారంభించేశాడు. అతని మాటలు నమ్మి నేను కరపత్రాలు వేయించాను. బ్యానర్లు రాయించాను. దానికి అతను కేవలం రెండు వేలు ఇచ్చాడు. మైత్రిగారు కార్యక్రమం ప్రారంభించారు. మాధవరావు, మా ఊరి పెద్దమనుషులంతా ఆ కార్యక్రమానికి వచ్చారు. కార్యక్రమం గురించి పత్రికల్లో వచ్చింది.

ఇదంతా బాగుంది.

అయితే నిజానికి నా పేరిట ఎలాంటి కార్యక్రమం మంజూరే కాలేదని తెలిసింది.

నా గుండెలో రాయి పడింది.

మంజూరు కాకపోయినా, ఆ విషయం తనకు తెలిసినా, అబద్ధం చెప్పి కార్యక్రమం నడపడానికి రాము నన్ను ఎందుకు ప్రేరేపించాడు? అది ఈ రోజుకూ నాకు అర్థం కాలేదు. చదువులేని నేను అతని మాటలు నమ్మి కార్యక్రమం జరిపించాను.

నన్ను నమ్మి వచ్చిన 15 మంది కుర్రవాళ్ళకు సిందోళ్ళ నృత్యంలో తర్ఫీదు ఇచ్చాం.

ఇప్పుడు వాళ్ళకు మొత్తం నలభై అయిదువేల రూపాయలు నేనెక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలి?

కె. రాములాంటి సంచారి మరొక అమాయక సంచారిని ఎందుకు మోసం చేశాడు?

నాకు ఇది ఇప్పటికీ అర్థం కాలేదు !



**ఉరుమ తెచ్చిన కథ :**

నాకు చాలా రోజుల నుంచి పెద్ద ఉరుమ తీసుకుని రావాలని ఆశ ఉండేది. శికారి రాము, అశ్వ రామణ్ణగారు స్థాపించినట్టు నేనూ ఒక కళాబృందాన్ని స్థాపిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన ఉండేది. ఒకసారి మొళకాల్మురు దగ్గర హోసగల్లు అనే ఊరు ఉంది కదా! దాని దగ్గర పల్లెలో సారె దుర్గమ్మ దేవత కొలువైవుంది. ఆ సారె దుర్గమ్మ జాతరకు వెళ్ళే అవకాశం వచ్చింది. ఆ జాతరకు వెళ్ళినపుడు అక్కడ ఉరుమ వాయించేవారిని చూశాను. ఇలాంటి ఉరుమ మా జిల్లాలో సందూరు, కూడ్లిగిలలో దొరుకుతాయి. అక్కడ వాటిని వాయించేవాళ్ళు ఉన్నారు. అయితే ఆ తాలూకాలో గతంలో బిచ్చాటనకు వెళ్ళటమే తప్ప మరొక విధంగా అక్కడి జనంతో నాకు సంబంధాలు లేవు.

మాకు బళ్ళారి, హొసపేట, కురుగోడు, హగరిబొమ్మనహళ్ళి, సింధనూరు, గంగావతి, కొప్పళ వైపు సంబంధాలు ఎక్కువగా ఉన్నాయి. ఇవి కాకుండా ఆదోని, ఎమ్మిగనూరు, అనంతపురం, ఆలూరు, కర్నూలు వైపు కూడా సంబంధాలు ఉన్నాయి. వాటికి అవతల వేరే జిల్లాలను, తాలూకాలను మా సిందోళ్ళ సముదాయపు రాష్ట్రసంఘం ఏర్పడిన తరువాతే నేను చూడటం జరిగింది.

ఒకసారి నేను సారె దుర్గమ్మ జాతరకు పోయాను. అక్కడ ఉరుమ వాయించడం చూశాను. నాకూ అలాంటి ఉరుమ చేయించుకోవాలని అనిపించింది. అయితే వాటిని ఎక్కడ తయారు చేస్తారో నాకు తెలియదు. అందువల్ల అక్కడ ఉరుమ వాయించడానికి వచ్చిన మ్యాసనాయక మల్లప్ప అనే వ్యక్తిని పరిచయం చేసుకున్నాను. ఉరుమను ఎక్కడ చేయించారని, ఎంత ఖర్చు అవుతుందని అడిగాను. అతడు రాయదుర్గంలో ఉరుమ వాయిద్యాలు చేస్తారనే విషయం చెప్పి వారి అడ్రసు కూడా ఇచ్చాడు. ఆ మ్యాసనాయక మల్లప్పను నేను ఎప్పటికీ మరచిపోను.

నా మనస్సు ఆగలేదు. రాయదుర్గానికి ప్రయాణమయ్యాను. అక్కడ ఉరుమ చేసేవాళ్ళ అంగడి వెతుక్కుంటూ వెళ్ళి వాళ్ళను కలిశాను. నేను వచ్చిన పని చెప్పి ఉరుమ చేసివ్వమని అడిగాను. ఇత్తడి తొడుగు ఉరుమ చేయడానికి ఇరవైవేల రూపాయలు అవుతాయన్నారు. నేను బేరం ఆడలేదు. మరో పదిహేను రోజుల్లో రెండు ఉరుమలు చేసివ్వమని చెప్పి అయిదువేల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి వచ్చాను. ఉరుమ చేసిన తరువాత వాళ్ళకు చెల్లించడానికి మిగతా ముప్ఫయి అయిదు వేల రూపాయలు నా దగ్గర లేవు. ఆ సొమ్ము సమకూర్చుకోవడానికి నాకు తల ప్రాణం తోకకు వచ్చింది.

చివరికి ఒకటి రెండు నెలల తరువాత వెళ్ళి రెండు ఉరుమలు తెచ్చుకున్నాను. నా అల్లుడు యల్లప్పకు, కొందరు యువకులకు వాటిని వాయించడం నేర్పాను. అయితే మా దగ్గర ఉరుమలు ఉన్న విషయం ఎవరికీ తెలియదు. దాంతో మాకు తెలిసినవారందరికి ఉరుమ తెచ్చిన విషయం చెప్పాను.

అదే సమయానికి ముద్దాపురం వారు ఊరమ్మ జాతర చేయడానికి పూనుకున్నారు.



Unfiled Notes Page 32

కుమార్‌సార్ తమ ఫ్రెండ్ వెంకటస్వామి అనే ఆయనకు నన్ను పరిచయం చేశారు.

ముందుగా ఉరుమ వాయించడానికి ముద్దాపురానికి వెళ్ళాం.

ఈ సంఘటన తరువాత ఇతర ఊళ్ళ వాళ్ళు కూడా మమ్మల్ని ఉరుమ వాయించడానికి పిలువసాగారు.

అప్పటి నుంచి ఉరుమ వాయించడానికి వెళుతుంటాం !

**పోట్లాట కథ :**

ఈ మధ్యన ఒకసారి మా వాళ్ళకూ చలువాది జనానికీ పోట్లాట జరిగింది.

ఆ రోజు నేను ఏదో పనిమీద రామ సాగరానికి వచ్చి మసకలోనే తిరిగి ఇంటికి వెళ్ళాను. నేను ఇంటికి వెళ్ళేంతలో గొడవంతా ముగిసి చల్లబడింది. నేను ఇంటికి పోయి చూశాను. వీధిలో ఎవరూ లేరు. మొత్తం వీధి ప్రేతకళతో ఉంది. ఎందుకు, ఏమైందని అడిగాను.

"నువ్వు బాగా తప్పించుకుండావులే, నువ్వు ఉండింటే నీకు గూసాలు (పిడిగుద్దులు) పడేవి" అని నా భార్య అంది.

ఇది అనవసరమైన పోట్లాట కథ.

ఒక చలువాది కుర్రవాడు తాగి వచ్చి ఎవరో ఆడపిల్లతో గొడవపడుతున్నాడట. అదే దారిలో మా వీధి కుర్రవాడు వెళుతున్నాడు. ఆ కుర్రవాడు పోట్లాడుతూ పోట్లాడుతూ ఆ ఆడపిల్లను కొట్టడానికి ఆ పిల్ల మీదిమీదికి పోయాడట. ఈ గొడవ చూస్తూ నిలబడ్డ మా కులపు కుర్రవాడు 'ఎందుకట్లా ఆమె మీదికి పోతావు. ఊరికే మాట్లాడు' అని చెప్పాడట. తాగిన మత్తులో ఉన్న ఆ చలువాది కుర్రవాడికి మా కుర్రవాడి మీద కోపం వచ్చింది. 'నేను నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను. ఏమైనా చేస్తాను. నీకెందుకు? నీ దారిన నువ్వు పో' అని అన్నాడట. అప్పుడు మా కుర్రవాడికి కోపం వచ్చి 'ఆడపిల్లల మీద చేయి చేసుకోవడం సరికాదని చెబితే ఏమేమో మాట్లాడుతున్నావే?' అని అన్నాడట.

దానికి ఆ చలువాది కుర్రవాడు మా కుర్రవాడి మీదికి వచ్చాడట.

వీడు ఒక్క దెబ్బ వేశాడు.

దానికి ఆ చలువాది కుర్రవాడు "మా ఇండ్లలో అడుక్కుని తినే మీకు ఇంత కొవ్వా? మీ పని చెప్తానుండు" అని చెప్పి వెళ్ళిపోయాడట.

మా కుర్రవాడు తన పాటికి తాను బజారుకు వెళ్ళిపోయాడట.

ఆ చలువాది కుర్రవాడు తమ వీధిలో వెళ్ళి ఏం చెప్పాడో, ఏం కథో, ఆ కులం మగ వాళ్ళంతా గుంపులు గుంపులుగా కర్రలు పట్టుకుని మా వీధికి వచ్చారట. కొట్టిన కుర్రవాడు ఇంకా బజారు నుంచి ఇంటికి తిరిగి రాలేదట. ఆ కుర్రవాడిని వదిలివేసి వీధిలో కనిపించిన మగవాళ్ళందరిని కొట్టారట. ఇది చూసి మా ఆడవాళ్ళంతా ఏడుస్తూ దిక్కుకొకరు పరుగెత్తుకు పోయారట. ఈ గొడవ ముగిసిన తరువాత మా వీధిలోని కొందరు తామూ కర్రలు, గొడ్డళ్ళు తీసుకుని 'యెవరు వస్తారో రానీ మేమూ ఒక చెయ్యి సూసుకుంటాం' అని నిలబడ్డారట. ఇదంతా జరిగిన తరువాత మా ఊళ్ళో కొందరు పోలీస్ స్టేషన్‌కు పోయి జరిగిన విషయమంతా చెప్పారు. పోలీసులు మా ఫిర్యాదు తీసుకున్నారట. ఎవరెవరు వచ్చి కొట్టారో చెప్పమన్నప్పుడు పాపం, మా వాళ్ళకు ఆ జనం పేర్లు తెలియాలి కదా ! పేర్లు తెలియవు సార్, కావలిస్తే వాళ్ళను చూపిస్తాం' అన్నారట. 'సరే, రేపు రండి' అని చెప్పి పోలీసులు మా వాళ్ళను ఇంటికి పంపించారు.

నేను ఇంటికి వెళ్ళేలోపు ఈ సంఘటనలంతా జరిగాయి. మరుసటి రోజు పోలీసులు నన్ను పిలిచారు. 'మీ కుర్రవాళ్ళను పిలువు, ఎవరెవరు వాళ్ళను కొట్టారో చూపించమని చెప్పు' అన్నారు. ఈ విషయంగా శికారి రాము, సణ్ణహులుగప్ప కూడా వచ్చారు. అప్పటికే చలువాది కుర్రవాళ్ళు పోలీస్ కంప్లయింట్‌కు బెదిరిపోయారు. వాళ్ళు శికారి రాము దగ్గరికి వెళ్ళి రాజీ చెయ్యిమని వేడుకున్నారు. వాళ్ళూ కింది జాతివాళ్ళే. మేము వాళ్ళకన్నా కింది జాతివాళ్ళం. మనం మనం గొడవపడితే పై వాళ్ళు దాన్ని లాభం తీసుకోవటమే ఎక్కువ. అంతేకాకుండా మా పిల్లలందరూ వాళ్ళ ఇండ్లకు బిచ్చాటనకు వెళతారు. దీన్ని ఒక పెద్ద రగడ చేయకూడదని పోలీస్ స్టేషన్‌లో రాజీ చేసుకుని బయటికి వచ్చాం.

ఈ రోజు ఆ గొడవను వాళ్ళు మరిచారు.

చిన్న విషయానికి ఊరికి ఊరు నిప్పు అంటుకుని తగలబడటం తప్పింది !

**గుర్తుకొచ్చిన కాయకం :**

నేను సామాన్యంగా భార్యల మీద చేయి చేసుకున్నది చాలా అరుదు.

అయితే మొన్న నా చిన్నభార్య మీద చేయి చేసుకున్నాను.

దీనికి కారణం ఇది:

నా భార్య మళ్ళీ ఇంట్లోని ఉరుమ తీసుకుని బిచ్చాటనకు ఊర్లో పోయింది. నేను బిచ్చమడగటం మానేసిన తరువాత మా ఇంటి వాళ్ళెవరిని బిచ్చాటనకు పంపడం లేదు. పెద్దభార్య తనేమో తన పనేమో అన్నట్టు ఇంట్లోనే ఉండేది. నాతోపాటు ఆమె కూడా బిచ్చాటన మానేసింది. అయితే నా చిన్నభార్య మాత్రం తన అక్క మాట వినకుండా అప్పుడప్పుడు బిచ్చాటనకు పోతూవుంది. ఆ విషయం తెలిస్తే నేను ఎక్కడ కొడతానోనని నా పెద్దభార్య నా ముందు నోరు విప్పలేదు. అయితే ఒకసారి ఆ విషయం బయటిపడింది. నేను ఇద్దరినీ తిట్టి ఊరకయ్యాను.

నా జాతిజనం పుట్టినప్పటి నుంచే బిచ్చాటన చేసుకుంటూ బతుకుసాగించారు. అలాంటి వాళ్ళకు హఠాత్తుగా తమ కాయకాన్ని మానేయటం కాస్త కష్టమే. మేము చిన్నగా ఉన్నప్పుడు ఒక కథ వినేవాళ్ళం.

ఒకానొక కాలంలో మా జాతివాళ్ళు ఒక చోట గుడారం వేసుకుని ఉన్నారట. వాళ్ళలో ఒక అమ్మాయి చాలా అందంగా ఉండేదట. ఆమె ఒక రోజు అంతఃపురం ముందు బిచ్చానికి వెళ్ళిందట. ఆమెను చూసి రాజు మరులు గొన్నాడట. చివరికి ఆమె తల్లితండ్రులను ఒప్పించి ఆ అమ్మాయిని రాజు పెళ్ళి చేసుకున్నాడట. ఆమె కోసం ఒక పెద్ద అంతఃపురం కట్టించి ఇచ్చాడట. ఆ అమ్మాయి రాజ వైభవాన్ని అనుభవించసాగిందట. రోజూ బిచ్చాటన చేసి తింటున్న అమ్మాయి ఇప్పుడు అంతఃపురంలో మృష్టాన్నభోజనం చేస్తోందట. అయితే ఆమె అందరితో కలిసి కూర్చుని తినేది కాదట. తను తరువాత తింటానని చెప్పేదట. అందరూ తినిపోయిన తరువాత తన భాగం భోజనాన్ని అంతఃపురంలోని సందూకంలో కొంచెం కొంచెం పెట్టి తరువాత, 'అమ్మా తల్లీ, అన్నం పెట్టండమ్మా' అని అడిగి సందూకంలోంచి తీసుకుని తినేదట. అలా తినకపోతే ఆమెకు సహించేది కాదట.

ఒక రోజు రాజుకు ఈ విషయం తెలి



Unfiled Notes Page 33

సిందట. 'గతమంతా మరిచి సుఖంగా ఉండమంటే, ఎందుకు ఇలా చేస్తున్నావు?' అని అడిగాడట. తాను ఇలా తింటేనే కడుపు నిండుతుందని అన్నదట. ఆమె చేత ఆ అలవాటును మాన్పించటానికి రాజు అనేక ప్రయత్నాలు చేసి చివరికి మాన్పించాడట.

ఈ కథను నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు విన్నాను.

ఆ రోజు రాజు ఎదుర్కొన్న అగ్నిపరీక్ష ఇప్పుడు నాకు వచ్చింది.

ఒక రోజు మా ఊళ్ళో దసరా పండుగ. అందరి ఇళ్ళల్లో చేసినట్టు మా ఇంట్లోను తీపు వంటకం చేశారు. అయితే నేను సాయంత్రం లేకుండా ఉండటం చూసి నా చిన్నభార్య బిచ్చాటనకు వెళ్ళిపోయింది. ఆ రోజు నేను ఇంటికి రావడం, ఆమె బిచ్చాటనకు వెళ్ళి ఇంటికి తిరిగిరావడం ఒకసారి జరిగింది. ఆమె జోలె వేసుకున్నది నా కంట పడింది. నాకు అరికాలి మంట నెత్తికి ఎక్కింది. ఓ నాలుగు దెబ్బలు వేశాను. ఆ రోజు నుంచి మళ్ళీ బిచ్చానికి పోలేదు. అటు తరువాత నాకు – 'చిన్నప్పటి నుంచి అదే వాతావరణంలోంచి వచ్చిన ఆమెకు ఒక్కసారిగా ఆ అలవాటును వదులుకోవడం కష్టం కదా' అని అనిపించింది !

ఆమెను కొట్టినందుకు మనస్సులో చాలా బాధపడ్డాను !

**అన్నయ్య పిల్లల పెళ్ళి :**

చివరికి అనుకున్నట్టే డొక్కమారెప్ప మామ ఇంటి నుంచి ఇద్దరు ఆడపిల్లలను అన్నపిల్లలకు తెచ్చుకున్నాం !

పెళ్ళికి ముందు మా వాళ్ళు కుల పంచాయితీ పెట్టడం సాధారణం. నాలుగైదు రోజులు కులపంచాయితీ జరిపారు. అందులో నాదొక విన్నపం ఉంది. నేను అన్న పిల్లలకు డొక్క మారెప్ప ఇంటి అమ్మాయిని తెచ్చి పెళ్ళి చేస్తానని అన్న పిల్లల దగ్గర డబ్బు ఇప్పించుకున్నాననే నింద నా మీద పడింది. ఈ మాటను స్వయంగా అన్న పిల్లలు, అన్న వీధి వాళ్ళతో చెప్పుకుని తిరుగుతున్నారని, ఆ మాటలు విన్నవాళ్ళు నాకు చెప్పారు.

ఈ అపవాదు నిజమో, అబద్ధమో తేలిపోవాలి. అందుకోసం అన్నను, అన్న పిల్లలను దేవుడి ముందు కూర్చోబెట్టుకుని 'మీరెంత డబ్బు ఇచ్చారు? ఆ కుర్రవాళ్ళకు ఇప్పిస్తానని నేను ఎంత డబ్బు ఇప్పించుకున్నానో అది దైవం ముందు చెప్పండి' అని అడిగాను. మొదట మేము అలా అనలేదని చెప్పిన వాళ్ళు సాక్ష్యాల సమేతంగా రుజువు చేసిన తరువాత చివరికి అలా తాము అనటం నిజమేనని, తప్పయిందని. అందుకు తప్పు దండన చెల్లి స్తామని చెప్పారు. అయితే అన్న దగ్గర తప్పు దండన తీసుకోలేదు. అప్పుడే వాళ్ళు అలా ఎందుకు చెప్పారో కూడా నాకు వివరించారు. నాపై ఆ విధంగా అపవాదు మోపకపోతే నేను ఆ స్త్రీల విషయంలో మౌనంగా ఉంటానేమోననే భయం వల్ల ఆ విధంగా నా మీద కల్పించి చెప్పారట. ఇదంతా ఎలా ఉన్నప్పటికీ, చివరికి డొక్క మారెప్ప కూతురును ఒకడికి, మారెప్ప తమ్ముడి కూతురికి మరొకడిని ఇచ్చి పెళ్ళి చేశాం.

వారి సంసారం సాఫీగా సాగితే చాలు !

**కోడలి ఒంటిమీదికి దేవుడు రావటం :**

అన్న పిల్లలకు ఇద్దరు అమ్మాయిలను నిర్ణయించి పెండ్లిండ్లు చేశాం.

ఇక అన్ని సరిపోయాయి అనే సమయానికి పెద్ద కోడలు తాళి కట్టించుకున్నప్పటి నుంచి ఒకే విధంగా ఏడవసాగింది.

ఎవరితోనూ ఒక మాట లేదు ఒక నవ్వు లేదు. ఏదో ఒక మూలను పట్టుకుని పడుకునివుండిపోయేది.

"ఎందుకిలా చేస్తావు?" అని అడిగితే ఆ అమ్మాయి జవాబిచ్చేది కాదు.

ఒకసారి తనకు ఇష్టం లేకపోయినా ఎందుకు పెండ్లి చేశారని తమ పెద్దనాన్న ముందు అన్నదట. మా కుటుంబాల్లో అమ్మాయిల, అబ్బాయిల అభిప్రాయాలు అడిగే పద్ధతి లేదు. పెద్దవాళ్ళు ఏమి నిర్ణయిస్తారో అదే చివరి మాట !

'ఆ పిల్ల ఊరకే అట్లా కూసుంటుంది సూడు మామ' అని ఆ పిల్ల అన్న చెప్పాడు.

నేను వెళ్ళి అడిగినా ఆ అమ్మాయి ఏమీ చెప్పలేదు.

అటుతరువాత వాళ్ళమ్మ 'నువ్వేంటికి ఇట్లా కూసున్నావు?' అని అడిగితే, ఆ అమ్మాయి ఒకసారి– 'తాను ఈరనాగమ్మ' అని చెబితే మరొకసారి 'కణవి మారెమ్మ' అనీ, ఇంకొకసారి 'కరియప్ప దేవుడు' అని చెబుతోందట.

చివరికి దర్గా ముల్లాసాబ్ దగ్గరికి పిల్చుకునిపోయాం. అతడు ఈ పిల్లలకు రాహువు తగిలింది అని చెప్పి నెమలీకల కట్టతో కొట్టి, ఆధారం ఇచ్చి, ఒక తాయత్తు ఇచ్చి మెడలో కట్టుకోమన్నాడట.

అప్పటి నుంచి పిల్ల ఏడవటం తగ్గి కొంచెం కోలుకుంది. అటు తరువాత భర్తతో సర్దుకుని పోతుందేమో అనిపించింది.

ఈ రాహువు, దెయ్యం, పీడలు నిజమా అబద్ధమా అన్నవి నన్ను ఇప్పటికీ ప్రశ్నలుగా వేధిస్తూ ఉన్నాయి !

**మేమెందుకు అడుక్కుని తినేవాళ్ళమయ్యాం ? :**

మేమెందుకు అడుక్కుని తినే వాళ్ళమయ్యాం? అనే ప్రశ్న నన్ను ఎల్లప్పుడూ వేధించేది.

మేము పుట్టినప్పటి నుంచి మా జాతినే ఈ విధంగా బిచ్చగాళ్ళుగా దేవుడు సృష్టించాడా అన్నది అర్థం కాలేదు. మా తాత, ముత్తాత, నాన్న, నేను, నా అన్నదమ్ములు, అంటే మా జాతి జనమే దేవుడిని ఆడించడం; తరువాత బిచ్చమడగటం, ఇది తప్ప మరో ఉద్యోగమే మాకు తెలియదు. మేము ఎందుకు ఇలా ఉన్నాం? మాకూ ఒక ఉత్తమ జీవితం ఎందుకు లేదు? మాకెందుకు ఒక నెలవు లేదు? ఈ ప్రశ్నలు నిరంతరం నన్ను వేధిస్తూవుంటాయి.

నాకు ఒక్కొక్కసారి – మేమంతా ఒక కాలంలో ఉత్తములుగా, ఇప్పటి పెద్దమనుష్యుల్లా సుఖశాంతులతో ఉండేవాళ్ళమేమోనని అనిపించేది. ఇప్పటి ఉత్తములంతా అప్పట్లో మాలా తిరుగుతూ అడుక్కుని తినేవాళ్ళేమో? మేము గతంలో వారి మీద సవారి చేసిన ఫలితంగా ఈ రోజు ఇలా అయ్యామేమోనని అనిపిస్తుంది.

ఏఏ టైముకు ఏమేమి వస్తుందో దాన్ని అనుభవించటమే మాకు మిగిలివున్న దారి అని అనుకున్నాను.

**అన్నయ్య పిల్లలను చదివించాలనే కోరిక :**

మా అన్నకు నలుగురు మగపిల్లలు. నలుగురిలో ఇప్పుడు ఒకడు ఆరో, ఏడో చదువుతుంటే మరొకడు తొమ్మిదో, ఎనిమిదో చదువుతూ ఉన్నాడు. మొదటి ఇద్దరు మగపిల్లల్లో ఒకడ్ని నేనే పెంచుకుని, చదివించాలని చాలా ఆశపడ్డాను. అయితే మా అన్న అందుకు అవకాశం ఇవ్వలేదు. చదవండని పిల్లలకు పాఠ్యపుస్తకం ఇప్పిస్తే, మా అన్న తాగి వచ్చి

జగడానికి నిలబడేవాడు.

"నువ్వు ఏంటికి వీళ్ళను సదివిస్తుం డావు? ఈళ్ళ చేతికి గిన్నెలిచ్చి ఊళ్ళో అన్నం అడుక్కుని రమ్మని పంపుతాను, నువ్వెవరు బడికి పంపమని సెప్పనీకి?" అని గొడవపడేవాడు.

"లేదు. మన ఇంట్లో ఒక్కడైనా చదువు కున్నవాడు ఉండాలి, నువ్వు ఆ పిల్లలకు అడ్డుపడొద్దు" అని మొత్తుకున్నాను.

అయితే మాఅన్న నా మాట వినలేదు.

వారి తలరాతకు నేను ఏమి చేయ గలనని మౌనం వహించాను.

ఇప్పుడు తమ్ముడి కూతురును పెంచు కుని ఆమెనే బడికి పంపుతూ ఉన్నాను.

**ఇతర విషయాలు :**

నేను సంఘం విషయంగా తెలిసిన వాళ్ళ మధ్యన తిరగడం ప్రారంభించిన తరువాత నాకు బిచ్చం అడగటం సరికాదని అనిపించసాగింది. ఆ కారణంగా బిచ్చమడగటం వదిలేశాను. బిచ్చమడగటం వదిలేసిన తరువాత చేపలవేటకు వెళ్ళి జీవనం సాగించసాగాను. కేవలం చేపల వ్యాపారంతో కడుపు నిండదని తెలిసిన తరువాత ఒక చిన్న అంగడిని ఇంటి ముందు పెట్టు కున్నాను. బిచ్చాటనను పూర్తిగా దూరం చేశాను. ఆ రోజుల్లో కంప్లి బజారులో ఎవరి అంగళ్ళ ముందు, ఇళ్ళముందు వెళ్ళి బిచ్చమడిగి వారిచేత తిట్టించుకున్నానో; వాళ్ళే ఈ రోజు నన్ను ఎంతో ప్రేమతో పలకరిస్తారు. బిచ్చం అన్నది మా జాతికి ఎలాంటి శాపమో ఇప్పు డిప్పుడే తెలుస్తోంది. మా వాళ్ళందరితో బిచ్చం అడగకండి అని చెబుతాను. అయితే వాళ్ళు ఇంకా వినే స్థితిలో లేరు. భవిష్యత్తులో వారికి బుద్ధి వస్తుందన్న నమ్మకం నాలో ఇంకా మిగిలివుంది.

ఒక్కొక్కసారి నాకు ఎందుకన్నా మేము ఇలాంటి కులంలో పుట్టామా అని అనిపిస్తుంది.

అయితే ఏం చేస్తాం?

పుట్టేశాం !

ఈ అవమానం, పేదరికం, నిరక్ష రాస్యతల నుంచి మేము బయటికి రావలసి వుంది.

మా పాత పద్ధతులను, నీతులను వదులుకోవాలి.

దానికీ ఒక కాలం కలిసి రావటానికి ఎంతో దూరం లేదని అనిపిస్తుంది.

మా వాళ్ళందరూ ఉద్ధరింపబడాలంటే మేమంతా ఒకేచోట గుంపు గుంపులుగా ఉండ కూడదు. ఇతర జనాల మధ్యన మేము పెరగాలి. బతకాలి. ఇతర జనాలతోపాటు కలిసివుంటే అప్పుడు మేమూ వాళ్ళలాగే అవుతామేమోనని అనిపిస్తుంది.

మొన్న సంచారజీవుల పిల్లలను అదేదో క్రీడా పాఠశాలలో పిల్లలను చేర్చుకుంటారని చెప్పారు మాధవరావు సార్. శికారి రాము 'తమ జాతి పిల్లలను ఆ పాఠశాలలో చేర్చుతున్నాం, మీ పిల్లలు ఎవరైనా ఉంటే చెప్పు' అన్నాడు. మా జాతికి చెందిన నలుగురు పిల్లలను పాఠ శాలకు పంపటానికి సిద్ధం చేశాం. వాళ్ళు సెలెక్ట్ కూడా అయ్యారు. ఆ పిల్లలకు పాఠశాల, హాస్టల్ అన్నిటిని శికారి రాము బళ్ళారికి పిల్చు కునిపోయి చూపించుకుని వచ్చాడు. తాము పాఠశాలలో చేరుతామని చెప్పినవాళ్ళల్లో ఇద్దరు తాము పాఠశాలకు వెళ్ళమని పట్టు బట్టారు. చివరికి ఇద్దరు పిల్లలు వెళ్ళడానికి సిద్ధమ య్యారు. వారికి ఛార్జి ఇచ్చి పంపాం. వెళ్ళి నాలుగు రోజులైనా కాలేదు. పాఠశాలలో సరిగ్గా నేర్పరు, నేను ఊరికి వస్తానని ఒక పిల్లవాడు పోరుపెట్టి తిరిగి వచ్చాడు.

మా జాతి జనమే ఆ పిల్లవాడిని సగం భయపెట్టి పాఠశాలకు వెళ్ళకుండా చేశారేమో ననే అనుమానం నన్ను కోస్తూ ఉంది. మా జాతి వాతావరణమే అలాంటిది. మా జాతి వాతా వరణం నుంచి బయటికి పోతే మా పిల్లలు తెలివైన వాళ్ళు అవుతారని నేను అనుకున్నాను. అయితే ఆ వాతావరణం నుంచి మా పిల్లలు బయటికి రావటానికి సిద్ధంగా లేరు. దీనికి పరిష్కారం ఏమిటో తెలియటం లేదు !

**ప్రస్తుతానికి చివరి మాట:**

చదువనూ రాయనూ రాని సంచారి అయిన నాలాంటివాడి జీవిత కథ ప్రక టింపబడుతుందని నేను కలలోనూ, మనసు లోనూ అనుకోలేదు. అది సాధ్యంకావటమే ఒక ఆశ్చర్యకరమైన విషయం. నేను ఏనాడూ, ఎవరికీ నా మనస్సులో ఉన్నది విప్పి చెప్పిన వాడినే కాను. ఆ విధంగా మనస్సు విప్పి చెప్పేలా చేసినవారు కుమార్ సార్. ఆయన నాకు అదేమి మాయ చేశారో నాకు ఈ రోజుకూ తెలియదు.

ఇందులోని విషయాలన్నీ నేను చెప్పి నవే. వాటిని అప్పుడప్పుడు విన్న కుమార్‌సార్ వాటినంతా రాసిపెట్టారట.

ఒకరోజు "అన్నా, నీ గురించి ఒక పుస్తకం వేద్దాం. నువ్వు చెప్పిన జ్ఞాపకాలన్నీ రాసిపెట్టాను" అన్నారు.

అటుతరువాత తాము రాసినదంతా నాకు చదివి వినిపించారు.

నేను ఆయనతో "ఇది మాత్రమే నా కథ కాదు. ఇంకా చాలా ఉంది. గుర్తుకొచ్చినపుడు చెప్తాను" అని అన్నాను.

"అలాగే ఇంకా ముందు చాలా జీవితం ఉంది. నీ జీవితంలో నీకు జ్ఞాపకం వచ్చింది, ముందు జరగబోయే సంఘటనలు చెబుదువు కానీ, అప్పుడు ఇంకొక పుస్తకం చేద్దాం" అని చెప్పారు.

ఇక ముందు నా జీవితంలో జరిగే ప్రతీ సంఘటనను పాఠకులకు అప్పజెబుతాను. అందుకు కుమార్ సార్‌లాంటివారు సదా నా వెంబడి ఉంటారు. ఇప్పుడు నా జీవితంలోని కొన్ని జ్ఞాపకాలను మీ ముందు పెట్టాను. దయచేసి చదవండి. ఎవరికైనా నా కథ వల్ల బాధ కలిగితే దయచేసి మీ కొడుకుగా భావించి క్షమించండి. ఇది నా జీవితంలోని జ్ఞాపకాల చద్దిమూట మాత్రమే. ఇంకా ఇలాంటి అనుభవాలు ఎన్నో ఉన్నాయి. అవి జ్ఞాపకానికి వచ్చినపుడు చెబుతాను. ప్రస్తుతం ఇంత చాలు. నమోదు చేసేటంతటి గొప్ప అనుభవాలను కలిగిన గొప్పవ్యక్తిని కాను. నా గురించి పుస్తకం రాయాలనే ఆలోచన వల్ల ఈ అనుభవాలను కుమార్‌సార్‌కు చెప్పలేదు. ఊరకనే ఎప్పుడైనా కలిసినపుడు తెలియజేసిన అనుభవాలు. అంతే. వాటినే ఆయన జ్ఞాపకం పెట్టుకుని ఈ పుస్తకం రాశారు. చివరికొక రోజున 'నాగప్ప...నీవు చెప్పిన నీ కథను ఇందులో రాసిపెట్టాను చూడు' అని ఆయన తమ కంప్యూటర్ చూపించారు.

**చదువురాని నాకు అది ఎలా అర్థమ వుతుంది? ఆయనే చదివీ వినిపించారు.**

**"నువ్వు చెప్పిన కథ సరిగ్గానే ఉందా? పొరబాట్లు జరిగివుంటే దిద్దుకుంటాను" అని అన్నారు. ఆయన జ్ఞాపకశక్తికి నమస్కారం చేస్తున్నాను.**

**నాలాంటి జీవితానికీ ఒక కథ ఉందన్నదే తెలియని నాకు ఆయన తెలిసేలా చేశారు. ఆయనకు ఏ విధంగా మప్పిదాలు చెప్పుకో వాలో తోచటం లేదు. దండాలు !!**

(పూర్తి అయింది)

భాషోద్యమ కథానిక

# ఎదుగని బిడ్డ

కీ.శే. అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు



సంతాన హీనులు కొందరు దారిద్ర్య పీడితులు కొందరు. రోగ బాధితులు కొందరు. క్షుధాహతులు కొందరు. ఎవరి మొరల నాలించగలము? అని తలంతురు. నిజమే గాని నా కథనమును పూర్తిగా వినవలసినది. ఆలకింపదగినవి కొన్ని గలవని మీరే అనుకొందురు. నేను బిగ్గరగా మాటలాడలేను. పెద్దదానను. ఈ కాలపుదానను గాను.

సుమారెనిమిది వందల యేండ్ల క్రిందటఁ గంటిని. అసత్యము కాదు. రాజరాజ నరేంద్రు నంతటివాడు బిడ్డ రూపురేఖలుఁజూచి నాలుక కొఱుకుకొనెను. ఎత్తుకొనెను. సొమ్ములు పెట్టెను, రుమాళ్ళు కప్పెను.

ఇతరుల స్తోత్రములకేమి? తెలిసి నుతించువారొకరు. తెలియక నుతించు వారొకరు. నన్ను నేనే పొగడుకొంటిని.

బిడ్డ రాజుల తూగుటుయ్యేలలో ఊగును. రాజుల బంగారు చేతులలో బెరుగును. రాజుల రత్నాల మేడలలోఁదిరుగును అని సంతోషపడితిని. ఇది పూర్వజన్మ సుక్రుత ఫలమని అందురు గాని యే జన్మము దైననేమి? ఆ విచారణ అవసరమని నేననుకొనను. బిడ్డ యెప్పుడును అక్కడనే చంక దిగి యెఱుఁగదు. దాది వలెఁ బోయిచూచి వచ్చుచుంటిని. ఆయమ్మ చేతిలో, ఈయమ్మ చేతిలో బిడ్డ నలిగిపోవునని భయపడితిని. కడుపు తీపిగాని రాజులు బిడ్డను నలఁగనిత్తురా..

ఒక యేఁటికొక యేదు పైనబడినకొద్దీ, బిడ్డకు ఆకారము మారినది. దేశదేశాలా బిడ్డ పేరు మ్రోగినది. రాజులకేమి నిల్కడ? లేచినను బడినను ఎత్త గోడలే. ఈ రాజునుగొట్టి ఆరాజు, ఆరాజును గొట్టి యింకొకరాజు మహారాజు రాజరాజు ఏమని యెత్తుకొన్నాడో. ఏ రాజు వచ్చినను నా బిడ్డను జంక దింపలేదు.

రాజులు విడువఁగా మంత్రులు, మంత్రులు విడువఁగా రాజులు బిడ్డను కాలు క్రిన్దఁబెట్టనిచ్చినారనుకొన్నావా? ఏమి బిడ్డరా? ఏమి బిడ్డరా అని నెత్తినిఁ బెట్టుకొనని వారు లేరు.

సొమ్ములమీద సొమ్ములు, గుడ్డలమీద గుడ్డలు. శిరస్సు దగ్గఱనుండి చీలమండల దాఁకా దిగవేసినారు. బిడ్డ ముఖారవిందము అటువంటిది.

ఈ కథ ప్రతీకాత్మకమైంది. ఇంగ్లీషులో ఇటువంటి రచనలను 'అలిగరి' అంటారు. తెలుగులో అర్థవాదం అని కూడా అంటారు. అంటే తెలియచేసే విషయాన్ని ధ్వన్యాత్మకంగా చెప్పడం. తెలుగు సాహిత్యం ఎప్పుడూ పోతపాలతోనే పెరిగింది. వయసుకు తగ్గ ఎదుగుదల, వికాసం, స్వావలంబన కనపరచలేదని తెలుగు తల్లి మొర పెట్టుకోవడం ఈ కథ ఆక్షేపగర్భంగా చెపుతున్నది. తొమ్మిది దశాబ్దాలనాటి కథ కదా ఇది. భాష శైలిలో కొంత చాదస్తం ఇంకా కనపడుతుంది.

నాబిడ్డ కేండ్లన్నీ యేతీరున గడచినవో పూసగ్రుచ్చినట్లు చెప్పి విసిగింపను. ఏండ్లు పైనిఁ బడ్డవి. ఆకారము మాఱినది. కాని బిడ్డ యెదిగినట్లగపడదు. పెట్టిన సొమ్ములు, తొడిగిన గుడ్డలు బిడ్డను ముంచివేసినవి. అవి చూచియే అందఱూ భ్రమపడ్డారు. బిడ్డకు జక్కిలిగిలి పెట్టెడువారు. బిడ్డను నవ్వించెడువారు, బిడ్డని వచ్చీ రాని మాటలు వినెడువారు, ఎవరి

## తెలుగుకు పట్టిన 'తెగులు' పై విసుర్లు

అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు (1889-1942) గురజాడ సమకాలికులైన తొలితరం కథారచయితలలో ఒకరు. వీరి త్రిలింగ చిన్న కథలు ఇప్పటికి మూడు ముద్రణలు పొందింది. త్రిలింగ పత్రికను వావిళ్ళవారు 1914లో స్థాపించారు. ఈ పత్రిక వ్యవస్థాపక సంపాదకుడు ఉమాకాంతమే. రవీంద్రనాథ టాగూర్ కాబూలీవాలా కథను మొట్టమొదటిసారి తెలుగువారి చేత చదివింప చేసినవాడు ఉమాకాంతమే. ఉమాకాంతంగారు 1912-14 మధ్యకాలంలో కలకత్తాలో చదివారు. అప్పుడు బెంగాల్ సాహిత్య పురోగమనాన్నాయన పరిశీలించి ఉంటారు. వాడుక భాష విషయంలో తన కళ్ళు తెరిపించినవాడు గురజాడ అప్పారావని ఉమాకాంతం చెప్పినట్లు తల్లావఝుల శివశంకరశాస్త్రిగారి సాక్ష్యం ఉంది. ఆనాటి వ్యవహారిక భాష శైలీ నిర్మాతలలో ఉమాకాంతం అగ్రగణ్యుడు. నవద్వీప పండితులు ఈయనను మెచ్చి విద్యాశేఖర్ బిరుదిచ్చారు. 1914 మే సంచిక "త్రిలింగ" లో ఈ కథ వచ్చింది. తెలుగు పత్రికలలో "కార్టూన్"లు ప్రారంభించినవాడు కూడా ఉమాకాంతమే అనిపిస్తుంది. ఏమంటే "త్రిలింగ" పత్రికలో కార్టూన్లు ఉన్నాయి. ఈ పత్రిక తెలుగులో అర్ధశతాబ్దం పైనే వెలువడింది.

ఈ కథ ప్రతీకాత్మకమైంది. ఇంగ్లీషులో ఇటువంటి రచనలను 'అలిగరి' అంటారు. తెలుగులో అర్థవాదం అని కూడా అంటారు. అంటే తెలియచేసే విషయాన్ని ధ్వన్యాత్మకంగా చెప్పడం. తెలుగు సాహిత్యం ఎప్పుడూ పోతపాలతోనే పెరిగింది. వయసుకు తగ్గ ఎదుగుదల, వికాసం, స్వావలంబన కనపరచ లేదని తెలుగు తల్లి మొర పెట్టుకోవడం ఈ కథ ఆక్షేపగర్భంగా చెపుతున్నది. తొమ్మిది దశాబ్దాలనాటి కథ కదా ఇది. భాష శైలిలో కొంత చాదస్తం ఇంకా కనపడుతుంది.

తనకు నచ్చిన, తాను మెచ్చిన రచయితలలో అక్కిరాజు ఉమాకాంతం ఒకరనీ, రోజూ తానొకసారి చూడాలని కుతూహలపడే ఛాయాచిత్రాలలో ఉమాకాంతం గారిది కూడా తప్పనిసరి అని శ్రీశ్రీ తన వ్యాసక్రీడలలో చెప్పుకున్నాడు. తెలుగుపట్ల మమకారం, ఆదరణ, అభిమానం తగ్గిపోతున్నాయని ఆలోచనపరులంతా అనుకుంటున్నా ఈ రోజులలో దానికి కారణాలేమిటో ఉమాకాంతం ఊహించగలిగాడు తొంభైఏళ్ళనాడే. అబ్బూరి రామకృష్ణరావుకు అక్కిరాజువారంటే ఎంతో గురి. తెలుగుభాష, సాహిత్యం ఎప్పుడూ రాజుగారి అందలాలలో, అధికారుల అండదండలతో అలరారాయే కాని స్వీయవ్యక్తిత్వం పెంపొందించుకోలేదని ఉమాకాంత విద్యాశేఖరుల అభియోగం. ఇంగ్లీషు ఈ దేశంలోకి వచ్చిందాకా సంస్కృతమే తెలుగుమీద పెత్తనం సాగించింది. ఇక ఇంగ్లీషు విద్యా విధానం ప్రారంభమైన తర్వాత ఇంగ్లీషు నెత్తినెక్కికూచుంది. ఉన్నతవిద్య మాధ్యమంగా తెలుగు ఏనాడూ మర్యాదా, మన్ననా పొందలేదని తెలుగుతల్లి హృదయ విదారకంగా బాధపడటం ఈ కథ ముగింపులోని ప్రతీక.

ముచ్చట వారు తీర్చుకొన్నారే గాని బిడ్డ యెదుగు చున్నదా లేదాయని విచారించిన వారు లేరు. ఏ రాజున్నాడు గనుక పది కాలాలపాటు, బిడ్డ పెరుగుదు కనిపెట్టుటకు? మంచి బిడ్డ. రాజుల మేడల కలవాటైన బిడ్డ. అని యేరాజు పట్టినసూ పంచ ప్రాణము విడిచెదువాఁడు.

ఏరాజు వచ్చినప్పు డారాజుకు బిడ్డ క్రొత్తదిగానే కనబడ్డది. ఈ బిడ్డ పుట్టిన దెప్పుడు? ఎన్నేండ్లు గడచినవి? పెరుగుడేవిధముగా ఉన్నది? అను విచారణ యేరాజునకుఁబట్టినది? రాచకార్యాలన్నీ విడిచి పెట్టి?

నేనూ నా బిడ్డా అంతవఱకదృష్ట వంతులమే. బిడ్డను జూచి రోఁతపడుదురేమో అని యెంత భయపడ్డాను. వారి ధర్మాన గుడ్డల చాటున. సొమ్ముల చాటున ఉన్న మొగమంతా పరీక్ష పెట్టి చూడలేదు గాని.

నిజమెందుకు దాచిపెట్టవలె? బిడ్డ ముఖమునకు అందమే చెడినది. వికారపు రూపు పడ్డది. కళకళలాడుచు మల్లెపువ్వు వలె ఉన్న మొగము ముదురఁబాఱి పోయినది. నీవే చెప్పు. ఏండ్లేమో పైనిఁబడె. ముదిరినదన్న ముదరదూ? అన్ని యెదిగితేనే మొగము తగ్గట్లుండి యింపూ సొంపూ కాళ్ళు కట్టెలైనవి. పొట్ట లావైనది. బిడ్డను జూచుకొన్నపు డెల్ల నా కడుపు కుమ్మరావము వలెఁ గుమిలిపోవుచున్నది నాయనా ఏమనుకొన్నావో.

ఇంత అంబాడకపోయె, తప్పటడుగులు వేయకపోయె. బిడ్డకు దయ్యమే పట్టినదో, భూతమే పట్టినదో, యెవరాదిక్కు? అని ప్రాణము ఎన్ని విధాలనో తపించినది. రాజుల చేతిబిడ్డ. తక్కువ లేదు అని అను కోవచ్చును. గాని బిడ్డ యెదగడని రాజులకు జెప్పితే వారి కేమిరోఁత పుట్టి బిడ్డను విడుతురో అని భయము. ఒక వడుగు చూచినను. ఒక పెండ్లి చూచినను, నా కడుపు తఱుగుకొని పోయెను. లేక యొక దుఃఖము, ఉండి యొక దుఃఖము బిడ్డను దెచ్చి దగ్గఱఁ బెట్టుకొందునా అని యుండును గాని రాజులతోఁగూడిన పనే అని తొక్కులాట రామచిలుకను బెంచినట్లు బిడ్డను బెంచుచున్నారు. మహారాజుల మందిరాలలో బంగారు గిన్నెలతో పాలుత్రాఁగిన బిడ్డను నేను దెచ్చుకొని మాత్రమేమి సుఖ పెట్టుదును నాయనా!

మొలలోతు దుఃఖములో మోకాలిలోతు సంతోషము. పాలేకాదు; వండ్లేకాదు అన్నమేకాదు, ఏవి పెట్టినసూ ఇంకా నోరు తెఱచి తినుట యున్నది. పన్నీటి స్నానాలు, కస్తూరి వాసనలు, పూలహారాలు, ఏమిచెప్పుదును ఆరాజులనందున నా బిడ్డకు జరిగిన వైభవము?

టంకాలకుప్పలు వరహాలరాసులు! బంగారుగంటలు బిడ్డముందు పోసెదువారు. రాజులు అందలాలెక్కితే అందలాలు, అమ్బారీలెక్కితే అమ్బారీలు. బిడ్డకు రాజభోగాలన్నీ సాగినవి. రాజే బిడ్డను భుజాలమీద పెట్టుకొన్నప్పుడు, అందలాలు అమ్బారీలు లెక్కా? ఎంత యదృష్టము! ఎంత యదృష్టము! ఎంత యదృష్టము అని అననివారులేరు. ఏఁటిమీఁద ఏండ్లు ఎన్నో యేండ్లు గడచినవి. ఒక యేఁడుగాకున్న ఒకయేఁటనైనా బిడ్డ యెదుగునేమోయని చూచితినిగాని యేనాఁటికిని ఎదగదు.

బిడ్డకు రోగమువచ్చినదని యేడ్చితిని. మొదటి నుండి నా యింటిలో ఉన్నను బాగు పడుననుకొంటిని. ఈ ముసలిది సోది చెప్పు



Unfiled Notes Page 37

చున్నదని తలఁపకుము. నాయనా! దినములొక తీరున జరుగవు. రాజులపోరు బలమాయెను. తురకరాజులు వచ్చినారు. ఈ యదావుళ్ళలో బిడ్డనెక్కడ గొంతుకోయుదురోయని నా ప్రాణాలలో ప్రాణాలు లేవు. వారికేమి దయా దాక్షిణ్యాలు? అదీ యిదీ యెత్తి ధూ, యిదేమి బిడ్డరా! అన్నాడు ఒక తురక వాఁడు. తిన్నంగా నా బిడ్డను నేను ఇంటికిఁ జేర్చు కొన్నాను. ఒక తురకరాజు వద్దని, ఒక తురక రాజు దగ్గరకు దీసి, ఈతీరుగా దినాలు గడచినవి. అందఱ నోళ్ళలో నానిన బిడ్డ గనుక సంస్థానాలకుఁ దీసికొనిపోయినను, ఒక కాపుకుం జూపినను, ఒక కరణమునకుం జూపినను, పూర్వపువానిఁబట్టి బిడ్డకు ఇంత ఆదరణ చూపెడువారు. బిడ్డను ఇంటిలోనే పెంచు కొంటిని. బిడ్డ వేలెడు కూడా పెరుగలేదు. మొగము పెంకైనది. బట్టతల పడ్డది. కాళ్లు చెడిపోయినవి. చేతులు మొద్దులైనవి. బిడ్డనుజూచిన కొద్దీ గుండె నీరైపోవునే కాని ధైర్యముకలుగదు.

నా బిడ్డ రోగము కనుఁగొన్న వారు లేరు. మఱుగుజ్జు బిడ్డా అని చూచితే కదలనేలేదు. మఱుగుజ్జుబిడ్డ సగముగాకున్న సగమైనా పెరుగదూ? ఏమిరోగమో యెవరును జెప్పలేరు. ఏనాఁడు పట్టినను పుట్టెడు దిగులు నాయనా! తెల్లరాజులు వచ్చినారని చెప్పుకొన్నారు. మంచిరాజులు, మంచిరాజులు అని అందరు అనుకొను చుండఁగా, ఎవరైనను నా బిడ్డగతి చూతురేమో అని ఎంత పరితపించితిని? పూర్వపు వాసి విని తలయూచిన వారొకరు. దూరముగాఁజూచి బిడ్డ పై ఒకకాను, రెండుకాసులు పడవేసిన వారొకరు. పాపము తలంచినవారొకరు. మొగము చిట్లించు కొన్న వారొకరు. ఎత్తుకొన్న వారులేదు. చంకను బెట్టుకున్న వారు లేరు. ఎందుకు నాయనా!భ్రమ! బిడ్డకు వెనుకటి రోజులు తిరిగి రావు. ఆ దినాలు రావు, ఆ రాజులు రారు. నిజమున నేమి? బిడ్డ ఏమంతశృంగారముగా ఉన్నదని నెత్తినిఁ బెట్టుకొందురు నాయనా ఇతరులు నాయేడుపే కాని.

పోనీ! ఆ వైభవము రమ్మన్న రాదు. బిడ్డనుదగ్గఱకు దీసి యీ బిడ్డ యిట్లున్న దెందుకు? రోగమేమి? నొప్పేమి? అన్న వారైనా ఉన్నారా? అదీ లేదు. ఎవరేమను కొన్ననూ కడుపుగదా బిడ్డ పెరుగునేమో బాగుపడునేమో, ఒకరు గాకున్న ఒక రాజైనా నాపాలిటిదైవమై బిడ్డగతి కనుఁగొనునేమో అని ఆశతో పరమాత్మునిమీఁద భారమువేసి రోజులు గడుపుచుంటిని.

ఇటుచూడఁగా నాబిడ్డ కేడు వెనుకలఁ బుట్టిన బిడ్డలు పెరిగి పెద్ద వారైనారు. తల్లుల కడుపు చల్లఁగా కళకళలాడుచున్నారు. నలుగురిలో పేరు, ప్రతిష్ఠ సంపాదించు కొన్నారు. సిరి, సంపద, ఫలానివారనఁగా ఎక్కడకుఁ బోయినను ఘనత, గౌరవము, వారికేమి? మహారాజులు అని అనిపించుకొన్నారు. దేశదేశాలు తిరిగినారు. లోకములో ఉన్న విద్యలన్నీ నేర్చుకొన్నారు. ఏమేమి శాస్త్రాలో చదివినారు. గాలిని కదలకుమన్నారు, నీటిని నిల్వుమన్నారు. అగ్గిని ఆగుమన్నారు. భూ దేవతలనఁగా వీరేనని అందఱూ పొగడు చున్నారు. బ్రహ్మకు బ్రహ్మలై నిల్వఁబడ్డారు. ఆ బిడ్డను జూచి నా బిడ్డను జూచుకొన్నప్పుడు నాగుండె కోసికొని పోవుచున్నది. అందరివలెనే నేను గంటిని. రాజుల చేతిబిడ్డ. నాయంత అదృష్టవంతురాలు లేదు అని అనుకొంటిని. నాయనా! యేమి రోగమో యేమో నా బంగారు వంటి బిడ్డను పాడుచేసి కూర్చున్నది. ఆ రోజుకు ఆరోజుకు బిడ్డ బొత్తిగా చెడిపోయినది నాయనా!

ఏడుపు ఆరంభమైనది, ఎడతెగని యేడుపు. మనుష్యునిఁ జూచిన తోడనే

మఱిమఱి యేడ్చును. జాలిపడి యెవరైనా ఏదైనా పెట్టినఁదినును. మరల ఏడుపు మొదలు పెట్టును. గొప్పగా బ్రతికిన బిడ్డ. ఈ రోజులలో ఏడ్పులు వినెడువారెవరు? భోగభాగ్యాలూ, కీర్తి ప్రతిష్ఠలూ, గొప్పతనాలూ లేకపోఁగా, అన్నమునకు అగచాట్లుపడుచున్నది. అనఁగూడదుగాని నాయనా! చచ్చినదానిలోను బ్రతికినదానిలోను జమగాకున్నది. పడఁగలపాట్లన్నీ పడితిని. బిడ్డ రోగము చెప్పినవారు లేరు. బిడ్డ యెదగదు. ఏండ్లు గడచినవి. పూండ్లు గడచినవి. రాజులు మాఱినారు రాజ్యాలు మాఱినవి. నాయనా! బిడ్డ యెదుగుడు పుట్టినప్పుడెంతయెత్తో, ఇప్పటికిని అంతే యెత్తు.

కనకమువంటి మొగము. నాయనా! గడ్డలయిపోయినది. తెల్లడాక్టర్లు ఘన వైద్యులని చెప్పినారు. బిడ్డను దీసికొని పోయి చూపి జరిగినదంతా చెప్పితిని. బిడ్డయింక ఎక్కువ దినములు బ్రతుకదని కొన్దఱన్నారు. నా గుండెలవిసిపోయినవి. ఎంత కష్టపడి కంటిని, ఎన్నాళ్లు పెంచితిని అని యేడ్చుచుంటిని. ఏడువకు రాజుల యిండ్లలోఁ జిన్న తనముననే తినరానిదెల్లఁ దినుటవలన బిడ్డకు పొట్ట పాడైనది. ఇంకఁబెరుగదు గాని బ్రతుకును అని కొందరోదార్చిరి. పాపము శస్త్రముచేసి, మందులిచ్చి బిడ్డకు తగిన వైద్యము చేసిన బాగుపడును. ఎందఱు బిడ్డలు బాగుపడలేదు? మేము చేయఁగలది చేసెదము అని కొందఱను చున్నారు.

తెల్లవైద్యము నేర్చిన మనవారికిఁ జూపితిని, బిడ్డ పెంపు ఆగిపోయినది. ఈ తల, ఈ కాళ్లు, ఈ చేతులు, ఈ పొట్ట తీసివేసి క్రొత్త తల,క్రొత్త కాళ్లు, క్రొత్త చేతులు, వేయవలెనని కొందరు చెప్పిరి. అక్కఱలేదు, మందులువేసి చూచెదము, అవసరమైతే కొంచెముగా తలను, పొట్టను, శస్త్రము చేసెదము. చెడిపోయినవి, పడిపోయినవి, తీసివేసి క్రొత్తవి పెట్టెదము. బిడ్డను బాగుచేసెదము అని కొందరనుచున్నారు. ఏమి తోఁచినది కాదు నాయనా! మొద్దో మొగరమో చూచుకొనుటకైనా లేకుండా ఏమి చేయుదురో అని భయము. రోగము పోవునేమో బిడ్డ బాగుపడునేమో అని ఆశ. ఏమి చేయుదునా అని త్రొక్కులాడుచున్నాను. కడుపుమంట ఆ విధమున బాధ పెట్టుచున్నది. చూచుచుఁ జూచుచుఁ గోయించుటకు చేతులాడవు నాయనా!

ఈ కథలో – కథ చెప్పుచున్న ముసలి స్త్రీ తెలుఁగు.

---

బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరువారు ఇటీవల ప్రచురించిన – అక్కిరాజు రమాపతిరావు సంపాదకుడుగా వెలువడిన 'తొలి మలితరం తెలుగు కథలు' అనే పుస్తకం నుండి...ధన్యవాదాలతో... 43 కథల సంకలనం ఇది. వెల. రు. 250లు. నవోదయ, హైదరాబాదులో లభిస్తుంది.

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

పిట్ట చూపు

చలసాని నరేంద్ర
9849569050

# నిరంకుశ పాలకులకు హెచ్చరిక మాల్దీవుల ఎన్నికలు

సుదీర్ఘకాలం, శతాబ్దాల తరబడి రాజరికంలో, నిరంకుశ పాలనలో మగ్గుతూ మనపొరుగున ఉన్న చిన్న దేశం మాల్దీవులు. అయితే ఆ దేశ ప్రజలు అవకాశం చిక్కినప్పుడల్లా ప్రజాస్వామ్యంపట్ల అచంచలమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. 1965లో బ్రిటిష్ వలసపాలన నుండి విముక్తి చెందినప్పటి నుండి ప్రజాస్వామ్య దేశంగా మనుగడ సాగించడం కోసం ఆ దేశ ప్రజలు ఎన్నో పోరాటాలకు, త్యాగాలకు సిద్ధం కావలసి వస్తున్నది.

తాజాగా జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష నేత ఇబ్రహీం మొహమెద్ సోలిహ్ (ఇబు) ఎన్నిక కావడం ఒక విధంగా ఆశ్చర్యకరమైన అంశమే. ఆయన ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌పై 16.7 శాతం ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మాల్దీవియన్ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన ఆయన 1,34,616 ఓట్లు సంపాదించారు. 'ఇవి ఆనందించే క్షణాలు, ఆశలు పెట్టుకొనే సమయం' అని ఈ సందర్భంగా సోలిహ్ వ్యాఖ్యానించారు. ఆ పార్టీ కార్యకర్తలు పసుపు జెండాలు పట్టుకొని వీధుల్లో విజయోత్సవం జరుపుకొన్నారు.

ఓటమిని అంగీకరిస్తున్నానని, సజావుగా అధికార బదలాయింపు జరిగేందుకు సహకరిస్తానని ప్రస్తుత అధ్యక్షుడు యమీన్ ప్రకటించారు. ఆయన అయిదేళ్ల పదవీ కాలం నవంబర్ 17న ముగియనుండడంతో అనంతరమే సోలిహ్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఏది ఏమైనా ఐదేళ్ల కాలంలో నిరంకుశ పాలన సాగించిన యామీన్ ప్రజాభిప్రాయం ముందు తలొగ్గక తప్పడం లేదు.

తరచూ ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురి కావలసి రావడం, అధికారాన్ని కోల్పోవలసి రావడం జరుగుతున్నది. ఒక సమయంలో సైనికులే తిరుగుబాటు జరిపితే భారత్ జోక్యం చేసుకొని ప్రజాస్వామ్య పునరుద్ధరణకు సహకరించడం జరిగింది. **ఎన్ని ఒడిదుడుకులు ఎదురవుతున్నా ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం కోల్పోక పోవడం గమ నార్హం.**

ఒక విధంగా సోలిహ్ విజయంతో ఈ ప్రాంతంలో ఆధిపత్యం పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న చైనాకు పెద్ద దెబ్బ గానే భావించవచ్చు. ఇంతవరకు అధ్యక్షునిగా ఉన్న యమీన్...చైనా, సౌదీ అరేబియాలకు దగ్గరయి చిరకాల మిత్రదేశమైన భారత్‌పై చిన్నచూపు చూడడం ప్రారంభించారు. చైనా ప్రభుత్వం కోట్లాది రూపాయలు పెట్టుబడి పెట్టేలా ఆహ్వానించారు.

అయితే ఇష్టం వచ్చినట్లు విదేశీ రుణాలు తీసుకోవడంతో దేశాన్ని రుణాల ఊబిలో ముంచేదిగా ఉందన్న ఆందోళన వ్యక్తమవడం ఎన్నికల అంశంగా మారింది. చైనా పెట్టుబడులపై సమీక్ష జరుపుతామని సోలిహ్ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు కూడా. ఆ విధంగా ఈ ఎన్నిక ఒక విధంగా వ్యూహాత్మకంగా భారత్ కు మేలు చేస్తుందని చెప్పవచ్చు.

వ్యూహాత్మక రక్షణ ప్రాంతంలో పాగా వేయడానికి చైనా ప్రయత్నిస్తుండడం భారత్‌తో పాటు, అమెరికాను ఆందోళనకు గురిచేశాయి. సోలిహ్ గెలుపుతో ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశం ఉంది. ఆయన విజయంపై భారత ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. సోలెహ్‌కు అభినందనలు తెలుపుతూ విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది.

ఈ సంవత్సరం ప్రారంభంలో సుప్రీం కోర్టు ముగ్గురు ప్రతిపక్ష నేతలను విడుదల చేయడంతో అధ్యక్షుడు సహించలేక పోయారు. ఇద్దరు న్యాయమూర్తులను అరెస్ట్ చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ఆ విధంగా ఒక విధంగా ప్రస్తుత అధ్యక్షుడు నిరంకుశ పాలన సాగించారు.

ఎన్నికల సందర్భంగా దాదాపు ప్రతిపక్ష నేతలు అందరినీ జైళ్లలోనే ఉంచారు. కొందరు నేతలు దేశం వదిలి పారిపోయారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన సోలిహ్ ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున రిగ్గింగ్, ఇతర అక్రమాలకు పాల్పడ్డారని పోలింగ్ రోజున


ఇబ్రహీం మొహమెద్ సోలిహ్ (ఇబు)

భారత ప్రజలు ఎన్నికల సమయంలో చాల విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పేదలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు పెద్దగా చదువుకోక పోయినా, నిశ్శబ్ద విప్లవం వలే దేశం అంతా కూడబలుక్కొని వ్యవహరిస్తున్నారా అన్నట్లు తెలివిగా ఓట్లు వేస్తున్నారు. మాల్దీవుల ఎన్నికలు మనదేశంలోని పాలకులకు కూడా ఒక హెచ్చరిక కావాలి. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్నాయని, ప్రజలకు తాము తప్ప మరో గత్యంతరం లేదనుకొంటూ అహంకారంతో వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించవలసిందే అని గ్రహించాలి.

ఆందోళన వ్యక్తం చేశారు. అయినా ప్రజలు వత్తిడులకు, నిరంకుశ ధోరణులకు బెదరకుండా, ప్రశాంతంగా తమ తీర్పు ఇచ్చారు. నిరంకుశ పాలనకు స్వస్తి పలికారు.

నేడు ప్రపంచంలో పలుచోట్ల నిరంకుశ ధోరణులు వ్యక్తం అవుతున్నాయి. ప్రజాస్వామ్యానికి ఆశాకిరణంగా కనిపించే అమెరికా వంటి దేశంలో స్వయంగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పత్రికల వారిని నకిలీ వార్తలు వ్రాసే వారంటూ హేళన చేయడం చూస్తున్నాము. ప్రజల మద్దతుతో ఉన్నత పదవులకు ఎన్నికైన వారు వినమ్రతతో, హుందాగా వ్యవహరించాలి. కానీ ఆ విధంగా చేయకుండా ఏకపక్ష ధోరణులతో తాము అనుకున్నట్లే జరగాలి అని మంకు పట్టు పడుతూ ఉండటం ప్రజాస్వామ్య ప్రాథమిక

సూత్రాలనే ఉల్లంఘించినట్లు అవుతుంది.

పౌర సమాజం, పత్రికలూ, రాజకీయ ప్రత్యర్థులు, న్యాయ మూర్తులపై నిరంతరం దాడులు జరిపిన అబ్దుల్లా యమీన్‌పై అవకాశం చిక్కినప్పుడు ప్రజలు ఏ విధంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారో నిరంకుశ పాలకులకు ఒక విధంగా కనువిప్పు కలగాలి. అసలు ప్రజాస్వామ్యం తమకు అవసరం లేదంటూ చైనా వంటి వామపక్ష, నిరంకుశ, రాజరిక దేశాలు మనుగడ సాగించడం వేరే విషయం. కానీ ప్రజాస్వామ్య ప్రక్రియ పట్ల విశ్వాసం ప్రకటిస్తూ, ఆ ప్రక్రియ కారణంగా అధికారం చేపట్టిన వారు ఆ ప్రక్రియను నిర్వీర్యం చేయడం కోసం చేస్తున్న ప్రయత్నాలు నేడు ప్రపంచం అంతటా జరుగుతూ ఉన్నాయి. అవి చాల ఆందోళనకరం అవుతున్నాయి.

మనదేశంలో కూడా ప్రజలు అవకాశం వచ్చినప్పుడు స్పష్టమైన తీర్పు ఇస్తున్నారు. మొత్తం ప్రచార సాధనాలు, అధికార సదుపాయాలు ఉండడంతో తమకు తిరుగు లేదని విర్రవీగే పాలకులకు తగు విధంగా సమాధానం చెబుతున్నారు. అయినా అధికారంలోకి వచ్చిన నేతలు అనుభవాల నుండి గుణపాఠాలు నేర్వకుండా పాత పాలకుల వరవడినే అనుసరిస్తున్నారు. అంతకన్నా మరింత నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. తమకు తిరుగు లేదనుకొని ధీమాతో ఆ విధంగా వ్యవహరించడం ప్రమాదకరమని గ్రహించలేక పోతున్నారు.

ప్రజాస్వామ్యంలో పాలకులు ప్రజలకు జవాబుదారిగా వ్యవహరించాలి. ప్రజలను ఆకర్షణీయ పథకాల మత్తులో జోకొట్టడం ద్వారా తమ పబ్బం గడుపుకొనే ప్రయత్నాలు తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే కలిగించగలవు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మనది అని చెప్పుకొంటున్నాము. కానీ ఏ రాజకీయ పార్టీలో కూడా అంతర్గత ప్రజాస్వామ్యం కనిపించడం లేదు. పలు పార్టీలు ఒకొక్క కుటుంబం సొంత ఆస్తులుగా మారిపోతున్నాయి. **దశాబ్దాల తరబడి ఒకే వ్యక్తి, ఆ వ్యక్తి తర్వాత వారి కుటుంబం వారసులు నాయకత్వం వహించడం ప్రజాస్వామ్యం అనిపించుకొంటుందా ?**

కీలకమైన విధాన పరమైన అంశాలపై ఏ రాజకీయ పార్టీలోనూ అంతర్గత సమాలోచనలు జరగడం లేదు. పార్లమెంటు, శాసన సభలలో సహితం అర్ధవంతమైన చర్చలకు అవకాశమే ఉండటం లేదు. కీలకమైన చట్టాలు ఎటువంటి చర్చలు లేకుండానే ఆమోదం పొందుతున్నాయి. ఆయా చట్టాల గురించి మంత్రివర్గాలలో సహితం తగు విధంగా చర్చలు జరగడం లేదు.

కీలకమైన అంశాలపై సంబంధిత మంత్రుల ప్రమేయం లేకుండా ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రుల వద్ద ఉండే కొందరు అధికారులే విధానపర అంశాలను రూపొందించడం జరుగుతున్నది. రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా పరిగణిస్తున్నారు. అదే విధంగా ప్రతిపక్షాలు సహితం నిర్మాణాత్మకమైన సంప్రదింపులు, చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. నేడు ఏ రాజకీయ పార్టీ కూడా విధానపరమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించడం లేదు. అవకాశవాద రాజకీయ అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి.

ప్రజలకు సేవ చేయడం కోసం కాకుండా వ్యాపార ప్రక్రియగా రాజకీయాలలోకి నేడు భారీ పెట్టుబడులతో వస్తున్నారు. దానితో అధికారం దక్కగానే అందుకు మరిన్ని రెట్లు సంపాదించే ఆలోచనలలో ఉంటున్నారు.

ఈ పరిస్థితులను భారీ కార్పొరేట్ సంస్థలు తమకు అవకాశంగా మలచుకొంటున్నాయి. రాజకీయ పార్టీలకు తాము అందిస్తున్న సహకారానికి ప్రతిఫలంగా తామే విధానపర నిర్ణయాలు తీసుకొని, వారిపై రుద్దగలుగుతున్నారు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కార్పొరేట్ సంస్థల ప్రాబల్యం తగ్గడం లేదు. ఉదాహరణకు విజయ్ మాల్యా 9 వేల కోట్లకు పైగా బ్యాంకులకు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతే అతనిని మీరంటే, మీరు రక్షణగా ఉన్నారని అంటూ అధికార, ప్రతిపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడాన్ని చూస్తున్నాము. మొదటిసారి కాంగ్రెస్, జేడీఎస్ మద్దతుతో రాజ్యసభకు ఎన్నికైతే, రెండోసారి బిజెపి, జేడీఎస్ ల మద్దతుతో ఎన్నికయ్యారు. అంటే అన్ని రాజకీయ పార్టీలు అతని కనుసన్నలలో ఉన్నారని స్పష్టం అవుతున్నది.

అతని విమానాలను రాజకీయ ప్రముఖుల సొంత అవసరాల కోసం క్యాబ్‌ల వలే వాడుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖుల ఇండ్లకు తరచూ వెడుతూ ఉండేవారు. ఆయనగారొస్తే మిగిలిన వారందరిని వదిలి వేసి, లోపల గదిలోకి తీసుకెళ్లి, రాజమర్యాదలుచేసి, కనీసం గంట సేపటి వరకు బైటకు వచ్చేవారు కాదు. నేడు బ్యాంకులకు టోపీ వేసి పారిపోతే ఎవ్వరికి వారుగా భుజాలు తడుముకొంటున్నారు.

అసలు అంత భారీ రుణాలు ఇవ్వడం సరికాదని కిందిస్థాయి అధికారులు స్పష్టం చేసినా ఉన్నతస్థాయిలో రుణాలు జారీ చేశారు. అంటే రాజకీయ వత్తిడుల వల్లనే సాధ్యం అయి ఉంటుంది. ఆ ఉన్నత స్థాయి అధికారులను గాని, వత్తిడులు తెచ్చిన రాజకీయ నాయకులను గాని ఇప్పటి వరకు సిబిఐ ప్రశ్నించిన దాఖలాలు కూడా లేవు. అంటే కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతున్నది.

గతంలో ఎన్నడూ లేని విధంగా గత రెండు దశాబ్దాలుగా కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ విధానాల విషయంలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తున్నాయి. కీలక పదవులలో ఉన్నవారు ప్రైవేట్ కంపెనీల విమానాలలో ప్రయత్నం చేస్తూ ఉండటం, తమ అధికార పర్యటనలలో వారికి ప్రాధాన్యత ఇస్తూ ఉండటం జరుగుతూ ఉంటే నిజాయతీ గురించి ఎవ్వరు ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్ముతారు అనుకొంటే పొరపాటు కాగలదు.

భారత ప్రజలు ఎన్నికల సమయంలో చాల విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పేదలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు పెద్దగా చదువుకోక పోయినా, నిశ్శబ్ద విప్లవం వలే దేశం అంతా కూడబలుక్కొని వ్యవహరిస్తున్నారా అన్నట్లు తెలివిగా ఓట్లు వేస్తున్నారు. మాల్దీవుల ఎన్నికలు మనదేశంలోని పాలకులకు కూడా ఒక హెచ్చరిక కావాలి. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్నాయని, ప్రజలకు తాము తప్ప మరో గత్యంతరం లేదనుకొంటూ అహంకారంతో వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించవలసిందే అని గ్రహించాలి.

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి'**,
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.

ధారావాహిక



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 18. భవ చక్రం–జీవితచక్రం

బుద్ధుడు ఆవిష్కరించిన ప్రతీత్య సముత్పాదం 12 దశల్లో ఉంటుంది. ఈ పన్నెండు దశలు 'భౌతిక ప్రపంచాన్ని విశ్లేషించడానికి కాదు, కేవలం ఆధ్యాత్మిక పరమైన నిర్వాణ మార్గాన్ని సూచించడానికే' అని కొందరు బౌద్ధులు నమ్ముతారు. కొందరు 'లేదు, ఇది కేవలం భౌతిక జగతిని విశ్లేషించడానికే' అంటారు. అయితే, ఈ రెండు విధానాలూ ఇందులో కనిపిస్తాయి.

మనం దీన్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు ఈ 12 దశల్నీ చూద్దాం.

బౌద్ధం చెప్పిన ఈ దశలు – జీవి తల్లిగర్భంలో బీజరూపం పొందక ముందు నుండే మొదలవుతుంది. ఆ తర్వాత పిండరూపం, భ్రూణరూపం, జన్మ, జరామరణం– ఆ తర్వాత పునర్భవం – ఈ దశలన్నీ ఈ 12 దశల్లో ఉంటాయి. అందుకే దీన్ని ద్వాదశాంగాలు అంటారు. అవి....

1. అవిద్య (Ignorance) 2. సంఖారాలు (Activities) 3. విజ్ఞానం(Consciousness) 4. నామ (Mind ) 5. రూప (Body) 6. స్పర్శ (Contact) 7. వేదన (Feelings) 8. తృష్ణ (Craving) 9. ఉపాదన (Clinging) 10. భవం (Becoming) 11. జన్మ (Birth) 12. జరామరణ.

ఈ పన్నెండు దశలు ఒక చక్రంలా ఉంటాయి. అందుకే దీన్ని భవచక్రం అంటారు. 'భవం' అనే పదానికి "జన్మ హరౌ భవౌ" అంటే... 'పుట్టుట' అనీ, 'దీనివలన పుట్టును కనుక ఇది భవం' అనీ అర్థం చెప్పింది అమరకోశం. భవ చక్రం అంటే జన్మచక్రం. లేదా జీవన చక్రం. లేదా పుట్టుపూర్వోత్తరాల చక్రం. ఇప్పుడు ఒక్కొక్కటి చూద్దాం.

**1. అవిద్య (Ignorance)** :

మనం సాధారణంగా విద్య అంటే చదువుకోవడం అనుకుంటాం. కాని ఇక్కడ అవిద్య అంటే విద్య లేకపోవడమో, చదువుకోకపోవడమో కాదు. తెలియకపోవడం, ఎరగకపోవడం.

'జీవశక్తి' మనతో సంధానమయ్యేది ఎక్కడో తెలుసుకోలేం. దాని ప్రారంభం ఎక్కడో కూడా ఎరగలేం. దీన్నే అవిద్య అన్నారు. ఈ జీవశక్తిని వైదిక దర్శనాలు జీవాత్మ అన్నాయి. దేహంతో ఆత్మ కలవడం. కానీ బౌద్ధం దీన్ని అతీతమైన ఆత్మగా కాకుండా ఓ 'జీవశక్తి' గానే భావించింది. ఈ భావనే గొప్ప శాస్త్రీయం. అసలు జీవశక్తి అంటే ఏమిటి? విశ్వంలోని ఆశక్తి ఎలా జీవంగా రూపొందుతుంది?

విజ్ఞానశాస్త్రం ప్రకారం...

ఈ విశ్వం ఒక సజీవ ప్రవాహం. అందులో జీవకోటి ఓ చైతన్య ప్రవంతి. నిర్జీవ పదార్థాల నుండే జీవం పుట్టింది. నిర్జీవ పదార్థాలే జీవిని బ్రతికిస్తూ ఉంటాయి. మనం మనంగా రూపుదిద్దుకుందీ, మనుగడసాగించేదీ ఇలాగే. ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్... ఇలాంటి నిర్జీవ మూలకాలే జీవావిర్భావానికి కారణం. ఈ మూలకాల కలయిక, స్థితి, ప్రదేశం... వీటన్నింటినీ బట్టి ఆ నిర్జీవ మూలకాల్లో జీవం కదలాడింది. జీవం నిర్జీవం నుండి ఎలా వచ్చింది? అసలు అలా వస్తుందా? మనం 'నిర్జీవం, నిర్జీవం' అంటున్న పదార్థం నిజంగానే నిర్జీవ పదార్థమేనా? అని ప్రశ్నించుకుంటే అసలు విషయం కొంత అవగాహన కొస్తుంది.

ఎలాగంటే....

బంగారం నుండి వెండి పట్టీలు వస్తాయా? రావుకదా! అలాగే...నిర్జీవం నుండి జీవం వస్తుందా? రాదు. రానే రాదు. జీవం వచ్చిం దంటే మనం నిర్జీవం అనుకుంటున్న ఆ పదా ర్థాల్లో జీవం అనేది ఉండే ఉండాలి. ఉండి తీరాలి. అయితే అందులోని ఆ 'జీవ' దశ మనకు తెలియక పోవచ్చు. మనకు తెలియనంత మాత్రాన 'లేదు' అనుకోవడం అజ్ఞానం, అవిద్య. నిర్జీవం లోనే జీవం దాగుంటుంది. వ్యవహారంలో తేలిగ్గా అర్థం చేసుకోడానికి 'జీవం', 'నిర్జీవం' అని అంటున్నాం. అనుకుంటున్నాం. అంతే.

మరో ఉదాహరణ చూద్దాం. సూక్ష్మ జీవుల గురించి తెలియని నాడు, మనకు వచ్చే

ఎన్నో రోగాలకు ఏవేవో కారణాలు చెప్పుకున్నాం. మశూచిని ఒక దేవతగా భావించాం. సూక్ష్మదర్శినిని కనుగొన్నాక ఆ రోగాలకు బాక్టీరియాలూ, వైరసులూ అసలు కారణాలని తెలుసుకున్నాం.

సూక్ష్మదర్శిని కనుక్కోకముందు, సూక్ష్మజీవుల గురించి మనకు తెలియకముందు ఈ ప్రపంచంలో సూక్ష్మజీవులు లేవా? మశూచికి అవే కారణాలు కావా? మనకు వాటి గురించి తెలియలేదు కాబట్టి అవి లేనే లేవని అందామా? అనుకుంటామా?

అవిద్య అంటే ఇదే. ఉన్నదాన్ని తెలుసుకోలేక పోవడమే. మనకు అందుబాటులో ఉన్న ప్రమాణాలద్వారా అందుకోలేక పోవడమే అవిద్య. కాబట్టి, ఇక్కడే కార్యకారణ సంబంధం అవసరం అయ్యేది. జబ్బుకి ఏదో ఒక కారణం ఉండాలి? ఆ కారణం మనకి ఇప్పటికి తెలియక పోవచ్చు. అయినా సరే ఉండి ఉండాలి. ఉండి తీరాలి.

ఈ అవిద్య కూడా అంతే..

బౌద్ధం చెప్పిన అవిద్య జీవుల్లో జీవశక్తి ముడిపడే దశగురించి చెప్పింది. ఏం చెప్పింది? ఆ దశ తెలియదని చెప్పింది. ఎందుకు తెలియదంటే ఆ దశే తెలియనిది కదా! అని అంది. బౌద్ధం ప్రకారం ఈ 'జీవశక్తి' మనతో సంధానమయ్యేది ఎక్కడో తెలుసుకోలేం. దాని ప్రారంభం ఎక్కడో కూడా ఎరగలేం. తెలుసుకోలేం కాబట్టి ఆ దశే లేదనా? ఎరగలేం కాబట్టి అసలు ఉండదనా? అంటే అదేం కాదు. ఉంటుంది. ఉండి తీరుతుంది. కానీ మనకు అందదు. మనకు తెలియదు అంతే.

దీనికి ఉదాహరణగా మనం జీవాన్నే తీసుకోవచ్చు. నిర్జీవ సేంద్రియ పదార్థాల్లో జీవం ఎలా పుట్టిందో ఒకప్పుడు తెలియదు. కానీ ఇప్పుడది తెలుసు. ఈ విషయం ఇంతకు ముందు కొంత చర్చించాం. ఇప్పుడు మరో విషయం చూద్దాం.

అవిద్యను తెలుసుకోవాలంటే అవిద్యకు అటూ ఇటూ ఉన్న దశల్ని తెలుసుకుంటే అప్పుడు 'అవిద్య' అనే ఒక అవస్థ ఉన్నట్లు తెలుస్తుంది.. అంతేగానీ దానిలో ఉన్నంత వరకూ దాన్ని వేరుగా మనం తెలుసుకోలేం.

అవిద్య– తెలియనిది అంటే.. 'కుందేటి కొమ్ము'లా లేనిది కాదు. ఉంది. కానీ మనకు తెలియదు.

దీని ప్రారంభం తెలియనప్పటికీ ఇది గతానికీ, భవిష్యత్తుకూ సంబంధించిన అజ్ఞానం అని మాత్రం బౌద్ధం చెప్పింది. 'ప్రతీత్య సముత్పాదంలో తెలియని దశ ఇది' అని కూడా చెప్పింది.

వైజ్ఞానిక శాస్త్ర ప్రకారం అవిద్య అంటే...నిర్జీవ సేంద్రియపదార్థాల్లో చైతన్య పూరితమైన జీవం ఎలా కలుగుతుందో తెలియకపోవడం. బౌద్ధం ప్రకారం అవిద్య అంటే...'జీవశక్తి' మనతో సంధానమయ్యేది ఎక్కడో తెలుసుకోలేకపోవడం. యధాతథ వస్తుజ్ఞానం కలగకపోవడం.

**౨. సంఖారాలు (Activities):**

సంస్కారాలు అంటే కర్మలు. పనులు. కర్మలంటే మనం చేసే పనులు కాదు. అసలు ఈ సృష్టిలో ఉన్న పనులు. ఈ సృష్టిలో లేనిదేదీ మనలో ఉండదు. మనం తింటాం. విశ్రాంతి తీసుకుంటాం. సోమరిగా ఉంటాం. పరిశ్రమిస్తూ ఉంటాం. నిద్రపోతాం. నడుస్తాం. ఆలోచిస్తాం... ఇంకా ఏవైతే చేస్తామో అవన్నీ పనులే. ఈ పనులు మనకి ఎక్కడి నుండి వచ్చాయి. పని అనే ప్రక్రియను మనకు మనం కొత్తగా సృష్టించుకున్నామా? తయారు చేసుకున్నామా? కనుగొన్నామా? కాదు.కాదు. కానేకాదు. ఈ క్రియలన్నీ ఈ ప్రక్రియలన్నీ ఈ విశ్వ లక్షణాలే. అంటే క్రియల్ని మనం క్రియేట్ చేసుకోలేం. మనకన్నా ముందుగా ఉన్న విశ్వలక్షణాలైన క్రియలే మనద్వారా వ్యక్తమవుతున్నాయి. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే క్రియారూపాలం. విశ్వమంటేనే క్రియల క్రీడా స్థలం. ఈ విశ్వలక్షణాల్లో కదలడం, నిలబడడ2o, ఆకర్షించడం, వికర్షించడం, ఆలోచించడం, పరుగులు తీయడం. విస్తరించడం, కుంచించు కుపోవడం, అలసిపోవడం.. ఇలా అన్నీ ఉన్నాయి. అంత మఱ్ఱి చెట్టుకు ఇంత మఱ్ఱివిత్తనం మూలం అయినట్లు– ఈ సంఖారాలన్నీ దానికి ముందరి దశ అయిన అవిద్యలోనే ఉంటాయి.

అవిద్యలో ఉన్నప్పుడు వీటికి ఏలాంటి లక్షణాలూ ఉండవు. కానీ, అవి వ్యక్తం కాగానే అవి 'కుశలం', 'అకుశలం' అని రెండుగా విడిపోతాయి. కుశలమైనవి అయినా, అకుశలమైనవి అయినా అంటే మంచివైనా, చెడ్డవైనా సరే పనులన్నీ అవిద్య నుండే పుడతాయి. ఎందుకంటే మంచి అవిద్య, చెడ్డ అవిద్య అని అవిద్య రెండు రకాలుగా ఉండదు. అలాగే అవిద్యలో మంచీ, చెడులు వేరువేరుగానూ ఉండవు. అంటే వ్యక్తం కావు. అవిద్యనుండి వ్యక్తం అయ్యేప్పుడు అవి మంచీ, చెడులుగా విడిపోతాయి. ఎలాగంటే....

తెల్లని కాంతి గాజుదిమ్మె గుండా బైటకువచ్చినపుడు ఏడు రంగుల ఇంద్ర ధనుస్సులా విడిపోతుంది కదా! అలాగ.

నిజానికి సంఖారాలు అలా భిన్నంగా రాకపోతే.. ఈ విశ్వం ఉనికే ఉండదు. ఈ విశ్వమంతా ఒకే ధర్మం ఆవరించి ఉంటుంది. అలా ఉంటే.. మనం చెప్పుకోడానికి ఏమీ ఉండదు. ఇన్ని పదార్థాలుండవు. ఇన్నిన్ని జీవ జాతులుండవు. అనేకత్వంగా వ్యక్తంకావడమే ఈ విశ్వనిర్మాణ పరిణామ ధర్మం.

ఇలా కుశల, అకుశలాలుగా వ్యక్తం కాకపోతే ఉనికిలోకి రాకపోతే.. ఒకే ఒక దశ ఉంటుందని చెప్పుకున్నాం గదా! దీన్నే 'నిర్వాణం' అంది బౌద్ధం. ఇతర సిద్ధాంతాలు చెప్పే కైవల్యం, మోక్షం, ముక్తి ఇవే. ఈ నిర్వాణం, కైవల్యం స్థితుల్ని చెప్పడం ఒక్క భారతీయ మతాల్లోనే ఉంది.

ఇలాంటి స్థితి ఈ విశ్వానికి శాశ్వతంగా ఉందో, ఉంటుందో, ఉండదో ఇప్పటికి ఇంకా విజ్ఞానశాస్త్రానికి అందలేదు. కానీ, పదార్థాల్లో అలాంటి స్థితి కొంత ఉంది.

ఉనికిలోకి రావడం అంటే.. తనకు తానుగా వ్యక్తం కావడం. అది కుశలంగానా, అకుశలంగానా అనేది వేరే సంగతి. ఎలాగైనా సరే వ్యక్తం కావడమే ఉనికిలోకి రావడం. అంటే ఏదో ఒక లక్షణాన్ని కలిగి ఉండడం అనుకోవచ్చు.

ఇలా...అన్ని పదార్థాల్లో ఉండి, ఒకే లక్షణం ప్రదర్శించే పదార్థ స్థితులు ఉన్నాయా? అంటే..ఉన్నాయి అనే చెప్పాలి. ఈ విషయం తెలియాలంటే మనం పదార్థ నిర్మాణాలకు మూలమైన పరమాణు మూలాల్లోకి వెళ్లాలి.

మనకు ఈనాడు ఎన్నో పదార్థాలు ఉన్నాయి.

ఈ పదార్థాలన్నీ కొన్ని మూలకాల వల్ల ఏర్పడ్డాయి.

ఈ మూలకాలు కొన్ని అణువులతో ఏర్పడ్డాయి.

మరి, ఈ అణువులు కొన్ని పర

మాణువులతో ఏర్పడ్డాయి.

ఇక, ఈ పరమాణువులు ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు లాంటి కొన్ని సూక్ష్మ కణాలతో నిర్మించబడ్డాయి.



( ఒక నిర్మాణంలోకి రాని ఎలక్ట్రాన్లు ,




ప్రోటాన్లు)

(హైడ్రోజన్ అణువు.) ఒక నిర్మాణంలోకి వచ్చినఎలక్ట్రాన్లు , ప్రోటాన్లు

మూలకాల నిర్మాణం చూద్దాం. ఆక్సిజన్ ఉంది. అది మనకి ప్రాణం పోస్తుంది. ఈ ఆక్సిజన్– ఆక్సిజన్ అణువులతో ఏర్పడుతుంది. మరి, ఆక్సిజన్ అణువు ఆక్సిజన్ పరమాణు వులతో ఏర్పడుతుంది. అలాగే... మనం ఇంతకుముందు చెప్పుకున్నట్లు ప్రతి మూలకం, దాని పరమాణువులతోనే ఏర్పడుతుంది.

కార్బన్– కార్బన్ పరమాణువులతో,

హైడ్రోజన్–హైడ్రోజన్ పరమాణువులతో,

బంగారం– బంగారం పరమాణువుల తోనే ఏర్పడతాయి. మూలకానికి ఏ లక్షణం ఉంటుందో, వాటి పరమాణువులకు కూడా ఆ లక్షణమే ఉంటుంది. నిజం చెప్పాలంటే పరమాణువుల లక్షణాల్ని బట్టే మూలక లక్షణం ఉంటుంది.

మట్టితో కడితే మట్టిగోడ అంటాం. రాతితో కడితే రాతిగోడ అంటాం. అలాగే..ఏ పరమాణువులతో నిర్మితమై ఉంటే ఆ పదార్థం అనే అంటాం.

ఉదాహరణకి, ఆక్సిజన్ పరమాణువుల్నే చూద్దాం. అవి మండిస్తాయి. అవి లేకపోతే అగ్నే లేదు. మంటరాదు. కాబట్టి ఆ పరమాణువులతో ఏర్పడ్డ ఆక్సిజన్ కూడా మండిస్తుంది. ఆక్సిజన్ పర మాణువులు పుల్లని రుచిని పుట్టిస్తాయి. కాబట్టి ఆక్సిజన్ కూడా పుల్లటి రుచిని కల్గిస్తుంది. అందుకే ఆక్సిజన్‌ని ఆమ్లజని "పుల్లని పదా ర్థాలకు జనని" అంటారు.

సరే – ఇప్పటి దాకా బాగానే ఉంది. మూలకాలు వాటి వాటి పరమాణువుల ధర్మాల్ని, లక్షణాల్ని ప్రదర్శిస్తాయి అనిగదా చెప్పుకున్నాం. మరి, ఆ పరమాణువులు వేటితో ఏర్పడతాయి?

అవి–ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు, న్యూట్రాన్లు...ఇలా ఇంకొన్ని చిన్న చిన్న కణాలతో ఏర్పడతాయి అని గదా చెప్పుకున్నాం.

సరే, ఆక్సిజన్ మూలకం ఆక్సిజన్ పరమాణువులతో ఏర్పడింది. మరి, ఆ ఆక్సిజన్ పరమాణువు 'ఆక్సిజన్ ఎలక్ట్రాన్లు, ఆక్సిజన్ ప్రోటాన్లు, ఆక్సిజన్ న్యూట్రాన్ల'తో ఏర్పడిందా?

ఇదే అసలైన ప్రశ్న. ఇక్కడ అవసరమైన ప్రశ్న.

అంటే...ఈ ప్రశ్నకి 'లేదు, కాదు' అనే సమాధానం చెప్పాలి.


ఆక్సిజనే కాదు, ఏ మూలకమైనా సరే ఒకే రకమైన ఎలక్ట్రాన్లతో, ఒకే రకమైన ప్రోటాన్లతో, ఒకే రకమైన న్యూట్రాన్లతోనే ఏర్పడుతాయి. ఆక్సిజన్‌లో ఉన్నా, హైడ్రోజన్‌లో ఉన్నా, కార్బన్‌లో ఉన్నా, బంగారంలో ఉన్నా, యురేనియంలో ఉన్నా.. ఎందులో ఉన్నా సరే ఎలక్ట్రాన్లన్నీ ఒకే ధర్మం కలిగి ఉంటాయి. అలాగే ప్రోటాన్లన్నీ ఒకే ధర్మం కలిగి ఉంటాయి. న్యూట్రాన్లు కూడా అంతే...

ఆక్సిజన్ ఎలక్ట్రాన్లు, కార్బన్ ఎలక్ట్రాన్లు, బంగారం ఎలక్ట్రాన్లు, హైడ్రోజన్ ఎలక్ట్రాన్లు అని వేరు వేరు ఎలక్ట్రాన్లు ఉండవు.

అలాగే...ఆక్సిజన్ ప్రోటాన్లు, కార్బన్ ప్రోటాన్లు, బంగారం ప్రోటాన్లు, హైడ్రోజన్ ప్రోటాన్లు, అని వేరు వేరు ప్రోటాన్లూ ఉండవు.

ఎలాంటి ప్రత్యేక ధర్మాలు (విడివిడి ధర్మాలు) లేని ఎలక్ట్రాన్ల, ప్రోటాన్ల నుండి విభిన్న ధర్మాలు గల మూలకాలు పుట్టాయి.

నిజం చెప్పాలంటే కుశల, అకుశల ధర్మాలు కూడా ఇలాగే పుట్టాయి. కుశల, అకుశల ధర్మాలు లేని 'అవిద్య' అనే స్థితి, ఏలాంటి లక్షణాలులేని ఎలక్ట్రాన్ల, ప్రోటాన్ల స్థితి లాంటిదే.



అణువుల నుండి అనంత జీవరాశి

ఈ భౌతిక స్థితి కూడా కేవలం ఎలక్ట్రాన్లుగానో, ప్రోటాన్లుగానో ఉండి ఉంటే, అవి ఏదో ఒక మూలకంగా వ్యక్తం అయ్యేవే కావు. ఉనికిలోకి వచ్చేవే కావు. అంటే పదార్థంగా రూపొందేవి కావు.

ఉనికిలోకి రావడమంటేనే తన సొంత ధర్మాలతో రావడం. అవి కుశల, అకుశలాలు కావడం.

ఆధునిక భౌతికశాస్త్రం తెలియక పోయినా, ప్రతీత్యసముత్పాదం ప్రకారం ఇలాంటి స్థితి ఒకటి ఉంటుందని తాత్త్వికంగా ఊహించి శాస్త్రీయంగా చెప్పడం ఎంతో గొప్ప విషయం. బౌద్ధానికున్న శాస్త్రీయ దార్శనికతకు ఇంతకంటే గొప్ప తార్కాణం మరొకటి ఉంటుందా?

ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు వేరు వేరు పదార్థాల్లో వేరు వేరుగా లేవుగదా! ఐతే... వేరు వేరు పదార్థాలు ఎందుకు వచ్చాయి? అనే దానికి ఆధునిక సమాధానం ఉంది. మూలకాల్లో కలిసి మెలిసి ఉన్న ఎలక్ట్రాన్ల, ప్రోటాన్ల సంఖ్యను బట్టి ఆ తేడా వచ్చిందని తేల్చారు. ఈనాటి ఆధునిక విజ్ఞానశాస్త్రం ఆ మూలలవరకు పోగలిగింది. అయితే బౌద్ధం ఒక తత్త్వం కాబట్టి– 'అవిద్య'తోనే ఆగిపోయింది. అయితే, అవిద్య ప్రారంభస్థానం తెలియదు అని చెప్పింది. అంటే అవిద్యను 'ఇంతే' అని 'ఇక్కడి నుండే' అని తేల్చి పారే యలేదు. గిరిగీసి గిరిలో పెట్టలేదు. ఇంకా లోతుగాపోయి దాని మూలాలు కనుక్కోవచ్చు అని చెప్పకనే చెప్పింది.

భౌతిక ప్రపంచంలో 'ఎలక్ట్రాన్, ప్రోటాన్ల' దశ – బౌద్ధంలో అవిద్య 'దశ' లాంటిదే. అని తెలుసుకున్నాం.

అని తెలుసుకుంటూ ఉండగానే మనలో

చాలామందికి ఒక విషయం స్మృతిపథంలో మెలగొచ్చు. అదే 'నిర్గుణం'. ఆదిశంకరుడు చెవికి శంఖం కట్టుకొని కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాకా ఊదిన విషయం ఇదే. 'నిర్గుణబ్రహ్మ'. కొన్ని ఉపనిషత్తులూ ఈ 'నిర్గుణ' భావాన్ని తీసుకున్నాయి.– ఈ నిర్గుణభావం బౌద్ధంలోని 'అవిద్య' నుండి మక్కీకి మక్కీ దించేసిందే. శంకరుడు ప్రచ్ఛన్నబౌద్ధుడు అయ్యిందీ ఇందుకే.

పరమాత్మ సద్గుణుడా? దుర్గుణుడా? మనమంతా పరమాత్మనుండే పుడితే, మనలో కొందరు మంచివాళ్ళు, కొందరు చెడ్డవాళ్ళు ఎందుకయ్యారు? చెడ్డవాడు చేసిన చెడ్డకు బాధ్యత ఆ జీవునిదా? లేదా పరమాత్మదా? ఎవరిది? ఆ జీవునిది ఎలా అవుతుంది?–

ఒకవ్యక్తి ఒక కత్తితో ఒక వ్యక్తిని చంపితే ఆ తప్పు కత్తిదా? కత్తితో పొడిచిన వాడిదా? నాదేం తప్పు లేదు. కత్తే అతనిని చంపింది అని వాడంటే సరిపోతుందా?

మరి అది సరేపోనప్పుడు, మనం పరమాత్మ చేసిన వాళ్ళమే అయినప్పుడు, అతని చేతిలో కీలుబొమ్మలం అయినప్పుడు మన తప్పొప్పులకు బాధ్యత మనదెలా అవుతుంది? అని నిలదీస్తే పరమాత్మ ఉనికికే ప్రమాదం వస్తుంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టి దీన్నుండి పరమాత్మను రక్షించడం కోసం శంకరుడు బౌద్ధంలోని భౌతికవాదాన్ని తీసుకొని పరమాత్మకు జోడించాడు. పరమాత్మ సద్గుణుడు కాదు. దుర్గుణుడూ కాదు. ఏలాంటి గుణాలు లేని 'నిర్గుణుడు' అన్నాడు. ఈ నిర్గుణత్వాన్ని నిరూపించడానికే 'అద్వైతం' పుట్టింది. అద్వైతం అంటే రెండు కానిది. అంటే ఒకే ఒక్కటి అని. ఒకే ఒక్క ధర్మం నుండి ఈ బహుగుణాల ప్రపంచం వ్యక్తమయ్యింది అని ఆత్మవాదాన్ని బ్రతికించాడు శంకరుడు.

నిజానికి 'అద్వైతం' , ఆత్మవాదం 'వ్యక్తి' కి (భగవంతునికి) సంబంధించింది.

బౌద్ధంలోని 'అవిద్య' భౌతిక వాస్తవికతకి సంబంధించినది.

ఇలా అవిద్య నుండి పుట్టిన కుశల, అకుశల కర్మలు అంటే సంస్కారాలు 3 రూపాల్లో మనోవాక్కాయ కర్మలుగా వ్యక్తమవుతూ ఉనికిలోనికి వస్తాయి. అవి .

1. మానసికమైన కర్మలు. 2. వాక్కులు (మాటలు). 3. శారీరక కర్మలు.– కర్మలు ఈ మూడు రూపాల్లో ప్రపం చానికి ఉనికిని కలిగిస్తాయి.

ఈ కర్మలన్నీ లేదా ఈ సంస్కారాలన్నీ లేదా ఈ సంఖారాలన్నీ 'అవిద్య' అనే స్థితిలో మనకు తెలియకుండా ఉన్నవే. వ్యక్తంకాకుండా ఉన్నవే. అవి, వ్యక్తం కాకపోవడమే 'అవిద్య'. వ్యక్తం కావడమే 'సంస్కారం'.

సంస్కారమంటే నడవడిక. నడత. మంచీ చెడులు.

**3. విజ్ఞానం (Consciousness) :**

విజ్ఞానం అంటే ఒక అర్థం ఎరుక.మరో అర్థం చైతన్యం. బౌద్ధంలో మొదటి అర్థం పారమార్థికం.రెండోది పదార్థవాదం .

విజ్ఞానం అనే పదానికి నిర్వచనం "దీనిచేత ఎరుగబడును" కాబట్టి ఇది విజ్ఞానం అని అమరకోశం చెప్పింది.

కాబట్టి విజ్ఞానం అంటే తెలుసుకొనే సాధనం అన్నమాట. దేనిసహాయంతోమనం తెలుకుంటామో అదే విజ్ఞానం.

మనం ఇంతకుముందే చెప్పుకున్నాం –

కుశల, అకుశలాలు లేని అవిద్య, కుశల, అకుశల సంఖారాలుగా ఉనికిలోకి వచ్చింది అని. ఐతే..

ఈ ఉనికి ఎవరి ద్వారా తెలుస్తుంది? దాన్ని తెలుసుకునే చైతన్యస్థితి ఏమిటి? అని ప్రశ్నించుకుంటే..వాటికి తగిన జవాబులు ఇవి, ఈ ఉనికి విజ్ఞానం ద్వారా తెలుస్తుంది. దీన్ని ఎరిగే చైతన్య స్థితే విజ్ఞానం అని.

మరైతే...ఈ తెలుసుకునే స్థితి ఎక్కడిది?

అదేమన్నా ప్రత్యేకంగా ఎక్కడినుండో కొత్తగా ఊడిపడిందా?– అంటే...లేదు. అదెక్కడినుండో స్వతంత్రంగా ఊడిపడలేదు.

అది, 12 అంగాల్లో రెండోదైన సంఖారాల నుండే పుట్టుకొచ్చింది. కొమ్మకు ఇగురు కొత్తగా ఎక్కడినుండో వస్తుందా? లేదు. ఆ కొమ్మలోనే ఉంటుంది కదా!

అలాగే – ఈ విజ్ఞానం కూడా సంఖారాల నుండే మొలకెత్తుతుంది. కుశల, అకుశల కర్మల వల్ల 'ఉనికి'ని ఏర్పాటు చేసుకున్న ఒక వ్యక్తి లేదా ఒక జీవి – లేదా ఒక పదార్థస్థితి – తనకు తానుగా ఒక ప్రత్యేక జీవిగా, ప్రత్యేక వ్యక్తిగా, ప్రత్యేక స్థితిగా వ్యక్తీకరించుకొనే జీవిత ప్రవాహ బీజాలు ఈ 'చైతన్యం'తోనే మొలకెత్తుతాయి.

తెలుసుకోవడం అంటే అనుభూతి చెందడమే.

తాకి తెలుసుకొనకపోతే గట్టిదనం, మెత్తదనం, వేడి, చల్లదనం అనే స్పర్శ అనుభూతులు లేవు.

చూసి తెలుసుకొనకపోతే పొడవు, పొట్టి, నలుపు, తెలుపు, ఎరుపు లాంటి దృశ్య అనుభూతులుండవు.

నాలుక మీద వేసుకోక పోతే తీపి, పులుపు, వగరు, చేదు ల్లాంటి రుచులు తెలియవు.

అలాగే ఇతర అనుభూతులు. అంటే తెలుసుకోకపోతే అనుభూతులుండవన్నమాట.


ఈ తెలుసుకోవడం ఒక్క జంతు జాతుల లక్షణమే కాదు. జీవ లక్షణం. మొక్కలుకూడా తెలుసుకుంటాయి. ఎండ ఎటు ఉందో తెలుసుకుని అటువైపుకే వంగి పెరుగుతాయి. రోజూ తన ఆలనా పాలనా చూసే యజమానిని గుర్తిస్తాయి. ప్రేమిస్తాయి. నీరుపోస్తే నవ్వుతాయి. నరికితే ఏడుస్తాయి. తన సంతానాభివృద్ధికి ఎనలేని జాగ్రత్తలు తీసుకుంటాయి.

అంటే...విజ్ఞానం అనేది విశ్వలక్షణం. తనగురించి తాను తెలుసు కోవడం. ఈ తెలుసుకోవడం ఈ మూడోదశలో జరుగుతుంది.

బౌద్ధం ఇతర ప్రపంచం గురించి చర్చించలేదుగాని, 'పునస్సంధివిజ్ఞానం' గురించి చర్చించింది.

శుక్ర(మగ), అండ(స్త్రీ) కణాల కలయికతో ఈ 'పునస్సంధి విజ్ఞానం' లేదా చైతన్యం కల్గుతుంది అని చెప్పింది. అంటే పూర్వజన్మల తాలూకు ఎరుక పుట్టుకొస్తుంది అని చెప్పింది.


ఇక్కడ మరలా రెండు అడుగులు వెనక్కు వెళ్ళి గత విషయాన్ని ఓసారి గుర్తు చేసుకుందాం. పూర్వజన్మ అంటే ఆత్మ మళ్ళీ మళ్ళీ పుట్టడం కాదు. ఆత్మ వేరే శరీరాన్ని ధరించడం కాదు. ఇక్కడ పునర్జన్మ అంటే గతజన్మ జ్ఞానం డి.ఎన్.ఎ. ద్వారా తరతరాలకు సంక్రమించడం. దీన్నే 'సహజాత లక్షణాలు' అంటాం.




జీవకణంలో క్రోమోజోములు

పదార్థం ఉనికిలోకి రాగానే, అది తన సహజాత జ్ఞానాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది. ఎందుకంటే జీవం ఇంకా ప్రాథమిక దశలోనే ఉందికాబట్టి. ఈ ప్రాథమిక దశలో ఆ జీవికి సంబంధించిన సమాచారం అంతా తొలిగా పుట్టదు.ఎందుకంటే..అది ఒక అసంపూర్ణ దశ కాబట్టి. ఉదాహరణకి మనిషినే తీసుకుందాం. మనిషి ఏ జీవకణంలో నైనా 23 జతలు(46) క్రోమోజోములుంటాయి. అలా లేకపోతే అది మానవదేహాన్ని నిర్మించలేదు. పొరపాటున ఒక జత పెంచామనుకోండి. అప్పుడు ఆ జీవకణాలు నిర్మించేది మనిషినికాదు. ఒక గొరిల్లాని. కాబట్టి మన శరీరంలోని ఏ కణంలో అయినా 46 క్రోమోజోములుంటాయి.ఆడ,మగ ఇద్దరిలో 46 క్రోమోజోములే ఉంటాయి. వీటిలో 44 క్రోమోజోములు(22 జతలే) ఒకే రకమయిన క్రోమోజోములు. ఆ చివరి ఒక్క జత క్రోమోజోములవల్లే లింగ భేదం కలుగుతుంది. ఆడవారిలోని అండకణాల్లో మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు 23 జతలకు బదులు 23 క్రోమోజోములే ఉంటాయి. అలాగే, మగవారి శుక్రకణంలో కూడా 23 జతలకు బదులు 23 క్రోమోజోములే ఉంటాయి. అంటే సగం మాత్రమే ఉంటాయన్నమాట. అందుకే ఇవి పరిపూర్ణ కణాలు కావు.అందుకే ఆ దశ అసంపూర్ణ దశ. కాబట్టి దానిలో పూర్తి సమాచారం ఉండదు. ఇది పదార్థం ఉనికిలోకి వచ్చిన తొలి దశ. ఇప్పుడు చూడండి..

తండ్రిలోని శుక్రకణం పూర్తి మానవ జీవకణం కాదు. అది సగం క్రోమోజోములున్న అర్ధకణమే. అది రాబోయే కాలంలో ఆడగా పుడుతుందా? మగగా పుడుతుందా? మంచి లక్షణాలున్న జీవిగా పుడుతుందా? ఏయే కర్మలు చేస్తుంది? అనే విషయాలకీ దానికీ సంబంధమే లేదు. కేవలం అది ఒక '$x$ ,$y$ ' క్రోమోజోములున్న మగకణం మాత్రమే. అది అలాగే ఉనికిలోకి వచ్చింది.



లైంగిక క్రోమోజోమ్

(మనలో ఉండాల్సినవి 46 క్రోమోజోములు గదా! ఇందులో 44 క్రోమోజోములు స్త్రీ పురుషుల్లో సమానంగా, ఒకే మాదిరిగా ఉంటాయి. వాటితోపాటు $x$ అనే ఒక పెద్దసైజు క్రోమోజోము, $y$ అనే ఒక చిన్న సైజు క్రోమోజోము ఉంటాయి. మగ వారిలో 44 క్రోమోజోములతోపాటు $x+y$ క్రోమోజోములు రెండూ ఉంటాయి. కాని ఆడవారిలో 44 క్రోమోజోములతో పాటు $x+x$ క్రోమోజోములే రెండూ ఉంటాయి.)

**46 (23 జతల) క్రోమోజోములు**

అలాగే.. స్త్రీలో కూడా ఒక అండ కణం పుడుతుంది. అదీ సగం క్రోమోజోములున్న కణమే. అదీ పూర్తి మానవకణం కాదు. రాబోయే జన్మ ఆడా? మగా? అనేది దానికీ సంబంధం లేని విషయమే.(సంయోగ కాలంలో శుక్ర కణంలోని $x$ క్రోమోజోము వెళ్ళి అండకణంలో కలిస్తే ఆడజీవి, $y$ క్రోమోజోము కలిస్తే మగ జీవి కలుగుతాయి.)

అయితే- ఈ రెండు కణాలూ గతజన్మల తాలూకు అనంతమైన విజ్ఞానాన్ని డి.యన్.ఏ రూపంలో మోసుకొస్తున్నాయి.-

ఇలా గత అనుభవసారాల్ని మోసుకొచ్చిన ఈ రెండు కణాల కలయికతో- ఒక పరిపూర్ణజీవి ఏర్పడుతుంది.

'నేను' అని చెప్పుకొనే ఒకదశ ప్రారంభమవుతుంది. శుక్ర కణానికిగానీ, అండ కణానికి గానీ 'నేను' అని చెప్పుకునే స్థితిలేదు.


'నేను' అని చెప్పుకొనే ఈ స్థితిని **జైగోట్ స్థితి** అని విజ్ఞానశాస్త్రంలో అంటాం.

**వునస్సంధి విజ్ఞానం** అంటే తిరిగి కలసిన విజ్ఞానం అని బౌద్ధంలో అంటాం.

ఈ దశను ఒక వ్యక్తి ప్రత్యేక జీవిత ప్రవాహానికి సంబంధించిన చేతనగా బౌద్ధంలో చూడగలం.

అనంతంగా ప్రవహిస్తున్న విజ్ఞానం (ఎరుక)- స్త్రీ, పురుషుల్లో రెండు సగాలుగా (క్షయకరణం చెంది) విడివడి- తిరిగి ఒకటిగా కలుసుకున్నాయి. అలా కలవడంతో- జీవి ఎరుకలోకి వస్తుంది.

మానవుల్లోనే కాదు ఏ జీవి శుక్ర కణంలో అయినా, అండ కణంలో అయినా ఆ జీవికి ఉండాల్సిన క్రోమోజోముల్లో సగమే ఉంటాయి. సగం క్రోమోజోములున్న ఏ కణం- ఆ జీవి జీవకణం కాలేదు. కానీ, ఆ రెండూ- ఇటు అండం, అటు శుక్రకణం కలవగానే





ఆయాజీవుల ఉనికి ప్రారంభం అవుతుంది. అదే జీవచైతన్య ఉనికి.

స్త్రీ అండ కణం



శుక్ర కణం



జైగోట్ ( సంయోగ బీజ కణం)

'పునస్సంధి విజ్ఞానం' అనే పదం ద్వారా స్త్రీ, పురుష బీజకణాల స్వరూప, స్వభావాల్ని అవి కలవగా ఏర్పడ్డ ఫలదీకరణం చెందిన జైగోట్ (సంయుక్త బీజకణం) స్థితిని- తాత్త్వికంగా, మార్మికంగా మనకళ్ళముందుంచింది బౌద్ధం.

ఇక్కడ బౌద్ధం చెప్పిన మహత్తరమైన అంశం మరోటుంది.


అదేమంటే...

'ఈ దశలో అంటే ఈ ద్వాదశాంగాల్లోని మూడోదైన విజ్ఞాన దశలో, పునస్సంధి విజ్ఞానమే కలుగుతుంది. కానీ, "నేను" అనే ఎరుక ఇంకా రాదు ' అనేది.

ఇక్కడ 'నేను' అంటే జ్ఞానేంద్రియాలు కలగడం. తనకు తానుగా జ్ఞానాన్ని సంపాదించుకోవడం.

బౌద్ధంలో ...జ్ఞానం అంటే తనకు తాను తెలుసుకునేది. విజ్ఞానం అంటే తరతరాలుగా అందేది.

ప్రతిజీవి తల్లి కడుపులో శుక్ర, అండ కణాలు కలిశాక, కొంతకాలం ఒక మాంసం ముద్దలా పెరుగుతుంది. ఈ మాంసంముద్దనే 'పిండం' అంటాం. పిండం అంటే 'ముద్ద' అనే.



ఇలా ముద్దలా పెరిగే ఏ ముద్దా ఆ జీవి ఆకారం గాని, అవయవాలుగానీ కలిగి ఉండదు. ఇతర జీవుల్లో అటుంచి– మానవుల్లో ఈ దశ 2 నెలలు కొనసాగుతుంది. దీన్ని పిండదశ అంటాం. ఈ దశలో అసలు గర్భం వచ్చిందో రాలేదో తల్లి కూడా తనకు తాను తెలుసుకోలేదు. గర్భాశయంలో ఒక ముద్దలా పెరుగుతూ ఉంటుంది. కానీ, మానవ ఆకారం రాదు. నిజం చెప్పాలంటే 'పేగుబంధం' ఏర్పడదు. అందుకే 3 నెలల్లోపు అబార్షన్ చేయించుకుంటే తల్లికి ఏలాంటి ఇబ్బందీ ఉండదు.

### మానవ పిండం

ఆ మాంసం ముద్ద రాబోయే కాలంలో మానవరూపమే పొందుతుంది. కాని, దానిలో ఆ ఆకారానికి సంబంధించిన ఏ అవయవం మొలకెత్తదు. మెదడు, గుండె, ఇతర అవయవాలు, జ్ఞానకేంద్రాలు తయారు కావు.–

మానవ జీవిత ప్రవాహం చేతనలోనే దాగి ఉంటుంది. అందుకే ఈ పిండంలో ఉన్న పునస్సంధి విజ్ఞానం శుద్ధమైంది. ఏలాంటి లాలనలకు, ద్వేషాలకు, మోహాలకు లోను కానిది అంది బౌద్ధం.

ఆ తర్వాత 3 నెలల తర్వాత మానవ జ్ఞానానికి చెందిన అవయవాలు ప్రత్యేకంగా పుట్టుకొస్తాయి. అవి ఈ మూన్నెళ్ళు ఈ పిండంలోనే అవ్యక్తంగా ఉంటాయి. నెమ్మదిగా వ్యక్తమవుతాయి. అలా వ్యక్తమయ్యేది నాలుగోదశ. నామరూపదశ.

(తరువాయి 48వ పుటలో...)

## ఢిల్లీ – ఏ.ఇ.ఎస్.ప్రసాద్ నగర్‌లో తెలుగు భాషాదినోత్సవం



దేశ రాజధాని ఢిల్లీలోని ఆంధ్ర విద్యాసంఘ డా: బి.వి నాథ్, టి.ఆర్.రావు మెమోరియల్ సీనియర్ సెకండరీ స్కూల్, ప్రసాద్ నగర్‌లో తెలుగుభాషా దినోత్సవం కన్నుల పండుగగా జరిగింది. విద్యార్థులు ఆలపించిన "మాతెలుగు తల్లికి మల్లెపూదండ" ప్రార్థనా గీతంతో ప్రారంభమైంది. ఢిల్లీ విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు గంపా వెంకటరామయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు భాషను ఏవిధంగా రక్షించుకోవాలో వివరించారు. పాఠశాల స్థాయిలో తెలుగును ఏవిధంగా అభివృద్ధి చేయాలో, విద్యార్థులకు తెలుగు పట్ల ఏవిధంగా మక్కువ కలిగించాలో ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లితండ్రులకు వివరించారు. మాతృభాష ఆవశ్యకతను, మాతృభాషపట్ల ఉండవలసిన మమకారాన్ని వివరించి, విద్యార్థులకు దిశానిర్దేశం చేసారు. ఏభావాన్నైనా మాతృభాషలో సరళంగా శ్రమ లేకుండా వ్యక్తీకరించగలమన్నారు. దేశరాజధాని నడిబొడ్డున ఆంధ్రవిద్యాసంఘం తెలుగు భాషౌన్నత్యానికి చేస్తున్న కృషిని కొనియాడారు.ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషకు సాటిరావన్నారు. భాష అంతరించి పోకుండా కాపాడవలసిన బాధ్యత తెలుగు వారందరిపై ఉందన్నారు. పాఠశాల విద్యార్థుల యొక్క పద్యపఠనాలు, ప్రసంగాలు అద్భుతంగా ఉన్నాయని, గురజాడ మొదలుకొని శ్రీశ్రీ వరకు అందరికవుల రచనలను వివరించారని విద్యార్థులను అభినందించారు.


విశిష్టఅతిథి సి.భీమన్న మాట్లాడుతూ తెలుగు భాషను నేర్పడంలో ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థుల తల్లితండ్రులు కూడా బాధ్యత స్వీకరించాలన్నారు. చిన్నప్పటినుండే తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు అలవాటు చేయాలన్నారు. తెలుగు భాష ఉన్నతికి ఆంధ్ర విద్యాసంఘం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. మాతృభాషలో సంభాషించడం గొప్పదనంగా విద్యార్థులు భావించాలన్నారు. తెలుగువారు ఎక్కడ కలిసినా, ఎప్పుడు కలిసినా తెలుగులో మాట్లాడవలసిన ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు నాటకాలను అద్భుతంగా ప్రదర్శించారని, విద్యార్థులను అభినందించారు. వ్యవహారిక భాష ఫలితంగానే తెలుగులో ఉన్న సాహితీ ప్రక్రియలన్నీ మనం చదువుకునే వీలుకలిగిందని, సాహిత్యసారాన్ని మనం గ్రహించగలుగుతున్నామన్నారు.

ప్రిన్సిపల్ ధనలక్ష్మి వైస్ ప్రిన్సిపల్ ఉమాపతి నాయుడు తన సందేశంలో తల్లితండ్రులు పిల్లలతో ఇంటివద్ద మాతృభాష అయిన తెలుగులోనే మాట్లాడాలని సూచించారు. తెలుగు పద్యాల గొప్పతనాన్ని తెలుపుతూ వేమన పద్యాలు ప్రపంచంలో అన్ని భాషలలోకి తర్జుమా అయ్యాయన్నారు. పద్యం అనేది తెలుగు భాషకు మాత్రమే సంబంధించినదని, మరే భాషలలోనూ లేదన్నారు. పద్యాల కూర్పులో లయ ఉంటుందన్నారు. విద్యార్థులు ఇంత అనర్ఘళంగా తెలుగులో మాట్లాడడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. ఎవరైతే మాతృభాషను క్షుణ్ణంగా నేర్చుకోగలుగుతారో వారు ఇతర భాషలను సులభంగా నేర్చుకోగలుగుతారన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ వ్యవహారికోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత విశేషాలను, సవర భాషకు ఆయన చేసిన కృషిని గురించి వివరించారు. ఆయన పోరాట ఫలితంగానే మనం మాట్లాడుతున్న భాషను ఈరోజు పుస్తకాల్లో చూడగలుగుతున్నామన్నారు."దేశభాషలందు తెలుగులెస్స", "హద్దులు,హద్దులు", "కవిసమ్మేళనం" నాటకాలు అలరించాయి. విద్యార్థులు పాడిన "మాతెలుగు తల్లికి మల్లె పూదండ",తెలుగు భాష తీయదనం, "చక్కెరకలిపిన తీయని కమ్మని తోడు పెరుగు తెలుగు" పాటలు ఆహూతులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన పదవతరగతి విద్యార్థులు సాహితి,ప్రసన్న, తులసి, ప్రణవి, దక్షలను అతిథులు అభినందించారు. తెలుగు శాఖాధిపతి దాకే ప్రదీప్ కుమార్ వందన సమర్పణ చేశారు.

పుస్తక సమీక్ష

రామడుగు వెంకటేశ్వర శర్మ
9866944287

# అమ్మనుడికారాలకు గుడి- ఆచార్య బేతవోలు వారి 'శమంతకమణి'




ఆధునికాంధ్ర సాహిత్యలోకంలో పేరెన్నికగన్న ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు. ఈ ఏడాది జనవరిలో "శమంతకమణి" అన్న పేరుతో రసజ్ఞ మనోజ్ఞంగా అయిదా శ్వాసాల గద్య పద్య కావ్యాన్ని రచించారు. ఈ కావ్యంలో దాదాపుగా ప్రతి గద్యంలోనూ, పద్యంలోనూ సంస్కృత భాషా పద సమాస వాక్య విన్యాసాలతోపాటు మధ్య మధ్యలో దేశీయమైన , అచ్చమైన తెలుగమ్మ పలుకుబడి-రత్నహారంలో ముత్యాల కొలికి పూసలా కనిపిస్తూనే ఉంటుంది. ఈ కావ్య రచన ద్వారా అనేక రూపాల్లో ఆ పలుకుబడిని పెంచారు- అందరూ మెచ్చేలా. ఈ కావ్యంలో ఆయన అమ్మనుడికి ఎంతగా పెద్దపీటవేశారో స్థాలీపులాక న్యాయంగా పరిశీలించడమే ఈ వ్యాసోద్దేశం.

సాధారణంగా తెలుగువాడు- ఎవడైనా గిట్టనివాడో, కొత్తవాడో తన ఇంట్లోకి ప్రవేశించి, తిష్ఠ వేసుక్కూర్చున్నప్పుడు "ఇదేమైనా నీ బాబుగాడి ఇల్లా? అత్తవారిల్లా?"ఇత్యాదిగా కఠినంగా మాట్లాడుతూ ఉంటాడు. సరిగ్గా ఆ తెలుగు 'వాడి' తనాన్నే -ఈ కావ్యంలో-శ్రీ కృష్ణుడు శమంతకమణికై జాంబవంతుని గుహలోకి ప్రవేశిస్తున్నప్పుడు ఆయనతో జాంబవతి చెలికత్తెలు "దంతావళము రీవి దయసేయుచుంటి వాఁగాఁగు నీకిద్దియత్తమ్మ యిల్ల? మృగరాట్కిశోరంపు మగటిమి నేతెంతు వౌరౌర! నీకు నమ్మమ్మ యిల్ల?... పిన్నమ్మయిల్ల?...నానమ్మయిల్ల?...(2ఆ-71ప) అని సీస పద్యంలో "అడ్డమాకయు" (ఈ జంటపదంఈ సీస పద్యం ఎత్తు గీతిలో ఉంది) లేకుండా మాట్లాడినట్లుగా విశేషంగా ప్రదర్శించారు, ఈ కవి.

తెలుగు వాడెవడి సౌందర్యా న్నైనా ప్రశంసించాల్సి వచ్చినపుడు "వాడా? మన్మధుడిలాంటి వాడె కాదు-ఇంకా మాట్లాడితే వాడి బాబు లాంటివాడు" అని అంటూ ఉంటాడు. సరిగ్గా అటువంటి పలుకుబడినే శ్రీ కృష్ణ విరహ వేదనాత్మయైన జాంబవతి - తన చెలికత్తెయైన ఇందుమతితో మాట్లాడే సందర్భంలో "ఏమో! యయ్యతి సుందరుండతఁడు తానే యొక్క పంచాస్త్రుఁడింకా మాట్లాడిన వాని బాబనుట సత్యంబు...?(3ఆ-36ప) ఇత్యాదిగా ప్రయోగించి పెద్దపీట వేశారు.

ఏదైనా ఒకవిషయాన్ని కొలతలతో అతిశయోక్తిగా చెప్ప దలచుకున్నప్పుడు "ఓ అంగుళమైనా దాటలేడు- ఓ అరంగుళ మైనాచేరలేడు-ఓ అడుగైనా కదలలేడు" అని అంటూ ఉంటాడు- తెలుగువాడు. అదిగో!- అలా జాంబవతి తన చెలికత్తె ఇందుమతితో" ఆయన చూపు సోకనియరంగుళమైన శరీరమందు లేదాయె..."(3 ఆ-33ప) అని సరిగ్గా తెలుగు యువతిగానే పలికింది- "అరంగుళమైన" అన్న అమ్మనుడిని వాడుతూ. పైగా ఈ "అరంగుళ" పదం-పై పద్యంలో యతి స్థానంలో ఉంది. ఈ యతి మైత్రీపదం- జాంబవతి శరీరంపై సోకిన శ్రీకృష్ణుని చూపుల మైత్రిలోని గాఢత్వాన్ని ధ్వనింపజేస్తున్నట్లుగా ఉంది. ఇదో విశేషం.

మాటలకందని భావాన్ని చెప్పవలసి వస్తే, తన భావవ్యక్తీకరణకు సరైన పదాలు దొరకనపుడు తెలుగువాడు "తెగయిదైపోవు" అన్న పదాన్ని వాడతాడు సహజంగా తెగ ఇదై పోతూ. జాంబవతి విరహాన్ని చెలికత్తె ఇందుమతి దాదికి తెలియజేస్తూ "అది మొదలుగ నీబిడ తెగయిదియై పోచుండె"(3ఆ-45ప) అని పలికింది. ఈయమ్మ పలికింది- నిజంగా మన అమ్మ నుడికారమే.

భర్త-భార్యను పిలిచి ఏదైనా ఓ విషయాన్ని చెప్పదలచినపుడు గానీ, చనవుగల తోటి వారితో ఏదైనా ఓ విషయాన్ని చెప్పడానికి ప్రారంభించినపుడుగానీ "ఇదిగో!" అనడం తెలుగు వాడికి అలవాటు. ఆ అలవాటును ఈ ఘట్టంలోనే ఇందుమతి దాదితో "ఇదిగో!దాది! యొకండు మాత్రము నిజంబు"(3ఆ-48ప)- అని అలా ప్రదర్శించింది. "ఒకటి మాత్రం నిజం" అనటం కూడా మన అమ్మనుడికారం గలవాడి అలవాటే- అది కూడా ఉంది-పై వాక్యంలో.

"జల్లెడవట్టి"(2ఆ-6ప) "గాలిస్తే"(2 ఆ-4ప) "తామర తంపరగా"(3ఆ-51ప) ఈ "శమంతకమణి"లో అమ్మనుడి "కాంతి" విశేషాలు కనులకు జిగేల్ మనిపిస్తాయి. సరిగా గమనించలేకపోతే ఈ కావ్యంలో శ్రీకృష్ణుడు విరహవేదనకు గురియై జాంబవతి విషయంలో "లంకె బిందెలు చేఁజార్చుకొన్నవాని వడువున?(2ఆ-101 గద్యం) పాఠకులు పరితపించవలసి వస్తుంది. నేలలో దాచిపెట్టబడి తొందరగా ఎవరికీ దొరకని ధనపాత్రల్ని 'లంకె బిందెల'ని వాడడం తెలుగువాడి అలవాటు. 'అయిందా పెళ్ళి' అన్న నుడికారాన్ని గూర్చి చెప్పకపోతే నా 'మనస్సు పీఁకుతుంది'.(2ఆ-108ప)-ఈ కావ్యంలో శ్రీకృష్ణునికి జాంబవతిని చూడాలన్న కోరికతో మనస్సు పీకినట్లుగా. ఇది కూడా అమ్మనుడికారమే. ఈ కావ్యంలో 'అయినదా పెళ్ళి?' అన్న పదాన్ని శమంతకమణి కోసం వెదకడానికై జాంబవంతుని గుహ దగ్గరికి వచ్చి, జాంబవతి చెలికత్తెలతో శ్రీకృష్ణుడు మాట్లాడుతూ పలికాడు.

ఇక్కడ జాంబవతి చెలికత్తెలు తనపేరుచెప్పి ప్రవేశించమని గద్దించారు. ఆ గద్దించిన చెలికత్తెలతో కృష్ణుడిలా అన్నాడు. 'ఊడల మీద ఉయ్యాల లూగుతున్న కోతి జాతి' నీకు బాగా అయిందా పెళ్లి' అన్నట్లుగా నన్నే చూస్తున్నాయి. ఈ కోతి జాతి మీకు దూత జనమా?" అని కృష్ణుడు ఆ చెలికత్తెల్ని కోతులతో పోలుస్తూ(జాంబవంతుడు పూర్వం కోతులతో స్నేహం ఉన్నవాడే గదా!) పరిహసిస్తూ పలుకున్నాడన్నమాట. ఈ సందర్భంలో రామబ్రహ్మంగారు వాడిన అమ్మనుడి కారంలో 'పెళ్ళి' శబ్దం ఉండడం వల్ల ఈ కావ్యంలో కథలో మున్నుందు జాంబవతీ

శ్రీకృష్ణుల వివాహం జరుగుతుందన్న విషయం కూడా ధ్వనిస్తోంది. ఇలా లోకావలోకన ప్రతిభతో అమ్మనుడికారాలను ప్రయోగించడంలో రామబ్రహ్మంగారి "హస్తవాసి" యే హస్తవాసి. ఇందుకు ప్రసేనుడు సత్రాజిత్తుతో "ఇదియే తొలిసారి యుందా! నిదియే కడసారియనుమ, యింకొక పరినే నేదియు నడగ, ననఁగా నెమ్మది సత్రాజిత్తు సుంత మథనము పడుచుక" అని పలికిన కంద పద్యం తార్కాణం. సత్రాజిత్తును శమంతకమణి కోరుతూ సోదరుడు ప్రసేనుడు" ఇదే తొలిసారి, ఇదే కడసారి" అనడంలో ముమ్ముందు అతదరణ్యంలో సింహం చేతిలో మరణిస్తాడన్న కథ సూచన ఉంది. అన్నట్టు "హస్తవాసి" అన్నది కూడా మన అమ్మనుడికారమే! దీనిని ఈకావ్యంలో సింహం వద్దనున్న శమంతక మణిని గుర్తించి, మణిని స్తుతించిన పిదప, జాంబవంతుడా సింహంతో "పెద్దరిక్కలా ఉన్న ఈ రత్నం నీకాహారమా? ఏ రాజును సంహరించి తెచ్చావో? నీవు నన్ను వీడి ఒక్క అంగ గూడా ఏగలేవు. "ఈ ఋక్షేశుని 'హస్త వాసిఁగనఁగా నెంతేని బోఁ జూడమా!"(1ఆ-140ప) అని తన ప్రతాపానికి చెందిన ప్రాశస్త్యాన్ని పైపద్యవాక్యంలో ప్రయోగించారు- ఈ కవి జాంబవంతుని పరాక్రమ సామర్థ్యాన్ని చాటే "హస్తవాసి" పదాన్ని చాలా సమర్థవంతంగా ప్రయోగించారు- రామబ్రహ్మం గారు.

"చీమ చిటుకన్న యులివును జెవికిఁజేరు"(2 ఆ-17ప)" చిటుకుమన్నది చిన్నారి చీమ యైన! నాతఁదేతెంచెనేమోయటన్న యాశ?(3ఆ-41ప) ఈపద్యాల్లో మొదటిది"చీమ చిటుకు" మన తెలుగునుడికారం. రెండవది కొద్దిగా తిరుగబడినపలుకుబడి. ఉప్పం దించడం "తెలుగువాడి నిత్య కృత్యమే! ఈ కావ్యంలో ప్రాతఃకాల వర్ణనలో"... ఆద్కుదుప్పునందించెనో" (4ఆ-41ప) అని వాడి, సూర్యునిచే ఉప్పందించారు-బేతవోలువారు. "అడగనివాడిది పాపం-అతడు గొప్పదాత" అంటూ ఉంటాడు- తెలుగువాడు. ఓ వృద్ధవిప్రుడు బలరామునితో చెబుతున్నట్లుగా- శమంతకమణి ద్వారా దాతలను సంతుష్టి పరచిన వానిని(అక్రూరుని) ప్రస్తావిస్తూ "అడిగిన వానిది పాపంబడిగిన యంతయు నతఁడునడిగినయంతన్..."(5ఆ-55ప) అన్న పద్యంలో ఆ పలుకుబడిని వాడి, దాని పలుకుబడిని పెంచారు- రామబ్రహ్మం గారు. సంస్కృత పదాలతో కూడి ఉన్నా- తెలుగువాడు పలికే పలుకుబడుల్లో ఒకటి "అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది" అనడం. దీనిని "ప్రబల నిశ్శబ్దమదియును రాజ్యమేలు(2ఆ -17 ప) అని ఒకచోట వాడారు. "గుప్పుమనడం" పాతాళం చూపించడం, మచ్చమాపడం, బ్రహ్మరథం- అన్న పలుకుబడులకు కూడా ఈ కావ్యంలో పెద్దపీట లభించింది.

అలాగే- తెలుగు దేశీయమైన ఛందస్సులైన సీసపద్యం, తేటగీతి పద్యం- కొద్దిగా వచనం-సంస్కృత భాషా రూపమైన ఓ లేఖగా ఈ కావ్యంలో "శ్రీమతే కాశీపురీ నృపాలాయ, శ్వఫల్క నామ్నాతి విభానురాయ...''(5ఆ-38వ) "శ్రీ శమంతక భరణాయ శిష్టగేయ..."(5ఆ-39ప)"శుభాకాంక్షా పూర్వకం ప్రేషితేయం మమలేఖా..."(5ఆ-40వ వచనం) అన్న రీతిలో విశిష్టంగా కానవస్తాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే- అమ్మనుడికారాలకు అక్షరాలా గుడి- ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారి గద్య పద్యాత్మక "శమంతకమణి" కావ్యం.

( 48వ పుట తరువాయి ...)

ఇప్పటి దాకా మనం ద్వాదశాంగాల్లో -ప్రతీత్యసముత్పాదంలోని 12 భాగాల్లో- 3 దశల్ని, లేదా మూడు భాగాల్ని చూశాం.

అవి 1. అవిద్య ( ఎలక్ట్రాన్, ప్రోటాన్ల దశ) 2. సంఖారాలు (మూలకాలు, పదార్థం దశ) 3. విజ్ఞానం ( జీవపదార్థం, బీజకణాల దశ)

ఈ మూడు విభాగాల్ని గతజన్మకు సంబంధించిన విభాగాలుగా బౌద్ధం చెప్పింది.

మనకు మన జ్ఞానేంద్రియాలు మొలిచే వరకూ లేదా మనకు మన ఆకారం మొదలయ్యే వరకూ ఉన్న దశలు ఇవి. ఈ దశల్లో మానవ పిండాన్ని తెచ్చి చూపితే ఇది మానవపిండం అని ఎవ్వరూ చెప్పలేరు. దాదాపు జీవుల పిండాలన్నీ ఇలా ముద్దల్లానే ఉంటాయి. అయినా ఈ పిండంలోనే ఆయా జీవుల ఆకారం, అస్థిత్వం అన్నీ 'దాగి' ఉంటాయి. విత్తనంలో మొలకలా, కొమ్మలో దాగిన చిగురులా.

బౌద్ధం 'గతజన్మ' అని అంది దీన్నే. స్త్రీ పురుష బీజాల కలయికను 'పునస్సంధి' అనే అంది.

ఇక, నాలుగోదైన 'నామరూప దశ' నుండి ప్రస్తుత 'జన్మ దశ' మొదలవుతుంది.

(దాన్నిక వచ్చే సంచికలో చూద్దాం.)

## కవిత భావాలతో కలిపేది భాష

మమతల మల్లెల పరిమళం
మన తెలుగు భాష
తొలకరి వర్షపు జల్లులు కురిపించే తల్లిభాష
గుండెలను ఆవిష్కరించేది మాతృభాష
కమ్మని పిలుపుల సెలయేటి గలగలల భాష తెలుగు
ప్రేమను పంచే భాష
మనిషిని తట్టి లేపే భాష
ఆత్మీయతను కురిపించేది
మన తెలుగు భాష
మనసులను కలిపేది మల్లె వంటి మన తెలుగు భాష
అలసిన గుండెలకు
పన్నీటి జల్లులు చిలికేది తెలుగు భాష.
నిద్ర నుండి మెలకువ కల్గించే భాష
కళ్ళకు కట్టినట్లు బతుకు చిత్రం చూపేది తెలుగు భాష.
నవ్విస్తుంది, కవ్విస్తుంది, ఏడిపిస్తుంది
ఈ సమాజం పొరల్లోంచి హృదిలోకి జారే భాష
బాధించే మనసులను ఒక్కటిగా చేసేది తెలుగు భాష
తల్లిభాష , జీవభాష , పల్లెభాష, మనిషి భాష
సోయగాల భాష
తెలంగాణ భావాల తెలుగు భాష.

మహమ్మద్ ఖాజామైనుద్దీన్
9396626276

# తెలుగు మాధ్యమంలో చదివినవారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉండాలి
# మాతృభాషలో బోధన సాగిస్తేనే భాషను రక్షించుకోగలం



గిడుగు రామమూర్తి 155వ జయంతి సందర్భంగా ప్రవాసాంధ్ర ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో భిలాయిలో 'తెలుగు భాషా దినోత్సవం' నిర్వహించారు. ఆగస్టు 29న సెక్టార్ -1 నెహ్రూ సాంస్కృతిక భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులంతా 'తెలుగు మాధ్యమంలో చదువుకునే వారికి ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలి' అనే తీర్మానాన్ని ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలని నిర్ణయించారు.

సభకు అధ్యక్షత వహించిన ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి అధ్యక్షుడు ఎల్.రుద్రమూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంగ్లీషు మీడియం పాఠశాలలను ప్రారంభించడం చూస్తే తెలుగు భాషాభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదనిపిస్తుంది. నేడు ఉపాధిలేని చదువుల్ని ఎవ్వరూ ఆదరించడం లేదు. తెలుగు మాధ్యమంలో చదువుకునే వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించినప్పుడే తమ పిల్లలను తెలుగు మాధ్యమంలో చదివించడానికి ముందుకు వస్తారన్నారు. గాయకుడు టి. పార్థసారథి మాట్లాడుతూ హిందీ వ్యాప్తికి వారోత్సవాలు ఎలా నిర్వహిస్తున్నారో అలానే తెలుగు వారోత్సవాలు కూడా నిర్వహించి పిల్లలకు, పెద్దలకు తెలుగుకు సంబంధించిన వివిధ పోటీలు నిర్వహించాలని సలహా ఇచ్చారు. **భిలాయిలోని తెలుగు మాధ్యమం పాఠశాలలు హిందీ మాధ్యమంలోకి మారడం పట్ల విచారం వ్యక్తం చేశారు.** సి.హెచ్. గణపతి మాట్లాడుతూ నేడు ఇంగ్లీషులో మాట్లాడేవారిని గొప్పగా చూస్తామని తెలుగులో మాట్లాడటం నామోషీగా భావిస్తున్నామన్నారు. తెలుగు భాష మృతభాషగా మారకముందే మేల్కొనాలని పిలుపునిచ్చారు. మండలి కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, 'భిలాయివాణి' సంపాదకుడు ఎం.బాబూరావు మాట్లాడుతూ తెలుగును పరిపాలనా రంగంలో, చట్టాలలో కూడా ఉపయోగించాలని, మొదట్లో భాషాపరమైన ఇబ్బందులు ఎదురైనా రానురానూ అవి తొలగిపోతాయని అన్నారు. మాతృభాషలో బోధన సాగిస్తేనే భాషను రక్షించుకోగలమని, అందుకే ఇంటర్మీడియట్ వరకు తెలుగు ఒక సబ్జెక్టును తప్పనిసరి చేయాలని, అలాగే తెలుగు మాధ్యమంలో చదువుకొనే వారికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ తప్పనిసరి చేస్తే తెలుగు సజీవంగా ఉంటుందని అన్నారు.

## 'భిలాయివాణి' పురస్కారానికి కవితలకై ఆహ్వానం

తెలుగు – హిందీ భాషల్లో గత పద్దెనిమిది సంవత్సరాలుగా వెలువడుతున్న ద్విభాషా పత్రిక 'భిలాయివాణి' జాతీయ స్థాయి తెలుగు కవితల పోటీకి కవితలను ఆహ్వానిస్తోంది. కవిత ఏ సామాజిక అంశంపైనైనా 20 నుండి 40 లైన్లకు మించకుండా ఉండాలి. ఇంతకు ముందెక్కడా ప్రచురితం / ప్రసారితం కాలేదని, దేనికీ అనుసరణ / అనుకరణ / అనువాదం కాదనీ, ఏ బ్లాగులోనూ పెట్టలేదనీ, మరెక్కడా పరిశీలనలో లేదని హామీ పత్రం జత పర్చాలి. కవితలు టైపు చేసి పంపాలి. కవితలు పంపేవారు 'భిలాయి వాణి' సభ్యులై ఉండాలి.

ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన కవితలకు వరుసగా 2000/–, 1500/–, 1000/– రూ. నగదు, శాలువ, ప్రశంసా పత్రంతో కవిని సన్మానిస్తారు. విజేతలు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని బహుమతి అందుకోవాలి. కవితలు భిలాయి వాణి, 19–సి, క్రాస్ స్ట్రీట్ – 1, సెక్టార్ – 1, భిలాయ్ – 490 001 కు 2018 అక్టోబరు 20 లోగా పంపాలి. వివరాలకు : 9827408575, 8374134200.

## ఎక్స్‌రే 2018 జాతీయస్థాయి అవార్డు కవితలకు ఆహ్వానం


2018 జాతీయ స్థాయి అవార్డుకు కవితలను ఆహ్వానిస్తున్నారు. ప్రథమ అవార్డు రు. 10,000/– నగదుతో పురస్కారం.
మరో పది ఉత్తమ కవితా పురస్కారాలు –
గడువు :31.10.2018. వివరాలకు : 'ఎక్స్‌రే' విజయవాడ. ఫోన్ : 0866 –2434223

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లిభాష**

# గ్రంథాలయం



**ఎవరి దుఃఖమో అది : కవిత్వం**
రచన : డా॥ ఎన్.గోపి
పుటలు: 154, వెల: రు.150/-,
ప్రతులకు: ఎన్. అరుణ, ఇం.నెం. 13-1/5బి,
శ్రీనివాసపురం, రామంతపూర్, హైదరాబాద్-13
సెల్ : 09391028496



**మార్క్స్ రాసిన 'కాపిటల్' పుస్తకం ఏం చెప్పింది? :**
పరిచయ పాఠాలు
రచన : రంగనాయకమ్మ
పుటలు:216, వెల: రు.100/-
ప్రతులకు : అరుణా పబ్లిషింగ్ హౌస్,
ఏలూరు రోడ్డు, విజయవాడ -2,
సెల్ : 9440630378




**కొత్తపొద్దు : మౌని కథలు**
రచన : డా॥ త్యాగదుర్గం మౌని ;
పుటలు: 376, వెల: రు.300/-,
ప్రతులకు: అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు మరియు
డా॥ మౌని, ప్లాట్‌నెం. 71, 'శ్రీభాగ్యసుధ'
యల్.యస్.నగర్, తిరుపతి - 517502
సెల్ : 8074631328



**పంచశీల : వ్యాసాలు**
రచన: బొర్రాగోవర్ధన్, పుటలు: 74,
వెల: రు.100/-, ప్రతులకు : ఆర్ట్స్ అండ్ లెటర్స్,
హైదరాబాద్ స్టడీ సర్కిల్, 1-2-365/25/సి,
ఇందిరా పార్క్ క్రాస్‌రోడ్స్, దోమలగూడ,
హైదరాబాద్ - 520 029; ఫోన్ :
040-27635654,



**కిరాతార్జునీయం:** అనువాద పద్య కావ్యం;
రచయిత : డా॥ శ్రిష్టి చంద్రమౌళి శర్మ,
పుటలు: 104, వెల: రు.100 /-
ప్రతులకు: ఎస్.సీత, 26-30-2/ఎ, 3వ వీధి,
ఏ.టి. అగ్రహారం, గుంటూరు - 522 004
సెల్ : 9441325515




**శ్రీదేవి గాథలు :**
దసరా నవరాత్రుల విశిష్ట కథలు ;
రచన:అల్లీ రామకృష్ణ
పుటలు: 124, వెల: రు.100/-,
ప్రతులకు: లోకేష్ మణికంఠ ప్రచురణలు
కలికిరి - 517234, చిత్తూరు జిల్లా, నవ్యాంధ్ర
సెల్ : 9703520064




**చెప్పాలని ఉంది:**వ్యాసాలు, రచన : ఎస్.ఆర్.పృథ్వి
పుటలు: 142, వెల: రు.120/-,
ప్రతులకు: శ్రీమతి ఉషారాణి, 3-866, ఎం.జి.వీధి,
రామకృష్ణ నగర్, రాజమహేంద్రవరం - 533 101
ఫోన్: 94939 87332




**కాత్య :** హిమాలయ యోగినుల యథార్థ
అనుభవాలకు కాల్పనిక సామాజిక కథలు ;
రచన:ఆచార్య రాణి సదాశివమూర్తి;
పుటలు: 118, వెల: రు.80/-,
ప్రకాశకులు: శివ తరుణి పబ్లికేషన్స్, 'సుమేరు',
23-2-204, ప్లాట్ నెం. 17, టిటిడి ఫేజ్ 2
ఫ్లాట్స్, యం.ఆర్.పల్లి, తిరుపతి - 517502




**చలం చైతన్య జీవనం**
సంకలనం : ఆళ్ళ గురుప్రసాదరావు, గాలి ఉదయ
కుమార్, పుటలు : 50, వెల: రు.60/-,
ప్రతులకు: చలం ఫౌండేషన్, బి-205,
కె.ఎస్.ఆర్ గ్రీన్‌వ్యాలీ, సబ్ స్టేషన్‌రోడ్డు, మాధవధార,
విశాఖపట్నం - 18



**వరిగొలుసులు : కవిత్వం**
రచన : అన్నవరం దేవేందర్,
పుటలు:104, వెల: రు.125/-
ప్రతులకు : ఏదునూరి రాజేశ్వరి, ప్లాట్‌నెం. 406,
మారుతీ హెవెన్స్, భగత్ నగర్,
కరీంనగర్ - 505 001.
సెల్ : 9440763479



**బోధి మకరందాలు : కవిత్వం**
రచన: తియ్యగూర సీతారామిరెడ్డి
పుటలు:114, ప్రతులకు :తియ్యగూర సీతారామిరెడ్డి,
మోదుకూరు పోష్టు, చుండూరు మండలం,
గుంటూరు జిల్లా - 522 318
సెల్ : 9491336258



**చౌరస్తాలో సముద్రం : కవిత్వం**
రచన: సంగెవేని రవీంద్ర, పుటలు: 108,
వెల: రు.100/-, ప్రతులకు : ది పొయెట్,
సి.వి. కాంపౌండ్ 7/4, హనుమాన్ లేన్, లోవర్
పారెల్, ముంబయి 400 013 ; ఫోన్ :
099871 45310

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

## డా॥ ఏటుకూరి ప్రసాద్‌గారికి
## తాపీ ధర్మారావు 'జీవన సాఫల్య పురస్కార' సభ (16–9–2018)




'నాతో సహా ఎందరో జీవితాలపై తాపీ ధర్మారావు సాహిత్యం ప్రభావం చూపింది'

– జస్టిస్ టి. రజని

'పత్రికారంగంలో తాపీధర్మారావు ఎన్నోమార్పులు తెచ్చి, ఎందరో రచయితలను తీర్చిదిద్దారు'

– డా॥ ఏటుకూరి ప్రసాద్

'ఏటుకూరి ప్రసాద్‌గారికి తాపీ జీవన సాఫల్య పురస్కారం కొంత ఆలస్యంగా వచ్చింది'

– డా॥ కె. శ్రీనివాస్

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
October 2018 Vol :4, Issue 8 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/13/2018-20




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244